అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 10-10-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 232 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

ప్రోటీన్‌పై అధ్యయనం

డేవిడ్ బాకర్, డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం. జంపర్‌కు అవార్డు



11లో..

కాంగ్రెస్‌వి విషబీజాలు

ప్రధాని మోడీ తీవ్ర ఆరోపణలు



ముంబయి: ప్రధాని మోడీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ హిందువులను విభజించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హర్యానా ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన ...11లో

హర్యానా ఫలితాలను విశ్లేషిస్తాం

జమ్మూలో గెలుపు రాజ్యాంగ విజయం : రాహుల్



న్యూఢిల్లీ : హర్యానాలో అనూహ్య ఫలితాలపై విశ్లేషణ చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియపై తమకు అందిన ఫిర్యాదుల గురించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తామన్నారు. 'హర్యానాలో అనూహ్య ఫలితాలపై విశ్లేషణ చేస్తున్నాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటి గురించి ఎన్నికల సంఘానికి తెలియజేస్తాం. హర్యానాలో పార్టీ గెలుపు కోసం తీవ్రంగా ...11లో



పదినెలల్లోనే టీచర్ కొలువులిచ్చాం

కేసీఆర్ పదేండ్లు విద్యాశాఖను పట్టించుకోలే...

ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

- కొత్త టీచర్లకు ముందే దసరా పండుగ వచ్చింది
- సమాజానికి వారధులు, భవిష్యత్ నిర్మాతలు మీరే
- సర్కారు బడులు పిల్లలను గొప్పగా తీర్చిదిద్దాలి
- తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర కీలకం
- ప్రయివేటు స్కూళ్లలో మీకంటే ఎక్కువ చదువుకున్న వారు ఉన్నారా?
- తాళి, పుస్తెలమ్మి కాన్వెంట్లకు పిల్లలు
- ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలి
- ఒలింపిక్స్ పతకాలే లక్ష్యంగా త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్టుగా ఉంది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కొరివి దెయ్యాన్ని రెండుసార్లు గెలిపించారు. నిరుద్యోగ యువత కలలు సాకారమవుతాయని ఆశించారు. ఉద్యోగ ఖాళీలు భర్తీ అవుతాయని భావించారు. కానీ 2019 పార్లమెంటు ఎన్నికల్లో కవిత ఓడిపోతే ఆమెకు ఎమ్మెల్సీ, బోయినపల్లి వినోద్‌కుమార్ ఓడిపోతే ఆయనకు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి ఇచ్చారు. కానీ తెలంగాణ వచ్చాక యువతకు ఉద్యోగాలు ఎందుకివ్వలేదు. పదేండ్లలో విద్యాశాఖను పట్టించుకోలేదు. దశాబ్దకాలం ఉపాధ్యాయ నియామకాలను చేపట్టంపై శ్రద్ధ చూపలేదు. 2017లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి 2019లో నియామకాల ప్రక్రియ ప్రారంభించారు. మేం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 11 వేల మంది ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నియామకాలు చేపట్టి ప్రక్రియను పూర్తి చేశాం. 65 రోజుల్లోనే ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశాం.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'కొలువుల పండుగ-2024 పేరుతో 11,062 పోస్టులకు ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత' కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో విద్యాశాఖ నిర్వహించింది. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టులకు 10,006 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు ఎంపికయ్యారు. కొంత మంది అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. మిగిలిన వారికి జిల్లాల వారీగా డీఈవోలు, ఇతర ఉన్నతాధికారులు ఇచ్చారు. కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల 1,056 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు.'2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మార్పు కావాలి, కాంగ్రెస్ రావాలి అని పిలుపునిచ్చాం. ఇందిరమ్మ రాజ్యం తేవాలని చెప్పాం. మీకు ఉద్యోగాలు రావాలంటే, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలి. అప్పుడే మీకు కొలువులొస్తాయి. కాంగ్రెస్ రావాలని మీరు భుజాల మీద వేసుకుని మా కార్యకర్తల కంటే ఎక్కువ బాధ్యత తీసుకున్నారు. మీ వల్ల మాకు కొలువులు ...2లో

భూములు, ఉద్యోగాలు మాకే దక్కేలా చూడాలి

సీఎం రేవంత్‌కు ఆదివాసీ సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తి

దీపావళిలోపు సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం : సీఎం హామీ

వివరాలు 11లో

జనవరి నుంచి సన్న బియ్యం

రేషన్‌కార్డుల ద్వారా పంపిణీ



మూడ్రోజుల్లోనే రైతులకు ధాన్యం డబ్బులు

వారం పది రోజుల్లో రెండు లక్షలపై రుణాల మాఫీ : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి నల్లగొండ

వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున సన్నాల సాగును ప్రోత్సహిస్తున్నట్టు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం డబ్బులను మూడ్రోజుల్లోనే రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తామని చెప్పారు. నల్లగొండ జిల్లాలో గత సీజన్‌లో కూడా ధాన్యం కొనుగోళ్ల తర్వాత మూడ్రోజుల్లోనే చెల్లింపులు చేసినట్టు గుర్తు చేశారు. వానాకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏవైనా ఇబ్బందులు ఏర్పడినా.. చెల్లింపులు ఆలస్యమైనా జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9963407064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ...11లో

ధాన్యం సేకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ నియామకం

11లో..

రేషన్ షాపుల్లో ఉచిత బియ్యం పొడిగింపు

2028 డిసెంబర్ వరకు పంపిణీ | ఇతర సంక్షేమ పథకాలూ కొనసాగింపు

లోథాల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌కు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఎవై) సహా అన్ని ప్రభుత్వ పథకాల్లో భాగంగా ఫోర్టిఫైడ్ రైస్ ఉచిత పంపిణీ, ఇతర సంక్షేమ పథకాల కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ 2028 డిసెంబర్ వరకు ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేసేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్టు చెప్పారు. ఈ పథకాన్ని మరో నాలుగేండ్లు పొడిగిస్తున్నట్టు తెలిపారు. ఆహార సబ్సిడీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వంద శాతం నిధులు సమకూర్చుతుండడంతో 'పీఎంజీకేఎవై' ద్వారా బియ్యంలో పోషకాల చేరిక కేంద్రీయ పథకంగా కొనసాగుతుందని, తద్వారా ఏకీకృత వ్యవస్థలతో పథకం అమలు సాధ్యమవుతుం దని అన్నారు. ఏప్రిల్ 2022లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ పథకాన్ని ఆమోదించిందని, మార్చి 2024 నాటికి ఇప్పటికే మూడు విడుతలుగా పూర్తయ్యాయని తెలిపారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.17,082 కోట్లు ఖర్చు చేస్తుందని, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్-ఎస్ఎఐ) ప్రకారం.. సాధారణ బియ్యంలో పోషకాలను జోడించి ఫోర్టిఫైడ్ రైస్ తయారు చేస్తారని తెలిపారు. ప్రజల ఆహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సూక్ష్మపోషకాలు జోడిస్తారని అన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ నాణ్యతను పరీక్షించేందుకు 27 ఎన్ఎబీఎల్ ల్యాబ్స్‌ను వినియోగిస్తామని, విటమిన్ మినరల్ ప్రీమిక్స్ టెస్టింగ్ కోసం 11 ఎన్ఎబీఎల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇందుకు అవసరమైన సప్లై చైన్ డెవలప్‌మెంట్ కోసం రూ.11,000 కోట్లు పెట్టుబడి పెడతామని మంత్రి తెలిపారు.లోథాల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ అభివృద్ధికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, దీనివల్ల 22,000 ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. వివిధ దశల్లో ఈ ఎన్ఎంహెచ్‌సీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాజస్థాన్, పంజాబ్ దేశ సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోద ముద్రవేసిందని అన్నారు. రూ.4,406 కోట్లతో 2,208 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.





హలో..హలో.. ఆగండీ..

జీవీపీ పాయింట్ల వద్ద చెత్త వేస్తే సైరెన్

చెత్త సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ ప్రయత్నం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హలో.. హలో.. ఆగండీ.. సీసీ కెమెరాలో మీరు కనిపిస్తున్నారు. చెత్త వేస్తే రూ.1000 ఫైన్ పడుతుంది అంటూ నగరంలోని గార్బేజ్ వాల్నరబుల్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన మైక్‌లు హెచ్చరిస్తున్నాయి. జీహెచ్ఎంసీని ...11లో

లౌకికవాద శక్తులకు విలువైన పాఠాలు

రెండు రాష్ట్రాల ఫలితాలపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో వ్యాఖ్య



న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్, హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పరస్పర విరుద్ధమైన ఫలితాలు వెల్లడయ్యాయి. జమ్మూ కాశ్మీర్‌లో ఇండియా బ్లాక్ ఘన విజయం సాధించగా, హర్యానాలో అనూహ్యమైన పరాజయాన్ని చవి చూడాల్సి వచ్చింది. ఈ ఫలితాలతో రాబోయే రోజుల్లో బీజేపీపై సాగించే పోరాటంలో లౌకికవాద శక్తులు విలువైన పాఠాలను నేర్చుకుంటాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. ఆరేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలన తర్వాత మొదటిసారిగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీని జమ్మూ కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ దాని మిత్రపక్షాలు గెలుచుకున్నాయి. 370వ అధికరణ , రాష్ట్ర హోదా రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం, నియోజకవర్గాల పునర్విభజనలో కుయుక్తులు, ఎత్తుగడలకు పాల్పడడం ద్వారా ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షలను తుడిచిపెట్టడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాల్పడిన కుతంత్రాలన్నింటినీ తిప్పికొట్టేలా జమ్మూ కాశ్మీర్ ప్రజలు విస్పష్టమైన తీర్పును ఇచ్చారు.

హర్యానాలో, కాంగ్రెస్‌తో జరిగిన గట్టి పోటీలో బీజేపీ మెజారిటీ సీట్లను రాబట్టుకోగలిగింది. కానీ కాంగ్రెస్ కన్నా అతి స్వల్పంగా 0.6శాతం ఓట్ల మార్జిన్ మాత్రమే సాధించింది. సూక్ష్మ స్థాయిలో కుల సమీకరణ, విషపూరితమైన మతోన్మాద ప్రచారం ద్వారా ఈ విజయాన్ని మూటగట్టుకుంది. ప్రజలిచ్చిన ఈ తీర్పుకు కారణమైన ఇతర అంశాలపై కాంగ్రెస్ ఆత్మపరిశోధన చేసుకోవాల్సిన అవసరం వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

ఐదవ సారి కూడా సీపీఐ(ఎం) నేత మహ్మద్ యూసుఫ్ తరిగామిని ఎన్నుకున్నందుకు జమ్మూ కాశ్మీర్‌లోని కుల్గాం నియోజకవర్గ ప్రజలను సీపీఐ(ఎం) అభినందించింది.

కాంగ్రెస్ నేతల్ని నిలదీద్దాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హామీల అమలు కోసం గల్లా పట్టి అడిగేంత వరకు కాంగ్రెస్ మోసగిస్తూనే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలకు సమస్యలు వస్తే కలెక్టర్ల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారనీ, ఓట్ల కోసం వచ్చిన ప్రజా ప్రతినిధులనే నిలదీద్దామని పిలుపునిచ్చారు. బుధవారం ...11లో

పదో సారీ తగ్గేదేలే..

కీలక వడ్డీ రేట్లు యథాతథం : ఆర్బీఐ నిర్ణయం



న్యూఢిల్లీ : ప్రస్తుత పండుగ సీజన్‌లో అయినా అధిక వడ్డీ రేట్ల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశించిన రుణ గ్రహీతలకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరోసారి నిరాశనే మిగిల్చింది. వరుసగా పదో సారి కూడా వడ్డీ రేట్లను హెచ్చు స్థాయిలోనే యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. గతంలో 2023 ఫిబ్రవరిలో ...11లో

నర్సిరెడ్డిని మరోసారి గెలిపిద్దాం

చట్టసభల్లో ఆయన ఉండటం అవసరం

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థిగా మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని, చట్టసభల్లో ఆయన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి అన్నారు. ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

- ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర
- ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి తీవ్ర కృషి : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి
- పలు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఐదున్నరేండ్లుగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యారంగం, ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి లాంటి వారు చట్టసభల్లో ఉండటం అవసరమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య ...2లో

నేడు సద్దుల బతుకమ్మ

ట్యాంక్‌బండ్‌పై ఘనంగా వేడుకలు

అన్ని ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు



10లో

21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

27 వరకు రాతపరీక్షల నిర్వహణ

14 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదు : టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

వివరాలు 10లో

పదినెలల్లోనే టీచర్ కొలువులిచ్చాం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాయి. ఇచ్చిన మాట ప్రకారం మీకు కొలువులు ఇవ్వాల్సిన బాధ్యత మాపై ఉన్నది. అందులో భాగంగానే 90 రోజుల్లో 30 వేల కొలువులిచ్చాం. తెలంగాణ భవిష్యత్ తరాలు మీరే. తెలంగాణ వారధులు, భవిష్యత్ నిర్మాతలు మీరే. సర్కారు బడుల్లో చదివే పిల్లల భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దాలి. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల ఎంతో కీలకం.'అని రేవంత్‌రెడ్డి చెప్పారు.'ఉపాధి హామీ పనికి వెళ్లే వారు, ఒక పూట తిని, తినకుండా పేదలు తాళి, పుస్తెలమ్మి ప్రయివేటు స్కూళ్లకు పిల్లలను పంపిస్తున్నారు. సర్కారు బడులకు పంపిస్తే బంధువుల ముందు నామోషీగా భావిస్తున్నారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలి. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది. సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత మీది. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. స్వయం సహాయక బృందాల ద్వారా మౌలిక వసతులను కల్పిస్తున్నాం. వారిని భవిష్యత్తులో డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ఐఏఎస్, ఐపీఎస్, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కాన్వెంట్ స్కూళ్లలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దే క్షేత్రం ప్రభుత్వ బడి. రాష్ట్రంలో గురుకులాలతో కలిపి 30 వేల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 24 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. పది వేల ప్రయివేటు పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రయివేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా?.'అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

'రాష్ట్రంలో వెయ్యి గురుకులాలను యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల స్కూళ్లను 25 నియోజకవర్గాల్లో ఈనెల 11న ప్రారంభిస్తున్నాం. రూ.125 కోట్లతో 25 ఎకరాల్లో కార్పొరేట్‌కు దీటుగా విశ్వవిద్యాలయాల స్థాయిలో ఏర్పాటు చేయబోతున్నాం. 2,500 మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో ఉంటారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకోవడం గర్వంగా భావించాలి. విద్యకు బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు కేటాయించాం. 65 ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా ఆధునీకరిస్తున్నాం. రూ.400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, రూ.2 వేల కోట్లు టాటా కంపెనీ భరిస్తాయి. నిరుద్యోగులు, గ్రామీణ యువతకు సాంకేతిక నైపుణ్యం అందిస్తాం'అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

'డీఎస్సీ నోటిఫికేషన్‌ను, ఉపాధ్యాయ నియామకాలను అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు, గుంటనక్కలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్‌ను అడ్డుకోవడానికి కుట్రలు చేశాయి. వాటిని అధిగమించి నియామక పత్రాలు ఇచ్చాం. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కండ్లల్లో కారం పెట్టుకొంటారు. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. ఏటా 1.10 లక్షల మంది పట్టాలు తీసుకుని బయటికి వస్తారు. ఓ ఇంజినీరింగ్ విద్యార్థి జీతం ఎంతకావాలని అడిగితే రూ.15 వేలు ఇస్తే చాలంటున్నారు. అదే ఓ మేస్త్రీని నెలకు ఎంత కావాలని అడిగితే రూ.60 వేలు కావాలంటున్నారు. నైపుణ్యానికి, చదువుకు మధ్య తేడా ఉన్నది. సాంకేతిక నైపుణ్యం ఉంటేనే రాణించగలుగుతారు. అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నాం. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాన్ని నేర్చుకుని అక్కడే ఉద్యోగాలు పొందే అవకాశాలను మెరుగుపరుస్తాం. విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకొస్తున్నాం. ఫ్యూచర్ సిటీలో 65 ఎకరాల్లో స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించబోతున్నాం.'అని రేవంత్‌రెడ్డి అన్నారు.

'ఒలింపిక్స్ పోటీల్లో భారత్ పరిస్థితి ఏంటో చూశాం. నాలుగు కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వచ్చాయి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో పతకాలు రాలేదు. తెలంగాణ యువత మత్తుకు బానిసలవుతున్నారు. వ్యసనాలకు బానిసలై యువత తప్పుదోవ పడుతున్నారు. దొంగతనాలు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా త్వరలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం.'అని రేవంత్‌రెడ్డి వివరించారు. అనంతరం నూతన ఉపాధ్యాయులతో ప్రమాణం చేయించారు.

ఉపాధ్యాయ కొలువులివ్వడం ఆనందంగా ఉంది : భట్టి

దశాబ్దకాలం పాటు పాలించిన బీఆర్ఎస్ హయాంలో కొలువుల కల్పన గురించి ఆలోచించలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రేమ, పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే తపనతోనే డీఎస్సీ నియామకాలను వేగవంతంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టారని గుర్తు చేశారు. డీఎస్సీ వాయిదా వేయాలన్న కుటిల ప్రయత్నాలను తిప్పికొట్టామని అన్నారు. ఈ ప్రభుత్వం నిరుద్యోగులదని చెప్పారు. పది నెలల్లో ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాలివ్వడం కంటే ఆనందం ఏదీ లేదని వివరించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని అన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించామనీ, దాని ప్రకారమే ఉద్యోగ నియామకాలు జరుగుతాయని చెప్పారు. సంపదను పెంచుతామనీ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని వివరించారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ రికార్డు సమయంలో ఉపాధ్యాయ నియామకపత్రాలను అందజేయడం సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ తరగతులను నిర్వహిస్తామని చెప్పారు. త్వరలోనే పోస్టింగులను ఇస్తామని అన్నారు. విద్యార్థి కేంద్రంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ అభిషేక్‌సింఘ్వీ, ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, కోదండరామ్, కూర రఘోత్తంరెడ్డి, ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి, సలహాదారులు కే కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, విద్యాశాఖ అధికారులు శ్రీదేవసేన, ఈవి నరసింహారెడ్డి, లింగయ్య, సమాచార శాఖ కమిషనర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాదు

- మా ప్రభుత్వ తప్పులుంటే ప్రశ్నించు
- అసెంబ్లీకి వచ్చి నిలదీయ్ : కేసీఆర్‌కు రేవంత్ సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బాధ్యత కలిగిన ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు, సూచనలు ప్రభుత్వానికి ఇవ్వాలని చెప్పారు. తాము తప్పు చేస్తే ప్రశ్నించాలనీ, అసెంబ్లీకి వచ్చి నిలదీయాలని కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. అవసరమైతే నిరసన తెలపాలని కోరారు. కానీ బిల్లా, రంగాలను సమాజంపైకి వదిలి కాళ్లల్ల కట్టెలు పెడుతున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. అన్ని చోట్ల ఓడిపోయిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తమకు ఐదేండ్లపాటు ప్రజలు అధికారం ఇచ్చారని చెప్పారు. కానీ ఈ ప్రభుత్వాన్ని వెంటనే పడగొట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇది న్యాయమా?అని అడిగారు. బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారం రాదనీ. తెలంగాణ ప్రజలు ఇవ్వరని అన్నారు.

గంటల వ్యవధిలో తల్లీకొడుకు మృతి

- చందాలతో అంత్యక్రియలు
- ముల్కనూరులో విషాదం

నవతెలంగాణ-భీమదేవరపల్లి



తల్లి మృతిచెందిన రెండు గంటల వ్యవధిలోని కుమారుడి గుండె ఆగిపోయిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో బుధవారం జరిగింది. గ్రామస్తులు చందాలు వేసుకుని వారి అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ముల్కనూరు గ్రామానికి చెందిన చిదురాల శోభా, లక్ష్మణ్ దంపతులు కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. వీరికి ఇద్దరు కుమారులు బాలు, సాయికిరణ్. మూడేండ్ల నుంచి చిదురాల శోభ(40) నడుము నొప్పితో అనారోగ్యానికి గురై లేవలేని స్థితిలో ఉంది. చిన్న కుమారుడు సాయికిరణ్ (20) ఏడాదికాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శోభ బుధవారం ఉదయం మృతిచెందింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న సాయికిరణ్ తల్లి మృతి వార్త తెలియడంతో బోరున విలపించాడు. ఈ క్రమంలో గుండెపోటుతో మృతిచెందాడు. గంటల వ్యవధిలోనే తల్లీకొడుకు మృతిచెందడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వారి అంత్యక్రియలు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్తులే చందాలు వేసుకుని నిర్వహించారు.

రాడార్ కేంద్రంతో వినాశనమే

- మిచిగావ్ అనుభవం చెబుతున్నదదే
- దామగుండం పరిరక్షణకు ప్రజాస్వామ్యయుత ఉద్యమం
- మేధావులు, పర్యావరణవేత్తల్లారా కదలిరండి
- వద్దంటూ ట్వీట్ క్యాంపెయిన్‌కు పిలుపు: దామగుండం పరిరక్షణ సమితి జేఏసీ రౌండ్‌టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాడార్ కేంద్రం ఏర్పాటుతో వినాశనమే తప్ప తెలంగాణ అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగం ఉండదని పలువురు వక్తలు నొక్కి చెప్పారు. ప్రజలు వద్దని గగ్గోలు పెట్టినా వినకుండా అమెరికాలో మిచిగావ్‌లో ఇదే తరహాలో పెట్టిన కేంద్రాన్ని రెండేండ్లకే మూసేశారని తెలిపారు. ప్రత్యామ్నాయ టెక్నాలజీ అందుబాటులో ఉన్న తర్వాత కూడా ఆ కేంద్రం ఎందుకని ప్రశ్నించారు. దామగుండం పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యయుత ఉద్యమం రూపొందిస్తామని చెప్పారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న అడవి ధ్వంసానికి గురి కాబోతున్నా పట్టదా? మేధావుల్లారా.. పర్యావరణ వేత్తల్లారా.. ప్రజల్లారా ఉద్యమంలో కలిసి రండి అని పిలుపునిచ్చారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనుకాడబోమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. పచ్చటి అడవిని ధ్వంసం చేసి రాడార్ కేంద్రం ఏర్పాటు చేయొద్దనీ, రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకునేలా ఆదేశించాలని కోరుతూ రాహుల్‌గాంధీకి, కాంగ్రెస్ అగ్రనేతలకు ట్వీట్లు చేసే క్యాంపెయిన్‌కు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళలు, ట్రాన్స్‌జెండర్ల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ అణుయుద్ధాల కోసమే రాడార్ కేంద్రమనీ, దీని వల్ల వినాశనమే తప్ప అభివృద్ధి ఉండదని స్పష్టం చేశారు. పర్యావరణ క్లియరెన్స్ రిపోర్టును ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. ఆ కేంద్రం నుంచి వెలువడే ఈఎల్‌ఎఫ్ తరంగాలు అత్యంత ప్రమాదకరమైనవని హెచ్చరించారు. రాడార్ కేంద్రం పెట్టడానికి ఎత్తైన, లోతట్టు ప్రాంతాలతో సంబంధం లేదనీ, పచ్చని అడవిని ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటున్నారని నిలదీశారు. ఆ కేంద్రంతో ముమ్మాటికీ భూ, నీటి, వాతావరణ కాలుష్యాలు జరుగుతాయనీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరిగే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. దేవాదాయ భూమిని కాపాడాలని ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ నాయకత్వాలను కలిస్తే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కాబట్టి తామేమీ చేయలేమని చెప్పడం అన్యాయమన్నారు. పైగా, స్వామిజీని అని కూడా చూడకుండా దేశద్రోహి, ఇక్కడుండవ్ అంటూ బెదిరింపులకు కొన్ని శక్తులు దిగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సామాజికవేత్త సజయ మాట్లాడుతూ రాడార్ కేంద్రం అడవిలోనే పెట్టాలని నిబంధన ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారు తీరుపై రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలకు ట్వీట్ చేయాలని పిలుపునిచ్చారు. పూడూరు మాజీ సర్పంచి లక్ష్మయ్య మాట్లాడుతూ పొద్దునలేస్తే దేవుడి పేరుతో రాజకీయం చేసే బీజేపీ నేతలు రామలింగేశ్వరస్వామి దేవాలయం విషయంలో ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ, సీఎం ఒక్కటయ్యారనీ, అందుకే ఆ పార్టీల నాయకులు సప్పుడు చేయడం లేదని అన్నారు. దామగుండ పరిరక్షణ సమితి కన్వీనర్ గీత మాట్లాడుతూ..దామగుండం ఉద్యమాన్ని దేశవ్యాప్త పోరాటంగా మలుస్తామన్నారు. మానవ మనుగడకు ప్రమాదకర ప్రాజెక్టులు అవసరమా? అని ప్రశ్నించారు. తెలంగాణకు భవిష్యత్తులో జరిగే నష్టానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే నిందలు మోపడం తగదన్నారు. ఎన్ఏపీఎమ్ నాయకులు మీరా సంఘమిత్ర మాట్లాడుతూ..ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అంత పెద్ద ప్రాజెక్టుకు రెండుమూడు రోజుల్లో క్లియరెన్స్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దేవాదాయ భూములను చట్టవిరుద్ధంగా అటవీశాఖకు ఎలా మార్చారని నిలదీశారు. కార్యక్రమంలో ఝాన్సీ, బి.విజయ, శాంతి, గిరిజ, దామగుండం జేఏసీ నాయకులు సిద్ధార్థ్, సూర్య ప్రసన్న, అనన్య, లిఖిత, రుచిత్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమానత్వం, గౌరవంపై పోరాడుదాం

- లైంగిక దాడులను అరికట్టడంలో పాలకులు విఫలం
- ప్రత్యామ్నాయ సంస్కృతితో ముందుకు :బతుకమ్మ సంబురాల్లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో మహిళలకు సమానత్వం, గౌరవప్రద జీవితం కోసం తమ సంఘం పోరాడుతుందనీ, ప్రత్యామ్నాయ సంస్కృతిని ముందుకు తీసుకుపోతున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ చెప్పారు. మహిళలపై లైంగిక దాడులను, హింసను అరికట్టడంతో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీఐటీయూ శ్రామిక మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సంబురాల్లో భాస్కర్‌తోపాటు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, పద్మశ్రీ, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, పీవోడబ్ల్యూ నేతలు వి.సంధ్య, ఝాన్సీ, జర్నలిస్టు సజయ, ట్రాన్స్‌జెండర్ సంఘం నాయకులు మీరా సంఘమిత్ర, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీకాంత్, సోమన్న, సునిత, సుధాకర్, సౌత్ జిల్లా అధ్యక్షులు మీనా, కార్యదర్శి శ్రావణ్ కుమార్, రంగారెడ్డి జిల్లా శ్రామిక విభాగం కన్వీనర్ కవిత, మేడ్చల్ వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ రేవతి, కో-కన్వీనర్ శోభ, గ్రామపంచాయతీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఉత్సాహంతో స్టెప్పులు వేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ...పాలకుల విధానాలతో మహిళలు ఇంట్లోనూ, పనిప్రదేశంలోనూ తీవ్ర వివక్షకు గురవుతున్నారని వాపోయారు. ప్రశ్నించే వారిపై లైంగిక దాడులు చేస్తుండటాన్ని బట్టి చూస్తేనే మనం ఏదశలో ఉన్నామో అర్థమవుతున్నదన్నారు. కలకత్తాలో డాక్టర్‌పై లైంగిక దాడి చేసి చంపేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు పాలకులు అండగా ఉండటం, వారిని జైలు నుంచి దండలేసి ఊరేగింపుతో తీసుకురావడం దుర్మార్గమని విమర్శించారు. పురుషులతో పాటు సమానంగా పనిచేస్తున్నప్పటికీ మహిళలకు తక్కువ వేతనాలివ్వడం ఒకరకమైన వివక్షే అన్నారు. పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులను అరికట్టేందుకు పాలకవర్గాలు, సంస్థల యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళలను గౌరవించేలా ప్రతి కుటుంబంలోనూ పిల్లలకు నైతిక విలువల గురించి చెప్పాలని కోరారు. మహిళలను గౌరవించడం ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు.

సుహానా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై దాడి

- మందులు స్వాధీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వరంగల్ జిల్లా కాశీబుగ్గ మెయిన్ రోడ్‌లోని సుహానా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నకిలీ వైద్యులు గుర్రం సదానందం నిర్వహిస్తున్న ఈ సెంటర్‌లో తనిఖీ చేసి అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.10 వేల 21 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ తదితర మందులున్నట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మందులను పరీక్షల కోసం పంపించిన అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

దెబ్బతిన్న పామాయిల్ మొక్కల రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దెబ్బతిన్న పామాయిల్ మొక్కల బాధిత రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం, ఆయిల్‌ఫెడ్ పామాయిల్ గ్రోయర్స్ అసోసియేషన్ డిమాండ్ చేశాయి. బాధిత రైతులకు రూ.60 లక్షల నష్టపరిహారం చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉద్యానశాఖ అమలు చేయాలని కోరాయి. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘాల నాయకులు మూడ్ శోభన్, తుంబురు ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, రైతులు చెలికాని సూరిబాబు, దొడ్డ చక్రధర్‌రెడ్డి తదితరులు విలేకర్లతో మాట్లాడారు. 'పుచ్చకాయల సోమిరెడ్డి కుటుంబం బేతుపల్లి శివారు నారాయణ పురం గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లాలో 12 ఎకరాల వ్యవసాయ భూమిలో 2018లో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ నుంచి 618 పామాయిల్ మొక్కలు తీసుకుని నాటింది. మొక్కలు ఆరోగ్యంగా వుండి పామాయిల్ పండ్ల గెలలు కాయలేదు. అయితే అవి ఖాళీ గెలలు (పోతు గెలలు), అతి చిన్న గెలలు కాస్తున్నాయి. ఈ సమస్యను ఆయిల్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు ఆ తోటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొక్కలు దెబ్బతినట్టు తేల్చారు' అని చెప్పారు. ఈ విషయంలో అధికారులు స్పందించలేదనీ, విధిలేని పరిస్థితుల్లో రైతు హైకోర్టును ఆశ్రయిస్తే అధికారులు తమను వేధింపులకు గురి చేస్తున్నారని రైతు సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నోటీసులిచ్చి విచారణకు హైదరాబాద్‌కు రావాలని వేధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

నర్సిరెడ్డిని మరోసారి గెలిపిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

చావ రవి చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై గతంలో నల్లగొండ నుంచి హైదరాబాదు వరకు పాదయాత్ర నిర్వహించి సమస్యల తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఆయన కృషి చేశారన్నారు. 2018 పీఆర్సీ సందర్భంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 30 శాతం వేతనాల పెంపులో నర్సిరెడ్డి కీలక భూమిక వహించారన్నారు. కేజీబీవీలు, రెసిడెన్షియల్, మోడల్ స్కూల్స్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులకు 9 ఏండ్లు ప్రమోషన్స్, ఆరేండ్లుగా బదిలీలు లేని సందర్భంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రికి, విద్యాశాఖ అధికారులకు పదే పదే విన్నవించడంతో పాటు ఎస్సీటీఈ అధికారులతో మాట్లాడి "టెట్"తో పాటు, ప్రమోషన్ల కల్పనలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. అలాంటి వ్యక్తిని మరోసారి గెలిపించి శాసనమండలికి పంపించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహకరించాలని కోరారు.

పలు సంఘాల మద్దతు

నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పలు సంఘాలు మద్దతు తెలిపాయి. యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ లోథ్, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివింగ్ స్టన్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యల్లయ్య, మైనార్టీ గురుకులాల బాధ్యులు శేషగిరి, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు వినోద్ కుమార్, మల్లయ్య, మోడల్ స్కూల్స్ పాఠశాలల నాయకులు కె.నాగరాజు మద్దతు ప్రకటించారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చిలుక రాములు, దుర్గాభవాని, జిల్లా నాయకులు జివి.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నంది కృష్ణ, బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, షేక్ ఉద్దండు షరీఫ్, డి.నాగేశ్వరరావు, ఎ.సుధాకర్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మంగ్యానాయక్, బన్సీలాల్, బాబురావు, పుట్టా శ్రీనివాసరావు, జితేష్, క్రాంతికుమార్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు సయ్యద్ జియావుద్దీన్, బండి నరసింహారావు పాల్గొన్నారు.

టీజీ జెఎల్ఏ 475 సంపూర్ణ మద్దతు

మరోసారి టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న నర్సిరెడ్డికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ మీడియాతో మాట్లాడుతూ.. నర్సిరెడ్డి విజయానికి సంపూర్ణంగా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

సమిష్టి శక్తిగానే సమస్యల పరిష్కారం : అలుగుబెల్లి

తాను వ్యక్తిగా కాకుండా సమిష్టి శక్తిగానే సమస్యల పరిష్కారానికి కృషి చేశానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఐదున్నరేండ్లుగా విద్యారంగం, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలోనూ, పోరాటాల ద్వారా శక్తి మేరకు కృషి చేశానని తెలిపారు. భవిష్యత్‌లో అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్స్‌లో టైం టేబుల్ మార్పు, కేర్ టేకర్ల నియామకంపై పోరాడుతానన్నారు. కేజీబీవీ సిబ్బంది రెగ్యులరైజేషన్, వారికి కనీస వేతన స్కేల్ కోసం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టుల మంజూరు, డీఈవో, డిప్యూటీ ఇ.ఓ, ఎంఈఓ ప్రమోషన్ల కోసం కృషి చేస్తానన్నారు. మిగిలిన కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులైజేషన్ కోసం పాటుపడతానన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

భూ అక్రమ మార్పిడి కేసులో తహసీల్దార్ అరెస్ట్

- 14 రోజుల రిమాండ్

నవతెలంగాణ-హుజూర్‌నగర్



ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా భూమిని అక్రమంగా మార్చిన కేసులో తహసీల్దార్ అరెస్టయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపి గతంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేసిన వజ్రాల జయశ్రీని బుధవారం హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అరెస్టు చేశారు. అనంతరం ఆమెను సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్ ముందు హాజరుపరచగా.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు ఆమెను సబ్ జైలుకు తరలించారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 ఫిబ్రవరి నుంచి 2020 మధ్య కాలంలో హుజూర్‌నగర్ తహసీల్దార్ వి.జయశ్రీ పనిచేశారు. ఆమె, ధరణి కంప్యూటర్ ఆపరేటర్ జగదీశ్ కలిసి ఉన్నతాధికారులకు తెలియకుండా ప్రభుత్వ భూమిని ఇతరుల పేరున మార్చారు. బూరుగడ్డ హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని 16.30 గుంటల భూమిని పచ్చిపాల ప్రియాంక పేరున, 4.38 ఎకరాల భూమిని జగదీశ్ అక్క మడిపల్లి స్వప్న పేరున, హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల 14.36గుంటల భూమిని తల్లి ప్రియాంక పేరున.. మొత్తం 36.23 ఎకరాల భూమిని ఐఎల్ఆర్ఎంఎస్ పోర్టల్ ద్వారా బదలాయించారు. రూ.14,63,004 రైతుబంధు ద్వారా లబ్ధి పొందారు. ఈ విషయం ఇటీవల వెలుగులోకొచ్చింది. దాంతో కలెక్టర్ ఆపరేటర్ జగదీశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించి విచారణకు ఆదేశించారు. జగదీశ్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. బుధవారం జయశ్రీని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచ్చారు. సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్ ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో సబ్ జైలుకు తరలించారు.

జయశ్రీ, జగదీశ్‌పై సెక్షన్ 220(బి), 406, 409, 420, 467, 468 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తహసీల్దార్ జయశ్రీ ప్రస్తుతం అనుముల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు . సీఐ వెంట హుజూర్‌నగర్ ఎస్ఐ ఉన్నారు.

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి ప్రతీక. పూల రూపంలో ప్రకృతిని, స్త్రీ శక్తిని ఆరాధించే పండుగగా బతుకమ్మ పండుగకు తెలంగాణ సంస్కృతిలో గొప్ప స్థానముంది. అనాదిగా ప్రతి యేడు ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను వేడుకగా జరుపుకుంటారు. ఈ తొమ్మిది రోజులపాటు తెలంగాణ పల్లెలు, పట్టణాలు పూలవనాన్ని తలపించేలా బతుకమ్మలతో కొత్త కళను సంతరించుకుంటాయి. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. అందులో ఒకటి బహదమ్మ (పార్వతి) పేరు మీదుగా బతుకమ్మ అనే పేరు వాడుకలోకి వచ్చి, అదొక ఆచారంగా స్థిరపడిందనే విషయం మనకు తెలిసిందే. బతికించే అమ్మ అనే భక్తి భావంతో ఆ జగన్మాతకు నీరాజనాలు అర్పించటమే బతుకమ్మ పండుగలో ఇమిడి వున్న అంతరార్థం. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ భూమితో, ఈ జలంతో, మానవ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఒక సంబురంగా వేడుకలను జరుపుకోవడమే బతుకమ్మ పండుగ పరమార్థం" అని అన్నారు.

"దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనూ స్థిరపడిన తెలంగాణ బిడ్డలు బతుకమ్మ పండుగను ఇప్పటికీ మరవకుండా జరుపుకోవడం బతుకమ్మ పండుగ ప్రత్యేకతను, బతుకమ్మ పట్ల తెలంగాణ ప్రజలకున్న అభిమానాన్ని చాటుతున్నది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను దేశమంతా చాటేందుకు తెలంగాణ భవన్‌లో అట్టహాసంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నది. ఈ వీరోచిత పోరాటంతో నియంతృత్వ పాలన నుంచి తెలంగాణ రాష్ట్రానికి స్వేచ్ఛా వాయువులు అందించిన కాంగ్రెస్ పార్టీ, అదే ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని మహోజ్వల రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నది. బతుకమ్మ పండుగ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సేవలో పునరంకితమవుతున్నది. భావితరాలకు బతుకమ్మను అందిద్దాం. తెలంగాణ వారసత్వ సంస్కృతిని కొనసాగిద్దాం" అని అన్నారు. ఈ బతుకమ్మ వేడుకలకు పలువురు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భవన్ల అధికారులు, ఇతర సిబ్బంది, ఢిల్లీలోని తెలుగు ప్రజలు హాజరయ్యారు.



లైంగికదాడి కేసులో
దోషికి ఆరుసార్లు పెరోల్
రెండేండ్లలో పదిసార్లు జైలు నుంచి బయటకు

- జైలు అధికారికి కమలం అండ
- బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపు



ఛండీగఢ్: డేరా సచ్చా సౌదా బాబా, లైంగికదాడి కేసులో దోషి అయిన గుర్మీత్ రామ్ రహీమ్‌కు ఆరుసార్లు పెరోల్ మంజూరైంది. మోడీ సర్కార్ డైరెక్షన్‌తో బయటకు వచ్చి బరిలో దిగిన బీజేపీ అభ్యర్థి కం జైలు అధికారి గెలవటానికే పనిచేసినట్టు సమాచారం. హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు జైలు అధికారి పదవికి రాజీనామా చేసిన సునీల్ సాంగ్వాన్ బీజేపీలో చేరారు. దాద్రీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన, కాంగ్రెస్ అభ్యర్థి మనీషా సాంగ్వాన్‌పై 1,957 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ సీటును బీజేపీ గెలుచుకోవడం ఇదే తొలిసారి. 2014లో స్వతంత్ర అభ్యర్థి సోమ్‌వీర్ సంగ్వాన్ దాద్రీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2009లో ఇండియన్ నేషనల్ లోక్ దళ్‌కు చెందిన రాజ్‌దీప్ ఫోగట్ ఈ సీటును దక్కించుకున్నారు.

కాగా డేరా సచ్చా సౌదా చీఫ్, లైంగికదాడి కేసులో దోషి అయిన బాబా గుర్మీత్ రామ్ రహీమ్ గత రెండేండ్లలో పదిసార్లు జైలు నుంచి బయటకు వచ్చారు. తాజాగా హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సెప్టెంబర్ నెలలో ఆయనకు 21 రోజులు పెరోల్ మంజూరైంది. అక్టోబర్ 5న జరిగిన హర్యానా పోలింగ్‌లో ఓటు వేసేందుకు రామ్ రహీమ్‌ను అక్టోబరు 2న జైలు నుంచి విడుదల చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీకి ఓటు వేయాలని ఆరు జిల్లాల్లో విస్తరించిన తన మద్దతుదారులు, అనుచరులకు ఆయన చెప్పినట్టు వార్తలు వచ్చాయి.

మరోవైపు హర్యానాలో బీజేపీ హ్యాట్రిక్ సాధించడానికి రామ్ రహీమ్ కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసే ఆయనను ఎన్నికల సమయంలో జైలు నుంచి విడుదల చేయడం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించడమే నని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల కమిషన్ (ఈసీ)కు ఈ మేరకు ఫిర్యాదు చేసింది.

ఎన్సీ-కాంగ్రెస్‌కు మెజారిటీ ఉన్నా..ఎల్జీ వద్దే 'కీ'
జమ్మూ కాశ్మీర్‌లో మారనున్న రాజకీయం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బీజేపీయేతర సర్కార్ ఉన్న రాష్ట్రాలను ఏవిధంగా ముప్పుతిప్పలు పెడుతుందో తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాలను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు సూత్రధారులుగా ఎలా మారారో.. దీనివెనుక బీజేపీ అధిష్టానం ఎలా చక్రం తిప్పుతుందో చూస్తూనే ఉన్నాం. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని అక్షింతలు వేశాక ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు ఊరట లభించింది. అయితే ఇప్పుడు జమ్మూకాశ్మీర్‌లోనూ అలాంటి పరిస్థితే ఎదురవు తుందా.? అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ కీలకపాత్ర పోషించనున్నారా..? దీనిపై ప్రత్యేక కథనం..



శ్రీనగర్ : దశాబ్దకాలం తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వం తిరిగి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ బ్లాక్ 48 సీట్లు గెలుచుకుంది. 90 సీట్లున్న ఈ అసెంబ్లీలో మెజారిటీ సంఖ్య 46ను దాటేసింది. దీంతో ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అవుతారని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

ఒమర్ అబ్దుల్లా ఒకనాడు జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. అప్పుడు కూడా కాంగ్రెస్‌తోనే పొత్తు పెట్టుకున్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితి గతంలోలా లేదు.

జనవరి 2009 నుంచి జనవరి 2015 వరకు ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, జమ్మూ, కాశ్మీర్ పూర్తి స్థాయి రాష్ట్రంగా ఉంది. దానికి స్వంత రాజ్యాంగం ఉంది. కానీ ఇపుడు సీన్ మారింది. జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా మారింది. జమ్మూలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కంటే కేంద్రం నుంచే ఎక్కువ జోక్యం ఉంటుంది. లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం, అనుమతి లేకుండా ప్రభుత్వం పెద్దగా చేయటానికి ఏమీ ఉండదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

జమ్మూ కాశ్మీర్ ఎలాంటి కేంద్రపాలిత ప్రాంతం?

జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019లో పార్లమెంటులో ఆమోదించబడింది. దీని ద్వారా రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విభజించారు. జమ్మూ.. కాశ్మీర్, లడఖ్ రెండు ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతాలు. జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఉండగా, లడఖ్‌లో అసెంబ్లీ లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 239 ప్రకారం ప్రతి కేంద్రపాలిత ప్రాంతం యొక్క పరిపాలన రాష్ట్రపతికి ఉంటుంది. ఇందుకోసం రాష్ట్రపతి ప్రతి కేంద్రపాలిత ప్రాంతంలో ఒక నిర్వాహ కుడిని నియమిస్తారు. అండమాన్-నికోబార్, ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూ కాశ్మీర్‌లలో లెఫ్టినెంట్ గవర్నర్లు ఉన్నారు. డామన్ డయ్యూ, దాద్రా నగర్ హవేలీ, లక్షద్వీప్, ఛండీగఢ్, లడఖ్‌లలో నిర్వా హకులు ఉన్నారు. పుదుచ్చేరిలో వర్తించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 239ఏ జమ్మూకాశ్మీర్‌కూ వర్తిస్తుంది. అసెంబ్లీని కలిగి ఉన్న ఏకైక కేంద్ర పాలిత ప్రాంతం ఢిల్లీ. ఇక్కడా 239 ఏ వర్తిస్తుంది. ఢిల్లీలోని పోలీస్, ల్యాండ్ , లా అండ్ ఆర్డర్ మినహాయించి మాత్రమే పాలన సాగించే, చట్టాలు చేసే హక్కు ఢిల్లీ ప్రభుత్వానికి ఉంది.

జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి ఎలాంటి అధికారాలు ఉంటాయి?

1947లో జమ్మూకాశ్మీర్ భారత్‌లో చేరినప్పుడు, రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్‌లు మినహా అన్ని విషయాలలో చట్టాలు చేసే హక్కు దానికి ఉంది. ఆర్టికల్ 370 రద్దుకు ముందు, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి అనేక అధికారాలు ఉండగా, పార్లమెంటు అధికారాలు అక్కడి విషయాలకే పరిమితం చేయబడ్డాయి. అయితే, 2019 తర్వాత, జమ్మూ కాశ్మీర్ యొక్క రాజ్యాంగ నిర్మాణం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్ ప్రభుత్వం కంటే పెద్ద పాత్రను కలిగి ఉన్నారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎలాంటి అధికారాలు ఉన్నాయి?

ఇప్పుడు జమ్మూ కాశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్‌కు అన్ని అధికారాలూ ఉన్నాయి. పోలీస్, లా అండ్ ఆర్డర్ మినహా ఇతర విషయాల్లో చట్టాలు చేసే హక్కు ప్రభుత్వానికి ఉన్నప్పటికీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తప్పనిసరి. ఇది మాత్రమే కాదు.. లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికార యంత్రాంగం, యాంటీ కరప్షన్ బ్యూరోపై కూడా నియంత్రణ ఉంటుంది. అంటే లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదంతోనే ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు జరుగుతాయి. అంతేకాక లెఫ్టినెంట్ గవర్నర్ తీసుకునే ఏదైనా చర్య దాని చట్టబద్ధత, ఆయన అలా చేస్తున్నప్పుడు తన విచక్షణను ఉపయోగించాలి. ఆయన విచక్షణను ఉపయోగించలేదనే కారణంతో ప్రశ్నించ లేరు. నిర్ణయం తీసుకునేటప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్ మంత్రి మండలి సలహా తీసుకున్నారా లేదా అనే ప్రాతిపదికన ఆయన నిర్ణయాలేవీ కోర్టులో సవాలు చేయబడవు.

ఎన్నికలకు ముందు కూడా అడ్వకేట్ జనరల్ , లా ఆఫీసర్లను నియమించే హక్కు లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉంది. ఇంతకుముందు జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ పదవీకాలం ఆరేండ్లు. కానీ ఇప్పుడు ఇక్కడ కూడా ప్రభుత్వం ఐదేండ్లు మాత్రమే నడుస్తుంది .అనంతరం ఎన్నికలు నిర్వహించనున్నారు.



పాలస్తీనాకు సంఘీభావంగా
విద్యార్థులు, కార్మికుల నిరసనలు

లండన్ : గాజాలో ఏడాదికి పైగా ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని నిరసిస్తూ మంగళవారం అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో కార్మికులు, విద్యార్థులు పెద్దయెత్తున నిరసన గళాన్ని వినిపించారు. పని ప్రదేశాలు, యూనివర్శిటీలు, పాఠశాలల్లో నిరసన దినాన్ని పాటించారు. ఇజ్రాయిల్‌తో ఆయుధ వ్యాపారాన్ని విరమించాలని వారు తమ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్టాప్ ది వార్ ట్రేడ్ యూనియన్ నెట్‌వర్క్ ఇచ్చిన పిలుపునందుకు బ్రిటన్‌లో కార్మికులు పని ప్రదేశాల్లో ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించారు. విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. బ్రిటన్‌లో అత్యంత పెద్దదైన కార్మిక సంఘం యూనిసన్ ఈ కార్యాచరణకు మద్దతిచ్చింది.స్టాప్ ది వార్ వైస్ చైర్మన్ క్రిస్ నినెహమ్ మాట్లాడుతూ, ఊచకోతకు పాల్పడేవారితో ప్రభుత్వం కుమ్మక్కు కావడాన్ని నిరసిస్తున్నామని పేర్కొన్నారు. బ్రిస్టల్ స్కూల్ స్ట్రైక్ ఫర్ పాలస్తీనా సహ నిర్వాహకుడు ఒకరు మాట్లాడుతూ, మెజారిటీ ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం ప్రతిబింబించనపుడు పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ప్రజలు వీధుల్లోకి వస్తారని అన్నారు.

హర్యానా అసెంబ్లీకి
13 మంది మహిళా ఎమ్మెల్యేలు



చండీగఢ్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈనెల 8 వెలువడ్డాయి. అయితే, ఈ ఫలితాల్లో మహిళా ప్రజా ప్రతినిధుల సంఖ్య ఆందోళనను కలిగిస్తున్నది. తక్కువ సంఖ్యలో స్త్రీలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మొత్తం 90 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో ఎన్నికైలన మహిళల సంఖ్య 13 మాత్రమే. రాష్ట్ర చరిత్రలో ఇదే సంఖ్యలో మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావటం రెండో సారి. ఇక ఈ 13 మందిలో ఐదుగురు బీజేపీకి చెందినవారున్నారు. ఆ పార్టీ ఈ ఎన్నికల్లో 10 మంది మహిళలకు టిక్కెట్లు ఇచ్చింది. అంటే, ఆ పార్టీ స్ట్రైక్‌రేట్ 50 శాతంగా ఉన్నది. బీజేపీ కంటే ఎక్కువగా 12 మంది మహిళలను బరిలో దింపిన కాంగ్రెస్.. ఏడుగురిని గెలిపించుకున్నది. స్ట్రైక్ రేట్ 58 శాతం కంటే ఎక్కువగా ఉన్నది. ఆప్ 11 మంది మహిళలను నిలబెట్టినా.. ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. హర్యానాలో ఈ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో ఎన్నికైన మొత్తం మహిళా ఎమ్మెల్యేల సంఖ్య 100కు చేరుకున్నది. 1966లో పంజాబ్ నుంచి విడిపోయిన హర్యానా.. 1967లో మొదటి ఎన్నికలను చూసింది. ఎమ్మెల్యేలుగా గెలిచిన మహిళల్లో భారత్‌లోనే అత్యంత సంపన్న మహిళ సావిత్రి జిందాల్ ఉన్నారు. ఈమె స్వతంత్ర అభ్యర్థిగా హిసార్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. అలాగే, కాంగ్రెస్ తరఫున జులనా అసెంబ్లీ నియోజకవర్గాన్ని గెలుచుకున్న ఒలంపియన్ వినేశ్ ఫోగట్ ఉన్నారు.

ఏకసభ్య న్యాయ కమిషన్ నివేదిక వచ్చాకే
నూతన నోటిఫికేషన్లు
కమిషన్ రిపోర్టు సమర్పణకు 60 రోజుల గడువు

- ఆ లోగా బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే పూర్తి చేయాలి
- డిసెంబరు 9లోపే నివేదికనివ్వాలి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు
- 'బీసీ సర్వే' పూర్తయితే స్థానిక ఎన్నికలకు వెళ్లొచ్చని దిశా నిర్దేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు ఏకసభ్య న్యాయ కమిషన్‌ను నియమించటంతోపాటు 60 రోజుల్లోనే ఆ కమిషన్ తన నివేదికను సమర్పించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. కమిషన్ నివేదికను సమర్పించిన అనంతరం తదనుగుణంగా రాష్ట్రంలో నూతన నోటిఫికేషన్లు జారీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే తదితరాంశాలపై బుధవారం హైదరాబాద్ లోని సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణపై తమకు అందిన వినతులు, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో వర్గీకరణ అమలవుతున్న తీరు, హర్యానాలో తీసుకుంటున్న చర్యలను ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన మంత్రివర్గ ఉప సంఘ సభ్యులైన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ సీఎంకు వివరించారు. న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిషన్ ఏర్పాటు చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఆ కమిషన్ 60 రోజుల్లో నివేదిక



సమర్పించాలంటూ గడువును నిర్దేశించారు. ఎస్సీ జనాభా లెక్కలకు సంబంధించి 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఏక సభ్య కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలు, కులాల రీగ్రూపింగ్‌కు సంబంధించి ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో విశ్లేషించారు. వాటన్నింటినీ ఏక సభ్య కమిషన్‌కు అందజేయాలని నిర్ణయించారు. క్షేత్ర స్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా కమిషన్ ఉమ్మడి పది జిల్లాల్లో ఒక్కో రోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

తక్షణమే రంగంలోకి దిగాలి

తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సీఎం ఈ సందర్భంగా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సర్వేపై బీహార్, కర్నాటకతోపాటు పలు రాష్ట్రాలు అనుసరించిన విధానాలను అధికారులు ఆయనకు వివరించారు. బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే చేపట్టేందుకు అవసరమైన యంత్రాంగం తమ వద్ద లేనందున, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఓ నిర్ణయం తీసుకోవాలని బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, సీఎంను కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రణాళికా విభాగాన్ని అందుకు కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. బీసీ కమిషన్‌కు రాష్ట్ర ప్రణాళికా విభాగానికి సమన్వయకర్తగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలంటూ సీఎం రేవంత్, ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. 60 రోజుల్లోనే సామాజిక, ఆర్థిక సర్వేను పూర్తి చేయాలనీ, డిసెంబరు 9లోపే ఆ నివేదికను సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఈ సర్వే పూర్తయితే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లొచ్చని అన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కార్యదర్శి వి.శేషాద్రి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి, సీఎం కార్యదర్శులు మాణిక్‌రాజ్, షానవాజ్ ఖాసీం, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీఆర్సీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించండి
చైర్మెన్ శివశంకర్‌కు టీఎన్జీవో, టీజీవోల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీఆర్సీ నివేదికను రూపొందించి మెరుగైన ఫిట్‌మెంట్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని టీఎన్జీవో, టీజీవోలు పీఆర్సీ కమిటీని కోరాయి. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ ఎన్ శివశంకర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీఎన్జీవో, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన స్పందిస్తూ త్వరలోనే పీఆర్సీ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామనీ, ఉద్యోగులు ఆందోళన పడొద్దని కోరినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, సిటీ క్లాస్-4 ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని బలవన్మరణానికి యత్నం

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

తండ్రి మందలించాడని ఓ యువకుడు మనస్థాపం చెంది బలవన్మరణానికి యత్నించిన ఘటన ఖమ్మం జిల్లా ఆళ్ళపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయతీ పాలగుంపుకు చెందిన మొక్కటి కోస అనే యువకుడిని తన తండ్రి అడమయ్య బుధవారం మందలించాడు. దాంతో మనస్థాపానికి గురై క్షణికావేశంలో కోస పురుగు మందు తాగాడని తెలిపారు. కోస మందు తాగిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది అతడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడి ఆసుపత్రిలో కోస ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వారసత్వ ప్రతీక బతుకమ్మ
మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. నేడు జరిగే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆమె తెలంగాణ ఆడపడుచులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ఆరాధన, స్త్రీ శక్తిని కొలిచే పండుగగా బతుకమ్మకు విశిష్ట స్థానమున్నదని అన్నారు.

నవతెలంగాణ

సంపాదకీయం

ఎందుకీ వంచన...?

ప్రభుత్వాలు పటిష్టమైన సామాజిక రక్షణ పథకాలను అమలు జరపనట్లయితే వచ్చే దశాబ్ది కాలంలో ఆసియాలో 26కోట్ల మంది దారిద్ర్యంలోకి దిగజారతారని మంగళవారంనాడు వెల్లడించిన ఐరాస నివేదిక హెచ్చరించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో దారిద్ర్యం పెరుగుతోందని, అసమానతలు విస్తరిస్తున్నాయని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా చూసినపుడు ఈ ప్రాంతంలోని 45శాతం జనాలకు సామాజిక భద్రతా పథకాలు అమలు కావటం లేదు. అమలు జరుగుతున్న పథకాలు కూడా ఎంతమందికి మేలు చేస్తున్నాయన్నది ప్రశ్న. ఈ నివేదిక ఆసియా గురించి చెప్పింది గనుక మనదేశం మినహాయింపు కాదు. మన కేంద్ర ప్రభుత్వం జాతీయ సామాజిక సహాయ పథకం సోషల్ ఆడిట్ 2023 నివేదికను విడుదల చేసింది. 1995 నుంచి ఈ పథకం అమలు జరుగుతోంది. దీని ఐదు ఉపపథకాలు ఉన్నాయి. వాటిలో ఒకటైన వృద్ధాప్య పెన్షన్ కింద అరవై సంవత్సరాలు నిండితే నెలకు రూ.200, 80ఏండ్లు దాటితే రూ.500 ఇస్తున్నారు. ఈ మొత్తాలు ఏమూలకు సరిపోతాయో పాలకపార్టీ పెద్దలు చెప్పాలి. పొరుగు రాష్ట్రం ఏపీలో నెలకు నాలుగు వేలు గరిష్టంగా ఇస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో వెయ్యి రూపాయలకు మించి ఇవ్వటం లేదు, ఇది కేంద్ర ప్రభుత్వ పథకమైనా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచకుండా పాతికేండ్ల నాటి మొత్తాలే ఇస్తున్నది. అంతర్జాతీయ సంస్థల దృష్టిలో ఇదొక ఉద్ధరణ పథకం.

ఒకవైపు కోట్లాది మందిని దారిద్ర్యరేఖనుంచి ఎగువకు తెచ్చి ఉద్ధరించినట్లు మోడీ తన జబ్బలను తానే చరుచుకుంటారు. మరోవైపు సామాజిక సంక్షేమం కింద 80కోట్ల మందికి ఉచితంగా బియ్యం, గోధుమలు ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటారు. అంటే వారంతా దారిద్ర్యంలో ఉన్నట్లే కదా! ఎందుకీ వంచన? విషాదకరమైన అంశం ఏమిటంటే అసలు దారిద్ర్యరేఖకు ప్రాతిపదిక ఏమిటన్న దానిమీద ఇంతవరకు ఏకాభిప్రాయం లేదా ప్రమాణం లేదు. సాంకేతికంగా ఒక ప్రాతిపదికను గుర్తించినప్పటికీ అనేక దేశాల్లో దానికి ఎగువన అనేక కోట్లమంది ఎప్పుడైనా దారిద్ర్యంలో తిరిగి కూరుకుపోయే వారిగా వున్నారు. ఇది ఎలా అంటే గోచిపాత రాయుడు దుర్భర దారిద్ర్యంతో ఉన్నట్లు, చాలీచాలని అంగవస్త్రం చుట్టుకుంటే దాన్నుంచి బయటపడినట్లు పరిగణించటంగా చెప్పవచ్చు. అనుకోని అవాంతరాలు ఏర్పడితే అంగవస్త్రం కూడా కొనుక్కోలేరు. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచ బ్యాంకు 2017లో దుర్భర దారిద్ర్యరేఖ ప్రమాణంగా రోజుకు పిపిపి పద్ధతిలో ప్రతిమనిషికి 1.9డాలర్లుగా ఉన్న దాన్ని 2.15 డాలర్లకు పెంచి అంతకంటే తక్కువ ఆదాయం వచ్చేవారిని గర్భదరిద్రులుగా వర్గీకరించింది. మన కరెన్సీలోకి దీన్ని మార్చుకుంటే రోజుకు ప్రతిమనిషికి రూ.180 కంటే తక్కువ వచ్చేవారని అర్థం. ఎవరికి వారు దీన్ని వర్తింపచేసుకుని తామెక్కడ ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు.



ప్రపంచంలో అత్యధిక ధనవంతమైన దేశంగా పరిగణించే అమెరికాలో అంతకంటే తక్కువ రాబడి వచ్చేవారు 1.2శాతం ఉన్నారు. ఈ కారణంగానే మన దేశంలో ఉచిత బియ్యం ఇస్తున్నట్లు అక్కడ పేదలకు ఆహార కూపన్లను ప్రభుత్వం ఇస్తున్నది. ఇండ్లు లేని వారు మనదేశంలో రోడ్ల మీద పడుకున్నట్లే అక్కడ పార్కుల్లో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు కూడా ఉన్నారు. మనదేశాన్ని 2047 నాటికి ఎక్కడికో తీసుకుపోతామని చెబుతున్న నరేంద్రమోడీ, ఆయనకు భజన చేసే చంద్రబాబు, నితీష్‌కుమార్ వంటి వారు కొలువై ఉన్న మనదేశంలో గర్భదరిద్రులు 12.9శాతం(2022) మంది ఉన్నారు. ఇది ప్రపంచ సగటు తొమ్మిదిశాతం కంటే ఎక్కువ. అదే 3.65 డాలర్లను తీసుకుంటే 44శాతం, 6.85 డాలర్లను తీసుకుంటే 81.8శాతం ఉన్నారు. ప్రపంచ సగటును చూస్తే ఈ తరగతికి కిందకు వచ్చే వారు 9-22.4-44.9 శాతం వంతున ఉన్నారు. కమ్యూనిస్టు నియంతల దేశం, అక్కడ ప్రజాస్వామ్యం ఉండదు అని చెప్పే చైనాలో ఈ అంకెలు వరుసగా 0-0.1-17(2020 సంవత్సరం ప్రపంచబ్యాంకు సమాచారం)శాతం మాత్రమే.

ప్రపంచబ్యాంకు సమాచారం ప్రకారం..2019లో 2.15 డాలర్ల కంటే తక్కువ వచ్చే వారు 64.8కోట్ల మంది ఉన్నారు. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ చెబుతున్నదాని ప్రకారం రోజుకు 1.25 డాలర్ల కంటే తక్కువ ఆదాయం వచ్చేవారు ఆసియా-పసిఫిక్‌లో 70కోట్ల మంది ఉన్నారు. నిజానికి ఈ 1.25 డాలర్లన్నది 1988 నుంచి 2005వరకు 15 అతిపేద దేశాలలో ధరలు, కరెన్సీల విలువను పరిగణనలోకి తీసుకొని నిర్ణయించారు. దీన్లో అసియా నుంచి రెండు దేశాలను మాత్రమే తీసుకున్నారు. నాటికి నేటికి వచ్చిన తేడాను పరిగణనలోకి తీసుకుంటే దారిద్ర్య నిర్మూలన, దారిద్ర్యరేఖ నిర్ణయం అంతా అంకెల గారడీ తప్ప మరొకటి కాదు.

ప్రపంచంలో అత్యధిక ధనవంతమైన దేశంగా పరిగణించే అమెరికాలో అంతకంటే తక్కువ రాబడి వచ్చేవారు 1.2శాతం ఉన్నారు. ఈ కారణంగానే మన దేశంలో ఉచిత బియ్యం ఇస్తున్నట్లు అక్కడ పేదలకు ఆహార కూపన్లను ప్రభుత్వం ఇస్తున్నది. ఇండ్లు లేని వారు మనదేశంలో రోడ్ల మీద పడుకున్న ట్లే అక్కడ పార్కుల్లో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు కూడా ఉన్నారు. మనదేశాన్ని 2047 నాటికి ఎక్కడికో తీసుకు పోతామని చెబుతున్న నరేంద్రమోడీ, ఆయనకు భజన చేసే చంద్రబాబు, నితీష్‌కుమార్ వంటి వారు కొలువై ఉన్న మన దేశంలో గర్భదరిద్రులు 12.9శాతం(2022) మంది ఉన్నారు.

'మేక్ ఇన్ ఇండియా' ఏమైంది?

- వి. రాంభూపాల్

గత పదేండ్ల క్రితం దేశమంతా హోరెత్తిన 'మేక్ ఇన్ ఇండియా' (భారత్‌లో తయారీ) మూగబోయింది. మేక్ ఇన్ ఇండియా గుర్తు అయిన ముందుకు అడుగు వేసే సింహం కదలకపోగా వెనకడుగు వేస్తున్నట్లు వుంది. 2014 సెప్టెంబర్ 25న ఈ పథకాన్ని ప్రారంభించి నప్పుడు 2024 నాటికి మూడు లక్ష్యాలను సాధించాలని నిర్ణయించుకున్నారు. అవి ఒకటి, తయారీ రంగం వృద్ధి రేటును ఏడాదికి 12 నుండి 14 శాతానికి పెంచడం. రెండు, 2022 నాటికి ఆర్థిక వ్యవస్థలో పది కోట్ల మందికి అదనపు ఉద్యోగాలు ఇవ్వడం. మూడు, దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఉత్పాదక రంగం వాటాను 25 శాతానికి పెంచడం. 'అనుకున్నదొక్కటి అయ్యిందొక్కటి' లాగా ఈ పథకం అమలు తీరువుంది. అందుకే పదేండ్లు పూర్తయినా 'మేక్ ఇన్ ఇండియా' సాధించింది ఏమిటో కేంద్ర ప్రభుత్వం, దాని అధినాయకులు చెప్పడం లేదు.

భారత దేశాన్ని ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాల సరసన కూర్చోబెట్టాలంటే దేశీయ తయారీ రంగం అభివృద్ధి కావాలని అందుకు దేశంలోనే ఉత్పత్తి చేయడంపై దృష్టి పెట్టి, దిగుమతులను తగ్గించాలని పది సంవ త్సరాల క్రితం కొత్తగా అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రకటించింది. దానికి 'మేక్ ఇన్ ఇండియా' అని పేరు పెట్టి 15 తయారీ రంగాలు, 12 సేవారంగాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. అందులో ఆటో మొబైల్స్, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, పునరుత్పాదక ఇంధన రంగా లపై ప్రత్యేక కేంద్రీకరణ చేయనున్నట్లు చెప్పారు. ఈ రంగాల్లో సాధించే పురోభివృద్ధి వల్ల పై మూడు లక్ష్యాలను సాధించి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని నిలిపి 'విశ్వగురువు'గా అవతరి స్తామని చెప్పారు. వాస్తవానికి ఈ ఆలోచన మోడీ లేదా ఆయన ప్రభుత్వానిది కాదు, ప్రపంచ బ్యాంకుది. ప్రపంచ మంతటా ఒకే తరహా ప్రయివేటీకరణ విధానాన్ని అమలు చేయడానికి ప్రపంచబ్యాంకు రూపొందించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే దానికే 'మేక్ ఇన్ ఇండియా' అని ముద్దు పేరు పెట్టారు. ఈ పథకం దేశ స్వావలంబన విధానానికి పూర్తి భిన్న మైంది. జాతీయోద్యమ స్ఫూర్తికి విరుద్ధమైంది. బ్రిటిష్ వలస పాలనకాలంలో దేశంలోని సహజ వనరులను, శ్రామికుల శ్రమను లూటీ చేసి, దేశీయ పరిశ్రమలను ఏ రకంగా సర్వనాశనం చేశారో ఆలాగే మరోసారి కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించిన ముసుగు ఇది. నకిలీ జాతీయవాదులు ఎత్తుకున్న మరో మోసపూరిత విధానం, నినాదం 'మేక్ ఇన్ ఇండియా'.

దేశంలో 1991 తర్వాత అనుసరించిన ప్రపంచీకరణ విధానాల వల్ల కొన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధి తీవ్రమైన అసమానతలతో కూడుకున్నది. ఒకవైపు దేశ సంపద పెరుగుతున్నట్లు లెక్కలు చెబుతుంటే మరోవైపు నిరుద్యోగం, ఆర్థిక అస మానతలు తీవ్రమయ్యాయి. సందప కొద్దిమంది దగ్గరే పోగైంది. ప్రఖ్యాత ప్రపంచ ఆర్థికవేత్త ప్రొఫెసర్ పికెటి బృందం చెప్పిన ప్రకారం 1924 నాటి కంటే 2024 నాటికి దేశంలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా పెరిగాయి. ఐ.టి రంగంలో గత రెండు దశాబ్దాల్లో సాధించిన వృద్ధి వల్ల 2013 నాటికి భారత ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం వాటా 57 శాతానికి పెరిగినప్పటికీ, ఆ రంగం అతి తక్కువ మందికి మాత్రమే ఉద్యోగాలను కల్పించింది. ప్రస్తుతం ఆ రంగంలో ఉపాధి అవకాశాలు మరింతగా తగ్గి పోతున్నాయి. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉంది. దేశ జనాభాలో సగం మందికి పైగా వ్యవసాయ రంగంపై ఆధారపడి వున్నారు. అయితే ఆ రంగం గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర సంక్షోభంలో వుంది.

నిరుద్యోగం, వలసలు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. ఈ పరిస్థితులకు కారణమైన ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలను సమీక్షించకుండా ఆ బ్యాంకు చెప్పిన 'మేక్ ఇన్ ఇండియా' ఎలా పరిష్కారం అవుతుంది? దేశంలో తయారీ (ఉత్పత్తి) పరిశ్రమ లను పెంచడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరిగి, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, వేగంగా అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ నాయకులు చెప్పారు. రోగం ఒకటైతే మందు మరొకటి వేశారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారీ రంగాన్నీ అభివృద్ధి చేస్తామని చెప్పి రైల్వే, బీమా, రక్షణ, వైద్య పరికరాల తయారీలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు భారీగా అనుమతించారు. కీలకమైన రక్షణ రంగంలో అప్పటివరకు 49 శాతంగా ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 శాతానికి పెంచి తమ నిజమైన 'దేశభక్తి'ని చాటుకున్నారు. నిర్మాణం, రైల్వే, ఇతర మౌలిక సదుపాయాల రంగాలలోకి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష



పెట్టుబడులను అనుమతించారు. ఈ విదేశీ పెట్టుబడికి సేవలు చేయడానికి 'ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్'ను ఏర్పాటు చేశారు. దేశంలోకి పెట్టుబడి వచ్చినప్పటి నుండి తిరిగి వెళ్లే వరకు అవసరమైన అన్నిరకాల సేవలను ఈ సెల్ చేస్తుంది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో విదేశీ పెట్టుబడులు దేశంలో వ్యాపారం చేసుకోవడానికి అవసరమైన అనుమతులు, లైసెన్స్‌లు, విద్యుత్ సదుపాయం, పన్నుల చెల్లింపులు, ఒప్పందాలకు అవసరమైన అన్ని రకాల సేవలు (ఊడిగం) చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో ఆసక్తికరమైన 'దివాలా తీయడం' సేవ కూడా వుంది. దివాలా తీయడానికి కూడా సేవలు అందించే ఏర్పాట్లు ఈ పుణ్యభూమిలో తప్ప ఎక్కడ వుండవేమో! ఈ విధానాలను మూడు 'పి' లుగా (పబ్లిక్ (ప్రభుత్వం) ప్రైవేట్ పార్టనర్‌షిప్) పిలుచుకున్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల నాలుగో 'పి' కూడా చేర్చారు. 'పదకొండు ప్రభుత్వ అనుమతులను లేదా సేవలను సింగిల్-విండో ద్వారా చేసి పెడుతున్నారు.

ఇన్ని రకాల సేవలు పొందిన విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులు ఐదు పారిశ్రామిక కారిడార్ల ద్వారా పారిశ్రామిక, పట్ట ణీకరణ అభివృద్ధికి కృషిచేస్తారని చెప్పారు. ఢిల్లీ-ముంబై, అమృత్‌సర్-కోల్‌కొతా, చెన్నై-బెంగళూరు, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్లు, బెంగళూరు-ముంబై ఆర్థిక కారిడార్లను ఏర్పాటు చేశారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, స్మార్ట్ సిటీలు, అమృత్ కాల్, స్వచ్ఛ భారత్ అభియాన్, సాగరమాల ఇలా ఒకటేమిటి అనేక పేర్లు పెట్టి దేశాన్ని ఊదరగొట్టారు. ఇంత చేసి సాధించింది ఏమిటంటే తిరోగమనం. నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్ (ఎన్.ఎ.ఎస్) ప్రకారం తయారీ రంగం వాస్తవ అభివృద్ధి రేటు 2001-12లో 9.1 శాతం వుండగా, మేక్ ఇన్ ఇండియా అమలులోకి వచ్చిన 2012-23లో 5.5 శాతానికి పడిపోయింది. జీడీపీలో తయారీ వాటా 25 శాతానికి పెంచాలనే ఈ పథకం లక్ష్యం ఇప్పటికీ 17-18 శాతానికి దాటలేదు. తయారీ రంగంలో ఉద్యోగ అవకాశాలను పెంచడం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తయారీ రంగంలో 2011-12లో ఉద్యోగ అవకాశాలు 12.6 శాతం వుండగా 2022-23 నాటికి 11.4 శాతానికి పడిపోయింది. మన రాష్ట్రంలో 2018- 19లో 10.6 శాతంగా వున్న ఉపాధి అవకాశాలు 2023-24 నాటికి 9.6 శాతానికి పడిపోయాయి. అలాగే కర్ణాటకలో 11.7 నుండి 10.9 శాతానికి, తమిళనాడులో 18.7 నుండి 15.9 శాతానికి, పశ్చిమ బెంగాల్‌లో 18.7 నుండి 16.7 శాతానికి ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధికమంది ఉపాధి పొందుతున్నది అసంఘటిత రంగంలో. ఈ రంగంలో 2015-16 లో 38.8 మిలియన్ల మంది ఉపాధి పొందుతుంటే 2022-23 నాటికి 30.6 మిలియన్లకు అంటే సుమారు ఎనిమది లక్షల మంది ఉపాధి కోల్పోయారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో భారతదేశ ఎగుమతులు 2013-14లో 25.2 శాతం వుండగా, 2013-24లో 22.7 శాతానికి పడిపోయాయి.

దేశం నిజంగా అభివృద్ధి కావాలంటే ఇప్పటికీ అత్యధిక మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి. భూ పంపిణీ చేపట్టి గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచాలి. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, ప్రభుత్వ రుణ సదుపాయం, గిట్టుబాటు ధరలు కల్పించాలి. కుల, లింగ వివక్షలను రూపుమాపే శాస్త్రీయ విద్య, సామాజిక వ్యవస్థను అభివృద్ధి చేయాలి. పట్టణాల విస్తరణకు అవసరమైన చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద ఎత్తున స్థాపించడానికి అవసరమైన తోడ్పాటును ఇచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచాలి. పరిశోధనల అభివృద్ధికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి.

దేశంలో 1991 తర్వాత అనుసరించిన ప్రపంచీకరణ విధానాల వల్ల కొన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధి తీవ్రమైన అసమానతలతో కూడుకున్నది. ఒకవైపు దేశ సంపద పెరుగుతున్నట్లు లెక్కలు చెబుతుంటే మరోవైపు నిరుద్యోగం, ఆర్థిక అస మానతలు తీవ్రమయ్యాయి. సందప కొద్దిమంది దగ్గరే పోగైంది. ప్రఖ్యాత ప్రపంచ ఆర్థికవేత్త ప్రొఫెసర్ పికెటి బృందం చెప్పిన ప్రకారం 1924 నాటి కంటే 2024 నాటికి దేశంలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా పెరిగాయి. ఐ.టి రంగంలో గత రెండు దశాబ్దాల్లో సాధించిన వృద్ధి వల్ల 2013 నాటికి భారత ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం వాటా 57 శాతానికి పెరిగినప్పటికీ, ఆ రంగం అతి తక్కువ మందికి మాత్రమే ఉద్యోగాలను కల్పించింది. ప్రస్తుతం ఆ రంగంలో ఉపాధి అవకాశాలు మరింతగా తగ్గి పోతున్నాయి. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉంది.

దిగుమతులు మాత్రం 602.98 మిలియన్ డాలర్ల నుండి 2022 నాటికి 756.68 మిలియన్ డాలర్లకు పెరిగాయి. పట్టణాల్లో ఉపాధి తగ్గిపోవడంతో వ్యవసాయంపై ఆధారపడే వారి సంఖ్య పెరిగింది. 2018-19లో 42.5 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడితే 2022-23లో 45.8 శాతానికి పెరిగింది.

ఈ పదేండ్లలో అభివృద్ధి సాధించకపోగా దేశ సహజ వనరులు పెద్ద ఎత్తున లూటీ అయ్యాయి. వ్యవసాయ యోగ్యమైన భూమిని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం పెరిగింది. ఒక్కో కార్పొరేట్ కంపెనీకి వేల ఎకరాల భూమిని ఇచ్చేస్తున్నారు. పారిశ్రామిక కారిడార్ల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భూ బ్యాంక్ విధానం పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను అతి చౌకగా కాజేశారు. దీనివల్ల ఇప్పటికే ఆహారధాన్యాల కొరత ఏర్పడింది. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంలో అమెరికా నుండి పి.ఎల్-480 గోధుమలను దిగుమతి చేసుకున్న స్థితికి దేశం దిగజారు తుంది. గాలి, సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి పేరుతో గ్రామీణ ప్రాంతాలపై పడుతున్న విభిన్న ప్రతికూలతల గురించి ఎలాంటి అధ్యయనంకానీ, జాగ్రత్తలుకానీ తీసుకోవడంలేదు. పారిశ్రామికీకరణ పేరుతో పెద్ద ఎత్తున కొండలు, గుట్టలు చదును చేయడంతో పాటు సహజ వనరులను కొల్లగొడుతున్నారు. దీనివల్ల కాలుష్యం, పర్యావరణం దెబ్బతిని ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయి. సకాలంలో వర్షాలు రాకపోవడంతో పాటు, వాతవారణంలో తీవ్రమైన మార్పులు వచ్చాయి.

జాతీయోద్యమ లక్ష్యాలకు భిన్నమైన ఈ 'మేక్ ఇన్ ఇండియా' దేశాన్ని విదేశీ, స్వదేశీ కంపెనీలకు దోచిపెట్టడానికి తోడ్పడింది. మన దేశాన్ని మనం అభివృద్ధి చేసుకోవాలనే నాటి స్ఫూర్తికి భిన్నంగా రక్షణ రంగంతో సహా అన్ని రంగాల్లోకి విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచింది. బ్రిటిష్‌కాలం నాడు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కుదించివేసి కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చడానికి, వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం సేవలు చేస్తున్నది. దేశం నిజంగా అభివృద్ధి కావాలంటే ఇప్పటికీ అత్యధిక మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి. భూ పంపిణీ చేపట్టి గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచాలి. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, ప్రభుత్వ రుణ సదు పాయం, గిట్టుబాటు ధరలు కల్పించాలి. కుల, లింగ వివక్షలను రూపుమాపే శాస్త్రీయ విద్య, సామాజిక వ్యవస్థను అభివృద్ధి చేయాలి. పట్టణాల విస్తరణకు అవసరమైన చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద ఎత్తున స్థాపించడానికి అవసరమైన తోడ్పాటును ఇచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచాలి. పరిశోధనల అభివృద్ధికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి.



బీజేపీకి 'కాశ్మీరీ'ల గుణపాఠం

జమ్ముకాశ్మీర్‌లో కమలం పార్టీకి ఓటర్లు బుద్ధిచెప్పారు. అతివిశ్వాసం, కుమ్ములాటలతో హర్యానాలో విజయాన్ని కాంగ్రెస్ చేజార్చుకుంది. జమ్ముకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తినిచ్చే చారిత్రాత్మక 370 అధికరణాన్ని రద్దు చేసి, కాశ్మీరీ ప్రజలను, నేతలను ఏళ్ల తరబడి నిర్బంధించినందుకు తగిన ఫలితాన్ని బీజేపీ అనుభవించింది. రాష్ట్రహోదా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ పునరుద్ధరించకపోవడంపై ప్రజానీకం తీవ్ర ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. కాశ్మీర్ ప్రాంతంలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) నేతృత్వంలోని ఇండియా వేదిక క్లీన్‌స్వీప్ చేసింది. 'నయా కాశ్మీర్' అంటూ మాయ చేసేందుకు బీజేపీ చేసిన ఎత్తులు చిత్తయ్యాయి. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రైనాను సైతం ఓడించి, బీజేపీని పూర్తిగా తిరస్క రించారు. 90 స్థానాలకు గాను 48 స్థానాలను సాధించిన ఎన్‌సి -కాంగ్రెస్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. కుల్గాం స్థానం నుంచి వరుసగా ఐదోసారి యూసఫ్ తరిగామిని గెలిపించడం ద్వారా ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టులకు తిరుగులేదని మరోసారి నిరూ పించారు. 2019లో నిషేధించిన జమాతే ఇస్లామీ పార్టీ, అవామీ ఇత్తెహాద్ పార్టీ (ఎఐపి) స్వతంత్రులకు మద్దతిస్తూ, ప్రచారం చేసేందుకు సైతం అనుమతించడం ద్వారా లబ్ధి పొందాలనీ కమలం పార్టీ ప్రయత్నించింది. యుఎపిఎ కింద అరెస్టయిన ఎఐపి నేత ఇంజనీర్ రషీద్‌తో ప్రచారం చేయించి, ఇండియా వేదిక ఓట్లను చీల్చాలని చేసిన ఎత్తులు పారలేదు.

హర్యానాలో బీజేపీ వ్యతిరేక ఓట్ల చీలిక, అతివిశ్వాసం, కుమ్ములాటలు కాంగ్రెస్ పార్టీ పుట్టిముంచాయి. కిసాన్, జవాన్, పహిల్వాన్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న హర్యానాలో..ఆ మూడు పక్షాలూ వ్యతిరేకంగా ఉన్నా, అధికారం వెలగబెట్టిన పదేళ్లలో చేసిన నిర్వాకాలతో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నా.. ఎన్నికల ఫలితాల్లో వ్యక్తం కాకపోవడానికి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ బలహీనతలు కారణమయ్యాయి. జాట్‌లంతా హస్తం పార్టీ వైపు ఉన్నారన్న ప్రచారం పూర్తిస్థాయిలో నిజం కాకపోగా, జాట్‌లకు వ్యతిరేకంగా ఉన్న కులాల్లో అత్యధికులు తమ పార్టీ వైపు మొగ్గు చూపేలా కమలం పార్టీ చేసుకోగలిగింది. కాంగ్రెస్ అగ్రనేతలు హుడా, సెల్జా మధ్య విభేదాలు బహిరంగంగానే బయట పడటం, కుమారి సెల్జాను పక్కనపెట్టడం కొన్ని తరగతుల ప్రతినిధులను దూరం చేశాయి. కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడంతో ఆప్ ఒంటరిగా పోటీ చేయడం, స్థానికంగా ఉంటున్న జేజేపీ, దళితుల మద్దతున్న భీమ్ ఆర్మీ పార్టీతోనూ, ఐఎన్‌ఎల్‌డి బీఎస్పీతోనూ పొత్తు పెట్టుకోవడం కూడా ఓట్ల చీలికకు దారితీసింది. వెయ్యి నుంచి ఐదు వేల ఓట్ల తేడాతో పది స్థానాల్లోనూ, ఐదు వేల నుంచి పదివేల ఓట్ల తేడాతో ఐదు స్థానాల్లోనూ కమలం పార్టీ గెలుపొందడమే ఆ పార్టీ వ్యతిరేక ఓట్ల చీలికను ఎత్తిచూపుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు దూరమైన ఓటర్లను దరిచేసుకునేందుకు కాషాయ పార్టీ చేసిన ఎత్తులు ఫలించాయి. అగ్నివీర్‌లకు రాష్ట్ర ఉద్యోగాల్లో కోటా ఇస్తామని, దళితుల్లో నాన్ జాతవ్‌లకు 14 శాతం రిజర్వేషన్లిస్తామని.. ఇలా చేసిన ఆపద మొక్కులు ఫలితాన్నిచాయి.

కమలం పార్టీతో పొత్తు ధృతరాష్ట్ర కౌగిలి అని మరోసారి రుజువైంది. 2015లో బీజేపీతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన పీడీపీ మూడు స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా సైతం ఓటమి పాలయ్యారు. హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి, జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) అధినేత దుష్యంత్ చౌతాలా అవమానకరంగా ఐదో స్థానానికి పరిమితమయ్యారు. పంజాబ్‌లో శిరోమణి అకాళీదళ్‌కు, అస్సాంలో అస్సాం గణపరిషత్‌కు, తమిళనాడులో అన్నాడిఎంకెకు, మహారాష్ట్రలో శివసేనకు, బీహార్‌లో జెడి(యు)కు, కర్నాటకలో జెడిఎస్‌కు సామాన్యుడు సన్మానం చేసినా... సమానదూరమంటూ... సర్కస్ చేసిన బీఆర్‌ఎస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్ పార్టీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తమ సిద్ధాంతాలను పక్కనపెట్టి రాజకీయ లబ్ధికోసం అంటకాగితే ఫలితం ఎలా ఉంటుందనడానికి తాజా ఫలితాలు మరో నిదర్శనం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జైళ్లలో కులవివక్ష -సుప్రీం చారిత్రాత్మక తీర్పు



జనక మోహన రావు
8247045230

కులాల కంపుతో కునారిల్లుతున్న రంగమే లేదంటే అది అతిశయోక్తే కాదు! పుట్టిన నుండి చావువరకు కులగజ్జే! చివరికి తప్పు చేసి జైలులో ఉన్న ఖైదీలను కూడా ఈ కులజాడ్యం వదల్లేదు. దేశానికి ఇదోశాపంగా మారింది. నేటికీ సంస్కృతి, నాగరికత పెరిగినప్పటికీ మన సమాజంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తోంది. దేశ అభివృద్ధిని నిరోధిస్తుంది. మనదేశంలో శిశువుకు పుట్టిన వెంటనే లభించే మొట్టమొదటి గుర్తింపు పత్రం కులం. వాళ్లు పెద్దయ్యాక నచ్చితే మతం మార్చుకోవచ్చేమో గాని కులం మాత్రం మార్చుకోడానికి వీల్లేదు డబ్బుకంటే ఎక్కువ విలువ కులానికి ఇస్తున్న రోజులివి. డబ్బు సంపాదించి కోటీశ్వరుడు కావచ్చు. కానీ ఏమీచేసినా కులం మాత్రం మారలేము. కారణం సమా జంలో ప్రతీ దాంట్లో కులం కూరుకుపోయింది. పాఠశాలలో ప్రవేశ దరఖాస్తులో అధికారికంగా కులం నమోదు మొదలవుతుంది. ఆ సమ యంలో ఏమీ తెలియని పసిపిల్లలు "కులం అంటే ఏమిటి ?" అని అడిగితే సమాధానం మనదగ్గర ఉండదు. సరే ఎవరి ఇష్టం వాళ్లది. కానీ కులం పేరుతో ఏ భారతీయుడూ వివక్షతకు గురికాకూడదు. కుల వివక్షతకు గురికాకుండా మన రాజ్యాంగం మనలను రక్షిస్తుంది. కొంతమంది తమ స్వార్థం కోసం కుల వివక్షతను పెంచి పోషిస్తున్నారు. రాజ్యాంగం మనకు ఎంత రక్షణ ఇస్తున్నా కూడా అనధికారంగా కొన్ని కులాలు ఇప్పటికీ వివక్షకు గురవుతూనే ఉన్నాయి. జైలు బ్యారక్‌లలో కుల ఆధారిత వివక్షపై జర్నలిస్టు సుకన్య శాంత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పే దీనికి తార్కాణం.

రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటినుండి కులవివక్షతను తొలగించినప్పటికీ జైళ్లలో ఇంకా కులవివక్ష కొనసాగుతోందని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ నెల మూడో తేదీన ఇచ్చిన తీర్పులో ఆందోళన వ్యక్తం చేసింది. ఖైదీల గౌరవం, సమానత్వం వివక్షతలేని హక్కును ఉల్లంఘించినందుకు వివిధ జైలు మాన్యువల్స్‌లోని నిబంధనలను "రాజ్యాంగ విరుద్ధం" అని పేర్కొంటూ, జైళ్లలో కుల ఆధారిత వివక్షకు సుదీర్ఘకాలంగా ఉన్న ఆచారానికి ముగింపు పలికి చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. తక్షణ సంస్కరణలకు పిలుపునిచ్చింది. జైలు ప్రాంగణాల్లో కుల ఆధారిత వివక్షను తొలగించేందుకు పలు ఆదేశాలు జారీ చేసింది. ఖైదీలకు గౌరవం ఇవ్వకపోవడం వలసవాదులు, వలసవాద పూర్వ యంత్రాంగాల అవశేషాలని మండిపడింది. "వలస వాదశకంలోని క్రిమినల్ చట్టాలు స్వాతంత్ర్యం అనంతరం ప్రభావితం చేస్తూనే ఉన్నాయి" అని పేర్కొంది. అగ్రకులాలకు వంటచేసే పనులు, అట్టడుగు వర్గాల వారికి క్లీనింగ్, స్వీపింగ్ పనులు, మురుగు కాలువలు, ట్యాంకులను శుభ్రపరచడానికి బలవంతం చేసే పద్ధతులు, అవాంఛనీయమైన పనులను చేయమని బలవంతం చేయడం లాంటి కుల ఆధారిత కేటాయింపుల జైలు మాన్యువల్‌లు నేరుగా వివక్ష చూపు తున్నాయని, ఇవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 ఉల్లంఘన కిందకు వస్తాయని పేర్కొంది. ఇది అట్టడుగు వర్గాలను దోపిడీ చేయడం లాంటిదని, ఖైదీలెవరూ వారి కులాన్ని బట్టి పని కేటాయింపులు, వారి బ్యారక్‌లు ఏర్పాటు చేయకుండా అందరికీ సమానంగా చూసుకోవాలని సూచించింది. అండర్ ట్రయల్, శిక్ష పడిన ఖైదీల రిజిస్టర్లలోని కులకాలమ్‌ను తొలగించాలని, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్ల సిబ్బందిని ఆదేశించింది. ఇది మానవ గౌరవానికి స్పష్టమైన ఉల్లంఘన అని పేర్కొంది.



అగ్రకులాలకు వంటచేసే పనులు, అట్టడుగు వర్గాల వారికి క్లీనింగ్, స్వీపింగ్ పనులు, మురుగు కాలువలు, ట్యాంకులను శుభ్రపరచడానికి బలవంతం చేసే పద్ధతులు, అవాంఛనీయమైన పనులను చేయమని బలవంతం చేయడం లాంటి కుల ఆధారిత కేటాయింపుల జైలు మాన్యువల్‌లు నేరుగా వివక్ష చూపు తున్నాయని, ఇవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 ఉల్లంఘన కిందకు వస్తాయని పేర్కొంది. ఇది అట్టడుగు వర్గాలను దోపిడీ చేయడం లాంటిదని, ఖైదీలెవరూ వారి కులాన్ని బట్టి పని కేటాయింపులు, వారి బ్యారక్‌లు ఏర్పాటు చేయకుండా అందరికీ సమానంగా చూసుకోవాలని సూచించింది. అండర్ ట్రయల్, శిక్ష పడిన ఖైదీల రిజిస్టర్లలోని కులకాలమ్‌ను తొలగించాలని, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్ల సిబ్బందిని ఆదేశించింది. ఇది మానవ గౌరవానికి స్పష్టమైన ఉల్లంఘన అని పేర్కొంది.

వివక్షతవారి రాజ్యాంగ హక్కులను స్పష్టంగా ఉల్లంఘించడమేనని కోర్టు పేర్కొంది.కులాల ప్రాతిపదికన బ్యారక్‌లలో ఖైదీలను వేరు చేయడం, కులాల శ్రేణిలో వారి స్థానం ఆధారంగా వారికి పనిని కేటాయించడం వివక్షతో కూడుకున్నదని, ఇది బలవంతపు శ్రమతో సమా నమని పేర్కొంటూ సుప్రీంకోర్టు పద్ధతులన్నింటికీ స్వస్తి పలికింది. కుల ఆధారిత వివక్షను పరిష్కరించడంలో అనేక అంతరాలను గుర్తిస్తూ 2016 మోడల్ ప్రిజన్ మాన్యువల్‌ను కూడా ఈ తీర్పు లక్ష్యంగా చేసుకుంది. మాన్యువల్ కొన్ని రకాల వివక్షను నిషేధించినప్పటికీ జైళ్లలో కుల ఆధారిత విభజన కార్మిక విభజనను పూర్తిగా తొలగించడంలో విఫలమైందని కోర్టు పేర్కొంది. సమగ్ర సంస్కరణను కోరుతూ మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధించే 2013 చట్టాన్ని మాన్యు వల్‌లో పొందుపరచలేదని విమర్శిం చింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ జైలు మాన్యువల్ లను మూడు నెలల్లో వివక్షాపూరిత నిబంధనలను సవరిం చాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 14, 15, 17, 21, 23లను ఉల్లంఘిస్తున్నా రనే కారణంతో రాష్ట్ర జైలు మాన్యువల్స్ లోని వివిధ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ తీర్పు వచ్చింది. కుల ప్రాతిపదికన ఖైదీలను వేరు చేయడం కుల భేదాలు లేదా శత్రుత్వాన్ని బలోపేతం చేస్తుందని, వీటిని మొదట నిరోధిం చాల్సిన అవసరం ఉందని, జైళ్లలో క్రమశిక్షణను కొనసాగించడానికి ఖైదీలను కుల ప్రాతిపదికన వేరుచేయాలని చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. కుల ఆధారిత వివక్ష వ్యక్తిగత ఎదుగుదలకు, అభివ అద్ధికి ఆటంకం కలిగిస్తుందని పేర్కొంటూ సుప్రీంకోర్టు ఆర్టికల్ 21 పరిధిని విస్తరించింది. అట్టడుగు వర్గాలకు చెందిన వ్యక్తులు కుల దురభి మానాలను అధిగమించేందుకు జైలు వ్యవస్థలు తప్పనిసరిగా అనుమతించాలని, సమాన త్వం, గౌర వించే వాతావరణాన్ని అందించాలని తీర్పు చెప్పింది.

ఈ తీర్పు భారతదేశంలోని జైళ్లలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, డినోటిఫైడ్ తెగలు (డిఎన్‌టిలు) సహా అట్టడుగు వర్గాల పట్ల వేళ్లూను కున్న వివక్షాపూరిత పద్ధతులను ప్రత్యేకంగా ప్రస్తావించింది. కుల ఆధారిత పక్షపాతాలను ఎదుర్కోవడానికి, డీనోటిఫైడ్ తెగ సభ్యుల ఏకపక్ష అరెస్టులను నిరోధించడానికి అర్నేష్ కుమార్ వెర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ (2014), అమానతుల్లా ఖాన్ వెర్సెస్ పోలీస్ కమీషనర్ ఢిల్లీ (2024) కేసులలో నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల ని బెంచ్ పిలుపునిచ్చింది. డీనోటిఫైడ్ తెగల సభ్యులు పుట్టుకతోనే నేరస్తులుగా పరిగణించబడే వర్గీకరణ వారి గౌరవానికి భంగం కలిగిస్తుందని, ఇది వారి గౌరవంగా జీవించే హక్కుకు హామీ ఇచ్చే ఆర్టికల్ 21 స్థూల ఉల్లంఘన అని పేర్కొంది.

అట్టడుగు వర్గాల రక్షణ విధానాలను రూపొం దించడానికి, వనరుల సమాన పంపిణీని ప్రోత్సహిం చడానికి రాజ్యాంగం కొన్ని కులాలు, తెగలను ఎస్సీ, ఎస్టీలుగా గుర్తిస్తుందని, అయితే ఆర్టికల్ 15(1)లో స్పష్టంగా కనిపిస్తున్నట్లుగా, అట్టడుగు వర్గాల సభ్యులపై వివక్ష చూపడానికి కులం కారణం కాదు" అని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పులో సూచించిన విధంగా కుల ఆధారిత వివక్ష లేదా వివక్షాపూరిత పద్ధతులు ఇప్పటికీ జైళ్లలో జరుగుతున్నాయో లేదో గుర్తించేందుకు 2016 మోడల్ ప్రిజన్ మాన్యువల్ కింద ఏర్పడిన జిల్లా లీగల్ సర్వీసెస్ అధికారులు, సందర్శకుల బోర్డు సంయుక్తంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని కోర్టు కోరింది. దానికి స్థితి నివేదిక అందజేయాలని తెలిపింది.

సామాన్య డీలర్ల పొట్టకొట్టి ...



బడా డీలర్లకు రేషన్ షాపుల కేటాయింపు

- డీలర్లను కాపాడాల్సిన సంఘ నాయకులే నిలువునా ముంచుతున్నారు....
- సంఘ నాయకులు, సివిల్ సప్లయ్ అధికారుల చేతుల్లో సమిధలవుతున్న డీలర్లు...
- సివిల్ సప్లయ్ శాఖ అధికారుల సాక్షిగా సాగుతున్న దందా..?

ఒక్కో షాపుకు రూ.50 వేలు...నెల మాముళ్లు వేరే...?



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఏదైనా వృత్తి, వ్యాపారంలో ఉన్న సభ్యులకు సమస్య వస్తే పరిష్కరించుకోవడానికి సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది. ఆ సంఘం నాయకులు వారితో పాటు వ్యాపారం చేసే తోటి వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించడం సంఘ నాయకుల కర్తవ్యం...కానీ రేషన్‌డీలర్ల సంఘంలో మాత్రం అందుకు విరుద్దంగా నడుస్తుంది. ఇక్కడ సంఘంలోని ముఖ్య నాయకులే చిన్నపాటి డీలర్లను టార్గెట్ చేసుకుని వారి షాపులపైకి సివిల్ సప్లయ్ శాఖ అధికారిని పంపించి తనిఖీలు చేపిస్తారు. రెండు, మూడు క్వింటాల బియ్యం లెక్కల్లో తేడా ఉన్నా అట్టి డీలర్‌పై "6 ఏ" కేసు నమోదు చేసి వారి షాపును ఆరు నెలల పాటు సస్పెండ్ చేపిస్తారు. వెంటనే ఆ షాపును సంఘ నాయకుడికి ఇన్చార్జ్‌గా కేటాయిస్తారు. అంటే సామాన్య డీలర్ పొట్టకొట్టి బడా డీలర్ (సంఘనాయకుడికి) కేటాయిస్తారు. ఇందుకు ప్రతిఫలంగా సదరు అధికారికి రూ.50 వేలు అందించాల్సి ఉంటుంది. అంతేకాదు సుమా అట్టి షాపు కేటాయించినందుకు ప్రతి నెలా రూ.10 వేలు మామూళ్లు ముట్టచెప్పాల్సి ఉంటుంది. అయితే ఏదైనా రేషన్ షాపుపై సివిల్ సప్లయ్ శాఖాధికారులు కేసు పెడితే అట్టి షాపుకు కిలోమీటరు దూరంలో ఉన్న మరో రేషన్ డీలర్‌కు మాత్రమే షాపు కేటాయించాల్సి ఉంటుంది. కానీ 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా సరే శాఖ అధికారికి ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి మాత్రమే షాపు కేటాయిస్తారన్నమాట..ఒకవేళ సంఘ నాయకుడే వందల క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తూ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన సదరు అధికారులు అట్టి డీలర్‌పై ఎలాంటి కేసులు నమోదు చేయరు. అదే సామాన్య డీలర్ వద్ద రెండు క్వింటాలు దొరికిన కేసులు పెడతారు. కానీ సంఘ నాయకుడి షాప్ వద్ద అక్రమంగా వందల క్వింటాల బియ్యం దొరికినా పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని వారిపై ఎలాంటి కేసు లేకుండా చేస్తారు. అంతేకాకుండా ప్రమాదవశాత్తు ఎవరైనా డీలర్ చనిపోతే అ డీలర్ దహన సంస్కారాలు కాకముందే అట్టి షాపును తమకు ఇవ్వాలని కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతుంటారు. సంఘ నాయకులు, అధికారుల తీరును చూస్తే శవాలపై పేలాలు ఏరుకునే విధంగా కనిపిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

• సామాన్య డీలర్ల పొట్టకొట్టి బడా డీలర్లకు షాపులు కేటాయింపు...?

మండలంలో రేషన్ డీలర్ల అందరికి ఓ సంఘం ఉంది. ఇందులో ముఖ్యనాయకులు ఉండి డీలర్లకు ఏదైనా సమస్య వస్తే వారి సమస్యలను దగ్గర ఉండి పరిష్కరించాల్సి ఉంటుంది. గతంలో డీలర్లకు సమస్య వస్తే వారి సమస్యగా భావించి నాయకులు పరిష్కరించేవారు. కానీ ప్రస్తుతం రూరల్‌లో ట్రెండ్ మారింది. సంఘ నాయకులే డీలర్లకు సమస్యలు సృష్టించి అట్టి డీలర్ షాపులపై అధికారుల ద్వారా తనిఖీలు చేయించి ఆ షాపులపై ఆరు నెలల పాటు సస్పెన్షన్ విధించి అ షాపును సదరు సంఘం నాయకుడు దక్కించుకుంటాడు. రేషన్ షాపుపై కేసు అయితే అట్టి షాపుకు కిలోమీటర్ దూరంలో ఉన్న షాపుకు మాత్రమే ఇన్చార్జ్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అధికారులు మాత్రం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంఘ నాయకుడికి రేషన్ షాపును ఇన్చార్జ్‌గా కేటాయిస్తారు. ఈ విధంగా సంఘ నాయకుడు చెప్పినట్లు చిన్న డీలర్‌పై కేసు నమోదు చేసి షాపు కేటాయించినందుకు ఆ అధికారికి 50 వేలు, అంతేకాకుండా అట్టి షాపుపై ప్రతినెలా 10 వేల రూపాయలు మామూళ్లు ముట్ట చెప్పాలనే ఆరోపణలున్నాయి. ఈ విధంగా రూరల్ మండలంలో కొంతకాలంగా పదుల సంఖ్యలో రేషన్ డీలర్ల షాపులు కేసులు పెట్టి వారి షాపులను అధికారులు, సంఘ నాయకులు గద్దల్లా తన్నుకపోతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక డీలర్ అతని షాప్ తో పాటుగా మరో షాపుకు మాత్రమే ఇన్చార్జ్‌గా ఉండాలి కానీ రూరల్ మండలంలో మాత్రం సంఘ నాయకుడు అయిదు షాపులకు ఇన్చార్జ్‌గా ఉండవచ్చు. సంఘ నాయకుడికి నిబంధనలు వర్తించవు. దీంతో సంఘ నాయకులు, అధికారుల మధ్య సామాన్య డీలర్లు సమిధలవుతున్నారని వినికిడి.

• డీలర్ మృతి చెందితే గద్దల్లా వాలుతున్న సంఘం నాయకులు...

ఇటీవల ఓ గ్రామంలో ఓ డీలర్ హఠాత్తుగా మృతిచెందితే డీలర్ మృతదేహన్ని చూసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్లకుండా సదరు షాపు 'నాకంటే నాకంటూ' సంఘం నాయకులు ఓ చోటకూర్చోని సంబంధిత శాఖ అధికారితో మాట్లాడు'కోని' చివరి నిమిషంలో డీలర్ అంత్యక్రియలకు హాజరై ఆసమయంలో షాప్‌ను తమకు కేటాయించాలని వారి కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చిన సంఘటన ఇటీవల మండలంలో చోటుచేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారు అనుకున్నట్లే అట్టి షాపును సంఘ నాయకులే దక్కించుకున్నారు. డీలర్ల సంఘ నాయకుల పరిస్థితిని చూసి అక్కడ ఉన్న ప్రజలు శవాలపై పేలాలు ఏరుకున్నట్లు ఉందని గుసగుసలాడుకున్నారు. అందుకు ప్రతిఫలంగా అధికారికి భారీగా ముడుపులు ముట్టజెప్పినట్లు తెలిసింది...

• ఐదు షాపులకు ఒక్కడే ....?

మండలంలో ఏ డీలర్‌పై కేసు అయినా సరే ఒక్క డీలర్‌కే షాపులు కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో సంబంధిత అధికారులే తేల్చాల్సి ఉంటుంది. ఎంత దూరంలో ఉన్న షాపుకైన సదరు సంఘ నాయకుడే ఇన్చార్జ్‌గా ఉంటాడు. అధికారులు కూడా అతనికి మాత్రమే అప్పగిస్తారు. మండలంలో ఓ సంఘ నాయకుడు అతని షాపుతో పాటు సుమారు మరో 5 షాపులకు ఇన్చార్జ్‌గా వ్యవహరిస్తూ ప్రతి నెల వేల క్వింటాళ్ల బియ్యంను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నాడన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత నెలలో సంఘం నాయకుడు కొన్ని వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బస్తాలు కూడా మార్చకుండా ఖమ్మంరూరల్ నుండి కాకినాడకు లారీలోకి లోడ్ చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా విజిలెన్స్, పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనిపై పక్క మండలంలోని పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. కానీ సివిల్ సప్లయ్ శాఖాధికారులు మాత్రం రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన డీలర్ల సంఘం నాయకుడికి క్లీన్‌చిట్ ఇచ్చినట్లు సమాచారం. రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన సదరు నాయకుడిపై ఎలాంటి కేసు లేకుండా చేసినందుకు సంబంధిత శాఖ అధికారికి పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు సమాచారం.

• ఓ గ్రామంలో ఓ డీలర్ దగ్గర రెండు క్వింటాళ్ల బియ్యం దొరికితే వెంటనే అధికారులు కేసు పెట్టి సదరు డీలర్ షాపును ఆరు నెలల పాటు సస్పెండ్ చేసిన అధికారులు వందల క్వింటాల బియ్యం లారీ లోడుతో పట్టుబడిన సంఘ నాయకుడిపై కనీసం 6ఏ కేసు కూడా ఎందుకు పెట్టలేదో సంబంధిత అధికారులే తెలపాలి. వందల క్వింటాల బియ్యం లోడుతో దొరికిన కొద్దిరోజులకే రెండు,మూడు షాపులను కేటాయించడం వెనుక ఆతర్యంఏమిటో సదరు అధికారులే చెప్పాల్సి ఉంది.

• ఖమ్మంరూరల్ మండలంలో సివిల్ సప్లయ్ శాఖాధికారులు, డీలర్ల సంఘ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న దందాపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

• రూరల్ మండలంలో జరుగుతున్న తంతుపై సివిల్ సప్లయ్ డీటీ విజయ్ బాబును వివరణ కోరగా....ఏ సంఘం నాయకుడికీ 5 షాపులు కేటాయించలేదని, సంఘం నాయకుడిపై కేసు నమోదైన మాట వాస్తవమని, అతనిపై విచారణ జరుగుతుంద న్నారు. డీలర్ల దగ్గర డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు.

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ పక్కదారిపై

విచారణ పూర్తి

- దోషులపై చర్యలు.. రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ పక్కదారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రబీ, ఖరీఫ్‌కు సంబంధించి రైతుల నుండి ధాన్యం సేకరణ చేసిన పిదప ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను తిరిగి ఇచ్చుటకు గాను జిల్లాలోని రైస్ మిల్లులకు వాటి వాటి సామర్థ్యం మేరకు ధాన్యం కేటాయింపులు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, తిరిగి ప్రజావసరాల నిమిత్తం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఏ మిల్లర్ వద్ద ఎంత ధాన్యం ఉంది, కస్టమ్ మిల్లింగ్ రైస్‌కి ఎంత ధాన్యం ఇచ్చారు, ఇంకా ఎంత రావాల్సి ఉంది వివరాలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖ అధికారులపై ఉందని అన్నారు.

గత నెల 24న చేపట్టిన తనిఖీల్లో కొన్ని మిల్లుల్లో కేటాయించిన ధాన్యం నిల్వలు లేనట్లుగా గుర్తించి, ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు. మిల్లులకు సంబంధించి సిఎంఆర్ రైస్ అందజేత, ధాన్యం నిల్వలపై పౌరసరఫరాల సంస్థ విచారణ జరపగా, అధికారుల బాధ్యతలు, విధుల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టడం జరిగిందన్నారు. విచారణ పూర్తిచేసి విచారణ నివేదిక జిల్లా కలెక్టర్ కు సమర్పించడం జరిగిందని అన్నారు. చట్ట ప్రకారం బాధ్యులపై త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సిఎంఆర్ పక్కదారి పట్టించిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం, విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపర చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అంకురలో అధునాతన వైద్య సౌకర్యాలు

- ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి



నవతెలంగాణ-ఖమ్మం

అత్యుత్తమ, అధునాతన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు అందించేందుకు నూతన హంగులతో రూపు దిద్దుకున్న అంకుర ఆసుపత్రి ప్రజల ముందుకు వచ్చిందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంలోని గొరిల్లా పార్క్, సీక్వెల్ రిసార్ట్స్ సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన అంకుర హాస్పటల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలు, పిల్లలకు సంబంధించిన అంశాల్లో అంకుర ఆసుపత్రి ప్రత్యేకమైన వైద్య చరిత్ర కలిగి ఉందని తెలిపారు. అంకురా హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ దేశవ్యాప్తంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో 14 కేంద్రాల్లో వైద్యసేవలు అందించడం గొప్ప శుభ పరిణామం అని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. వైద్య సేవలలో ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, హైదరాబాద్ తర్వాత అంతటి కీర్తిని ఖమ్మం పొందిందని, వైద్య రంగంలో ఖమ్మం హెల్త్ హబ్‌గా తలపిస్తుందన్నారు.

దశాబ్దాల కాలంగా హాస్పటల్ యాజమాన్యం వ్యాపార దక్పథంతో కాకుండా సామాజిక సేవను తలపించే విధంగా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం హర్షదాయకం అన్నారు.

అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అన్నీ బ్రాంచిల్లో మొత్తం 1800 పడకలు ఉన్నాయని, అందులో భాగంగా ఎన్నో సంవత్సరాలుగా ఖమ్మంలో విశిష్ట సేవలు అందిస్తున్న అంకుర ఆసుపత్రి గర్భిణీ స్త్రీలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో నూతన భవనంలో 120 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. సరికొత్త అత్యాధునిక సాంకేతికతతో అన్నీ వయస్సుల మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణను అందించడానికి అంకుర బృందం నిరంతరం శ్రమిస్తుందన్నారు. డిజిటల్ పద్ధతిలో అంకుర సేవలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఖమ్మంలో 24 పడకల ఎన్ఐసీయు (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్), 18 పడకల పీఐసీయు (పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఉన్నాట్లు తెలిపారు. వాటి ద్వారా అకాల, నవజాత శిశువులకు అవసరమయ్యే అత్యంత క్లిష్టమైన సంరక్షణను అందించనున్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రిలో నిపుణులైన శిశువైద్యులు, ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్టు, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది క్లిష్టమైన సంరక్షణ సేవలు అందించేందుకు. 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఖమ్మంలో కేంద్రంలో 3ఎం ఫెర్టిలిటీ సౌకర్యం ఉందన్నారు. సంతానోత్పత్తి విషయంలో ప్రపంచ సగటులను అధిగమించి అధిక విజయాల రేటును అంకుర కలిగి ఉందన్నారు. ఖమ్మంలో ఈ సదుపాయం ఉండటం అనేది ఇన్ఫెర్టిలిటీ నివారణలు కోరుకునే దంపతులకు ఒక వరంలా మారనుందన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా చైల్డ్- ఫ్రెండ్లీ, మహిళలు, గర్భిణీ స్త్రీలకు ప్రశాం తమైన వాతావరణంలో వైద్య సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. గర్భిణీ స్త్రీలు విలాసవంతమైన సౌకర్యవంతమైన సూట్లు, అధునాతన పిండం ఔషధ సంరక్షణ, అధిక-నాణ్యత గల ప్రినేటల్, పెరినాటల్ కేర్ సౌకర్యాలు అందించనున్నట్లు తెలిపారు. చైల్డ్ బర్తింగ్ క్లాసెస్, గర్భిణీ స్త్రీలకు యోగా, ఆహారం, బ్రెస్ట్ ఫీడింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు తమ ఆసుపత్రిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అంకుర ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాకేష్ చల్లగుళ్ల, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు, గిడ్డంగుల సంస్థల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరరావు, ఖమ్మం మేయర్ పోనుకొల్లు నీరజ, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వి.సుబ్బారావు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, క్లస్టర్ మెడికల్ హెడ్ డాక్టర్ దుర్గాప్రసాద్, మెడికల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి పాల్గొన్నారు.





చేసింది ఏమీ లేక.. మతం పేరుతో కాలయాపన

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్

నవతెలంగాణ-ఖమ్మం

గత పది సంవత్సరాల మోడీ కాలంలో మానవుల ఆత్మస్థైర్యం దెబ్బ తీసి, దేశ ప్రజలు కోసం చేసింది ఏమీ లేక మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ మోడీ కాలయాపన చేస్తున్నాడని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ ఆరోపించారు. బుధవారం ఖమ్మం కూరగాయల మార్కెట్ రిక్షా వర్కర్స్ యూనియన్ సిపిఎం శాఖ మహాసభ బైపాస్ రోడ్‌లోని కూరగాయల మార్కెట్‌లో జరిగింది. ఈ సభలో వై.విక్రమ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రభుత్వ రంగాలను ప్రయివేటుకరణ చేసి దేశాన్ని ఆర్థికంగా దివాళా తీసే విధంగా ముమ్మరంగా మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని, దేశంలో అసంతృప్తి రాకుండా మతాల మధ్య అగ్గి రాజుకునే విధంగా తన రాజకీయ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. రామాలయం పేరుతో రాజకీయాలు చేసి చివరకు నూతన అయోధ్య రామాలయం నిర్మాణంలో కూడా వందల కోట్లు అవినీతి, నాసిరకం పనులకు పాల్పడ్డారని విమర్శించారు. రాబోయే కాలంలో బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా జరిగే రాజకీయ ఆందోళనలో పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని మోడీ విధానాలను ప్రజల ముందు ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జెల్లా ఉపేందర్, కోరే బీరప్ప, మోటే స్వామి, బి.ప్రభాకర్, ఎం.నర్సయ్య, బి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ ఖమ్మం

పోలీస్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ పరేడ్ మైదానంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకల సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆయన సతీమణి నిషిత శర్మ గౌరమ్మకు పూజ చేసి ప్రారంభించారు. పోలీస్ కుటుంబాలు బతుకమ్మలను వివిధ రకాల పూలతో పేర్చి రంగు రంగుల బతుకమ్మలుగా సుందరంగా పేర్చారు. పెద్ద ఎత్తున బతుకమ్మలను మహిళలు తీసుకొచ్చి ఒకే చోట ఉంచి పాటలు పాడుతూ చప్పట్లను వేస్తూ, కోలాటాలు ఆడి ఆనందంగా జరుపుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో రావడంతో పరేడ్ గ్రౌండ్స్ కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు,ఏసీపీలు రవి, సాంబరాజు, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, ఏవో అక్తరూనీసాబేగం,సిఐలు రాజిరెడ్డి, సతీష్, ఉదయ్ కుమార్, రమేష్, రాజు పాల్గొన్నారు.

నేటి నుండి మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు దసరా పండుగ పురస్కరించుకొని గురువారం నుండి నాలుగు రోజులు సెలవులు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రకటించింది. ఈ సెలవు దినములో 10 తేదీ నుంచి 13వ తేదీ వరకు కొనసాగుతాయని, కావున రైతులెవరూ తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని ఈ సందర్భంగా కోరారు. తిరిగి 14వ తారీకు మార్కెట్ యధావిధిగా ఉంటుందని, దీనికి రైతులు, హమాలీలు, దడవాయులు, గుమస్తాలు, వ్యాపారస్తులందరూ సహకరించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్ఈడీ లైట్లు వితరణ

నవతెలంగాణ- బోనకల్

భాగం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. ఆళ్లపాడు గ్రామంలో కెవిఎం బజార్ ప్రజల విజ్ఞప్తి మేరకు ఐదు ఎల్ఈడి లైట్లను భాగం రాకేష్ బుధవారం వితరణగా అందజేశారు. తమ కోరిక మేరకు ఎల్ఈడి లైట్లను అందజేసిన భాగం సేవా ఫౌండేషన్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భాగం సేవ ఫౌండేషన్ తరపున గతంలోనూ ఆళ్ళపాడు, బోనకల్, గోవిందాపురం ఎల్ గ్రామాలలో ఎల్ఈడి లైట్లను వితరణగా ఇచ్చారు. నిరంతర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

న్యాయమైన భూ సమస్యలు వెంటనే పరిష్కరించండి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కల్లూరు

సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల్లో రైతులకు సంబంధించిన న్యాయమైన భూ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్ర గౌడ్‌తో పాటు కల్లూరు, పెనుబల్లి మండలాల తాసిల్దార్లను రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమైతో కలిసి నారాయణపురంలోని తన నివాస గృహంలో రెవెన్యూ, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, అగ్రికల్చరల్ వివిధ శాఖల అధికారులతో భూ సమస్యలు, ఆరోగ్య సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించారు. కల్లూరు, పెనుబల్లి మండలాల పరిధిలోని చెన్నూరు, రామకృష్ణాపురం, పేరువంచ, వెంకటాపురం, లింగగూడెం, గంగాదేవిపాడు తదితర గ్రామాల రైతులు తమ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు రెవెన్యూ రికార్డులలో కనిపించడం లేదని, తాము సాగు చేసుకుంటున్న భూముల్లో అధికారులు మొక్కలు తొలగిస్తున్నారంటూ లింగగూడెం గ్రామానికి చెందిన పలువురు గిరిజన రైతులు ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి పొంగులేటీ కల్లూరు ఆర్డిఓ రాజేంద్ర గౌడ్‌ను, కల్లూరు, పెనుబల్లి తాసిల్దార్లను ఆ యా గ్రామాలు సందర్శించి, రెవెన్యూ రికార్డులు పరిశీలించి న్యాయపరమైన రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కొత్త నారాయణపురం చెరువు కట్ట సమీపంలో బీరప్ప ఆలయ నిర్మాణానికి ఐదు లక్షల విరాళం ప్రకటించి గతంలో మూడు లక్షల అందజేయడం జరిగింది. ఇంకా మిగిలి ఉన్న బీరప్ప ఆలయం నిర్మాణంను పూర్తి చేసేందుకు గాను మరో రెండు లక్షల రూపాయలను పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆలయ నిర్వాక కమిటీ వారికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేతుల మీదుగా అందించారు. అనంతరం నారాయణపురం గ్రామంలో గల రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించి అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్, ఆర్డీవో రాజేంద్ర గౌడ్, తాసిల్దార్లు పులి సాంబశివుడు జి ప్రతాప్, ఏసిపి అనిశెట్టి రఘు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



చెత్త డిస్పోజల్‌కు ప్రణాళికలు రూపొందించాలి

ఖమ్మం : డంపింగ్ యార్డ్ వద్ద చెత్త డిస్పోజల్‌కు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఒకటవ డివిజన్ టిఎస్‌జిఓస్ కాలనీలో టియుఎఫ్ ఐడిసి నిధులు ఒక కోటి 15 లక్షల రూపాయలతో చేపట్టిన డంపింగ్ యార్డు అప్రోచ్, ఇంటర్నల్ సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వ విజయ్ బాబులతో కలిసి శంకుస్థాపన చేశారు. డంపింగ్ యార్డ్ నిర్వహణ ప్రణాళికలు, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ప్రణాళికలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు సంబంధిత అంశాల వివరాలను మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ వద్ద ఒకే చోట పెద్ద ఎత్తున చెత్త డంప్ చేయడం వల్ల ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని, చెత్తను ఎప్పటికప్పుడు డిస్పోజ్ చేయాలని అన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరువేరు సేకరణపై మున్సిపల్ సిబ్బందికి శిక్షణ అందించాలని, ప్రజలలో కూడా అవగాహన కల్పించాలని అన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద వేసిన చెత్త డిస్పోజ్ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని లేనిపక్షంలో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఉంటాయని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లకు కూడా రోడ్డు సౌకర్యం ఉండేలా ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఒకటవ డివిజన్‌లో డంపింగ్‌యార్డ్ అప్రోచ్ రోడ్, అంతర్గత రోడ్లకు ప్రభుత్వం కోటి 15 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో కూడిన రోడ్లు, అగ్రిమెంట్ సమయంలోగా వేయాలని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఒకటవ డివిజన్ కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్, ఖమ్మం ఆర్డీఓ గణేష్, ఖమ్మం అర్బన్ తహశీల్దార్ సిహెచ్. స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి పొంగులేటి నివాళి

తల్లాడ : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నారాయణపురానికి చెందిన గ్రామీణ వైద్యులు బొగ్గుల కృష్ణారెడ్డి చిత్రపటానికి బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రతీ అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మంత్రి రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రఘునాథపాలెం మండలంలో మంత్రి పర్యటించి మంగ్యాతండా, కె.వి. బంజర, మూలగూడెంలో చేపట్టిన అంతర్గత సిసి రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రఘునాథపాలెం మండలం వ్యాప్తంగా ఇల్లు లేని, గుడిసెలు, రేకుల షెడ్డులలో ఉంటున్న పేదల జాబితాను తీసుకోవాలని, ముందస్తుగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసుకోవడం జరుగుతుందని, దశల వారీగా ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు అందేలా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రఘునాథపాలెం మండలంలో 72 అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలు ఉండాలని, పెండింగ్ లేకుండా అంగన్వాడి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, కొత్త భవనాలు లేని కేంద్రాలకు ప్రతిపాదన సమర్పించాలని, పాఠశాలల అభివృద్ధికి అవసరమైన పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. 2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులకు షెడ్యూల్ ప్రకటించి రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ పథకం అందుతుందని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలి

ఖమ్మం : నగరంలోని 20వ డివిజన్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని, పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఖమ్మంలోని 20వ డివిజన్ సాయినగర్‌లో టియుఎఫ్ ఐడిసి నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 20వ డివిజన్‌లో 3 సిసి రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో కూడిన రోడ్లు వేయాలని సూచించారు. ఖమ్మం నగరంలో పెద్ద ఎత్తున చెట్లు పెంచి గ్రీనరీ నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నూతనంగా నిర్మించే రోడ్ల దగ్గర కూడా చెట్లు నాటేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, 20వ డివిజన్ కార్పొరేటర్ బి.ప్రశాంత లక్ష్మీ, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థినిలు ఎంపిక



నవతెలంగాణ-ముదిగొండ
మూడు రోజులుగా మెదక్ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాలికల ఫుట్బాల్ ఛాంపియన్ షిప్‌లో మండల పరిధిలో మేడేపల్లి, అర్బన్ మండలం వివిపాలెం హైస్కూళ్లకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు పాల్గొని అత్యంత క్రీడా ప్రతిభను కనపరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర టీమ్ నుండి ఎం.యువవర్షిని, (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేడేపల్లి) అనూష, (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వివిపాలెం)లు ఎంపికయ్యారని జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆదర్శ్ కోచ్ బియ్యాని కృష్ణయ్య బుధవారం తెలిపారు. యువవర్షిని గతంలో కేలో ఇండియాలో రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ సబ్ జూనియర్స్, జూనియర్స్ ఛాంపియన్షిప్ అండర్ 17 బాలికల ఫుట్బాల్ ఛాంపియన్షిప్‌లో కాంస్య పథకం సాధించిందని ఆయన చెప్పారు. యువవర్షిని, అనూష జాతీయస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ కు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నాగేశ్వరరావు, ఎస్టీఎఫ్ సెక్రెటరీ మూర్తి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ సర్పంచులు కొత్తపల్లి నాగలక్ష్మి, సామినేని రమేష్, పిడి శ్రీనివాస్ ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



సంక్షోభాల నుండి కొత్త సమాజాలు ఆవిర్భావం

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ పిలుపు
- ప్రజా సంఘాల శాఖ కార్యదర్శిగా తుశాకుల లింగయ్య ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్
ఒక దేశంలో సంక్షోభం తలెత్తినప్పుడు, దాని నివారణకు చర్యలు చేపట్టలేక ఉన్న ప్రభుత్వాలు పతనమవడం కొత్త ప్రభుత్వాలు పుట్టుకు రావడం అనివార్యమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో మెరుగు రమణ అధ్యక్షతన ప్రజా సంఘాల శాఖ మహాసభలు జరిగాయి. ఈ సభలో మెరుగు సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలలో తలెత్తిన ఆర్థిక సంక్షోభాల నుండి నేడు అక్కడ ప్రజానీకం నూతన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. వామపక్ష, ఎర్ర జెండా ప్రభుత్వాలు ఏర్పాటయినాయని అన్నారు. భారతదేశంలో కూడా బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాల ఫలితంగా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ సంక్షోభాల నివారణకు తాత్కాలిక ఉపశమన చర్యలు బిజెపి ప్రభుత్వం చేపడుతుందన్నారు. కానీ వీటిని ఎక్కువ కాలం కొనసాగించడం అసాధ్యమని తెలిపారు. ఇప్పటికే దేశంలో జరిగిన రైతు మహా పోరాటం, అనేక రంగాల్లో వస్తున్నటువంటి నిరసన చర్యల ఫలితంగా అనేక రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయని, భవిష్యత్తులో దేశంలో కూడా మార్పు అనివార్యమవుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను కలుపుకొని ఉద్యమించాలని, అందుకోసం పునాదిలో పనిచేస్తున్న శాఖలు సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్రజా సంఘాల శాఖ కార్యదర్శిగా తుషాకుల లింగయ్య ఏకగ్రీవ ఎన్నికైనారు. ఈ మహాసభలో వివిధ ప్రజా సంఘాల జిల్లా నాయకులు మెరుగు రమణ, పగడాల నాగేశ్వరరావు, నామ లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని సామ్రాట్ కు నివాళి

నవతెలంగాణ ముదిగొండ
మండల పరిధిలో గోకినేపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మినేని సామ్రాట్ 12వ వర్ధంతి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డింగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సామ్రాట్ స్థూపం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, మేడేపల్లి సొసైటీ చైర్మెన్ సామినేని వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి పసుపులేటి దేవేంద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలవల పుల్లారెడ్డి, బచ్చలకూరి నాగరాజు, మీగడ నాగేశ్వరరావు, కేతినేని వేణు, జెర్రిపోతుల అంజని కుమార్, పసుపులేటి వెంకట్, నాగుల్ మీరా, మచ్చా సత్యనారాయణ, కొమ్మినేని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన రాయల
ముదిగొండ గ్రామానికి చెందిన మాదాల శ్రీనివాస్ కుమార్తెలు ఖ్యాతినిధి, కల్మషల ఓణీల అలంకరణ వేడుకలో బుధవారం తెలంగాణ రాష్ట్ర గిడ్డింగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుల్లెట్ బాబు, ఉసికల రమేష్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి

సీహెచ్‌ఓ వి.వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మధిర
మండల పరిధిలో పిహెచ్‌సీ దెందుకూరు వైద్యులు డా.పృథ్వీ రాజ్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు ఆదేశాల మేరకు గురువారం జరిగే ప్రపంచ మానసిక ఆరోగ్యదినం పురస్కరించుకొని మధిర పల్లె దవఖాన ఎస్సీ కాలనీ పరిధిలో 5వ అంగన్వాడీ కేంద్రం నందు ప్రజలకు ప్రత్యేక అవగాహన శిబిరం ఏర్పాటు చేసి మానసిక ఆరోగ్యం గురించి సంపూర్ణంగా వివరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసెర్ వల్లముడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖానా వైద్యురాలు జాహ్నవి, ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి, ఎఎస్ఎమ్ వంగూరి విజయకుమారి, అంగన్వాడీ టీచర్స్ రాణి, వెంకటకుమారి ఆశా కార్యకర్తలు సమీప, ప్రశాంతి, సుజాత పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-వేంసూరు
భవన నిర్మాణ కార్మికుల మండల అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ గౌసుద్దీన్ మల్లూరు చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ఐదో మండల మహాసభలో అధ్యక్ష కార్యదర్శులతో పాటు 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడతామని పెండింగ్‌లో ఉన్న క్లైమ్లు పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరెంపుల మల్లయ్య, షేక్ అబ్దుల్ రహమాన్, సారంగుల మల్లేశ్వరరావు, జొన్నలగడ్డ ముత్తయ్య, సత్యనారాయణ చారి, రావూరి రాములు, సాహెబ్, కొండయ్య ఉన్నారు.

జమలాపురంలో సామూహిక అక్షరాభ్యాసం

- సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం



నవతెలంగాణ-ఎర్రుపాలెం
తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు అమ్మవారిని శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. వేకువ జాము నుండి ప్రత్యేక పూజా కార్యక్రమములు నిర్వహించారు. అనంతరం మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులకు తల్లిదండ్రులు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక చండీ హోమం నిర్వహించారు. స్వామి వారిని అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షకులు విజయ కుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, ముఖ్య అర్చ కులు మురళీమోహన్ శర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేగంగా యంగ్ ఇండియా

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం

- 11న శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి
- నిర్మాణానికి రూ.305 కోట్లు నిధుల మంజూరు
- వేగంగా శంకుస్థాపన నిర్మాణ పనులు
- 500 మంది విద్యార్థుల తరలింపు

నవతెలంగాణ-బోనకల్
మండల పరిధిలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో గల 25 ఎకరాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద మధిర నియోజకవర్గంలోనే బోనకల్ మండల పరిధిలోగల లక్ష్మీపురం గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనన్న ఈ స్కూల్ నిర్మాణానికి రూ. 305 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నెల 11న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం జిల్లా ఈఈ తానేశ్వర్, ఎస్ఈ ఎన్‌బి హేమలత మండలాధికారులు విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నారు. శంకుస్థాపన పైలాన్‌ను అధికారులు వేగంగా నిర్మిస్తున్నారు. 25 ఎకరాల్లో నిర్మించునున్న ఈ స్కూల్ స్థలం పెద్దపెద్ద గుట్టలతో, రాళ్లతో, పెద్ద పెద్ద గుంతలతో నిండి ఉంది. ఈ గుట్టను, గుంతలను, రాళ్లను తొలగించడానికి పెద్ద ఎత్తున ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఈ గుంటను తొలిచి స్కూల్‌ను నిర్మించనున్నారు. మండల కేంద్రం నుంచి లక్ష్మీపురంలో స్కూల్ నిర్మించే వరకు సుమారు 11 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ స్కూలుకు వెళ్లడానికి గోవిందాపురం ఎల్ గ్రామం నుంచి గతంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే చిన్న రహదారి మాత్రమే ఉంది. ఇంతకుముందు ఈ రహదారి అరక, ట్రాక్టర్ వచ్చేంతవరకు మాత్రమే ఉండేది. కానీ ఈ స్కూలు నిర్మాణంతో గోవిందాపురం ఎల్ నుంచి స్కూల్ వరకు 60 అడుగుల రహదారి వేస్తున్నారు. ఇప్పటికే 60 అడుగుల వరకు ప్రాథమికంగా రహదారిని ఏర్పాటు చేశారు. ఈ రహదారి పూర్తిస్థాయి మరమ్మతు పనులు కూడా అధికారులు వేగంగా చేపడుతున్నారు. అదేవిధంగా గోవిందాపురం తర్వాత వచ్చే లక్ష్మీపురం గ్రామం నుంచి కూడా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వరకు వెళ్ళటానికి కూడా 50 అడుగుల రహదారిని వేస్తున్నారు. గతంలో ఇది కూడా కేవలం అరక వెళ్లే వెడల్పు మాత్రమే ఉండేది. దీనిని కూడా వెడల్పు చేస్తున్నారు. మరోవైపు చింతకాని మండలం పాతర్లపాడు మీదుగా స్కూలుకు వెళ్లటానికి కూడా రహదారి పనులు చేపట్టారు. గత నాలుగు రోజుల నుంచి గోవిందాపురం ఎల్, లక్ష్మీపురం గ్రామాల నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూల్ వరకు వెళ్లే రెండు రహదారులను ఆర్ అండ్ బి అధికారులు జెసిబిలతో ముమ్మరంగా రోడ్డు పనులు చేస్తున్నారు.

భట్టి విక్రమార్క తన సొంత నియోజకవర్గ కావడంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మాణ పనులు వేగంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి అధికారులు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. బోనకల్లు మండలం నుంచి అన్ని పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులను ఈ శంకుస్థాపన కార్యక్రమానికి తరలించనున్నారు.



స్కూల్ నిర్మించే గుట్ట ప్రదేశం



వేగంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణం



పెండింగ్ వేతనాలు ఇవ్వాలంటూ మిషన్ భగీరథ కార్మికులు ధర్నా

నవతెలంగాణ-కూసుమంచి
మండలంలోని పాలేరు గ్రామంలోని మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని బుధవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని పాలేరు, గురువాయగుడెం ప్లాంట్ లలో పనిచేస్తున్న కార్మికులు తమ మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని తాగు నీటి సరఫరా నిలిపివేసి ధర్నా నిర్వహించారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ యాజమాన్యం, మిషన్ భగీరథ అధికారులు స్పందించి తమ మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేసేంతవరకూ విధులకు హాజరు హాజరయ్యేది లేదని, కార్మికులు తెలియజేశారు. దీని వల్ల మండలంలోని 60 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మంత్రి తుమ్మల పూజలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్
కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా అరికొట్ల కాంతారావు



నవతెలంగాణ-బోనకల్
మండల పరిధిలోని జానకిపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అరికొట్ల కాంతారావును పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి చింతల రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఎలమద్ది వెంకటేశ్వర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరు రంగారావు జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి చింతల రవికుమార్, మండల అధ్యక్షుడు కొనకంచి రామ్మోహన్, ప్రధానకార్యదర్శి మద్దినేని వెంకటేశ్వరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీళ్ల చెరువు గ్రామంలో మహా అన్నదానం

దుర్గాదేవికి బీంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పూజలు

నవతెలంగాణ -కూసుమంచి
మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శ్రీరామ భజన భక్త మండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి బీంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కూసుమంచి గ్రామ మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎర్రమల వెంకటేశ్వర రెడ్డికి మంత్రి పొంగులేటి నివాళి

నవతెలంగాణ-తల్లాడ
మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎర్రమల వెంకటేశ్వర రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని చిత్రపటానికి బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన

నవతెలంగాణ మిషన్ ఆపరేటర్ 'యాకూబ్'

రాత్రి నవతలంగాణ ప్రింటింగ్ ప్రెస్‌లో... పగలు చదువు

- ఓపెన్‌లో డిగ్రీ పూర్తి
- జిల్లాలో 97వ ర్యాంక్... కేటగిరిలో 3వ ర్యాంక్..
- మేనేజర్, సిబ్బంది అభినందనలు

పట్టుదలకు, లక్ష్యసాధనకు ఏదీ అడ్డంకు కాదని ఓ యువకుడు సాధించి నిరూపించాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చదువు మానేశాడు. ఇదే సమయంలో 18 సంవత్సరాల క్రితం ఖమ్మంలో ప్రజాశక్తి ఎడిషన్ ఆఫీసులో మిషన్ ఆపరేటర్‌గా ఉద్యోగంలో చేరాడు. రాత్రి సమయంలో ఉద్యోగం చేసుకుంటూనే పగలు ఓపెన్ డిగ్రీ పూర్తి చేసి ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో జిల్లా స్థాయిలో 97 ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. అతనే మండల పరిధిలోని రావినూతలకు చెందిన షేక్ జానీమియా, జాన్ బి దంపతుల కుమారుడు, నవతెలంగాణ మిషన్ ఆపరేటర్ షేక్ యాకూబ్.

నవతెలంగాణ-బోనకల్
షేక్ యాకూబ్ రావినూతల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాడు. అత్యంత నిరుపేద కుటుంబం కావటంతో పదో తరగతి అనంతరం చదువు మానేశాడు. తాను తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఉపాధి కోసం వెతుకులాట ప్రారంభించాడు. అదే సమయంలో ఖమ్మంలో ప్రజాశక్తి ఎడిషన్ ప్రారంభం కావడంతో రావినూతల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకులు యాకూబ్‌ను ప్రజాశక్తిలో మిషన్ ఆపరేటర్‌గా ఉద్యోగంలో చేర్పించారు. 18 సంవత్సరాల నుంచి ప్రజాశక్తి నవతెలంగాణ మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తూ ఈ విజయాన్ని అందుకున్నాడు. ఆ ఉద్యోగం చేసుకుంటూ తల్లిదండ్రులను పోషిస్తూ వచ్చాడు. కానీ ఇంతటితో సంతృప్తి చెందలేదు. తాను ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలనే పట్టుదల అతనిలో పెరిగింది. రాత్రి సమయంలో ప్రజాశక్తి, ప్రస్తుతం నవతెలంగాణ మిషన్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తూనే పగలు ఇంటి వద్ద ఓపెన్ డిగ్రీ పూర్తి చేశాడు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో బీఈడీ కూడా పూర్తి చేశాడు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కోచింగ్‌కు కూడా వెళ్లకుండా నవతెలంగాణ మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తూనే డీఎస్సీ మెటీరియల్ కొనుగోలు చేసి పట్టుదలతో రాత్రి డ్యూటీ చేస్తూ, పగలు చదువుకొన్నాడు. చివరకు మొదటి ప్రయత్నంలోనే స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఖమ్మం జిల్లా స్థాయిలో జనరల్‌లో 97వ ర్యాంకు సాధించగా బీసీ -ఈలో జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించాడు. పట్టుదల ముందు ఏది నిలబడదని యాకూబ్ నిరూపించి నవతెలంగాణ యాజమాన్యం, సిబ్బందితో శభాష్ అనిపించుకున్నాడు. తమ కుమారుడు ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపిక కావడంతో తల్లిదండ్రుల ఆనందం అంతా అంతా కాదు. హైదరాబాదులో ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి చేతుల మీదగా నియామక పత్రాన్ని బుధవారం యాకూబ్ పాషా అందుకున్నాడు.





నవతెలంగాణ అభినందనలు
కష్టపడి ఉద్యోగాన్ని సాధించిన యాకూబ్ ను నవతెలంగాణ రీజినల్ మేనేజర్ సయ్యద్ జావిద్ నవతెలంగాణ జిల్లా ఇన్చార్జి యనమదుల విక్రం, సర్కులేషన్ ఇంచార్జి ఇరుగు వెంకటేశ్వర్లు, డెస్క్ ఇన్‌చార్జి వీరేష్, స్టాఫర్ శ్రీనివాసరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు కోటి శివారెడ్డి, భూక్య కృష్ణ, నారాయణ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గూగులోతు రామకృష్ణ, నవతెలంగాణ సబ్ ఎడిటర్లు, మిషన్ సెక్షన్ సిబ్బంది తదితరులు అభినందించారు.

పైలెట్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-తల్లాడ
అన్నారుగూడెం గ్రామానికి చెందిన బెజవాడ కృష్ణ 108లో పైలట్‌గా ఉద్యోగం చేసి, అనారోగ్యంతో గత సంవత్సరం మృతి చెందారు. సదరు ఉద్యోగి పని చేసిన జీవీకే, ఈఎంఆర్ఐ కంపెనీ యాజమాన్యం, భూమా నాగేందర్, ఈఎంఈః దుర్గా, వారి కుటుంబానికి బుధవారం 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | అక్టోబర్ 10, 2024 | www.navatelangana.com

ఐద్వా రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 21, 22, 23 తేదీలలో కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఈ సభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు డి.సీతాలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎన్.లీలావతి పిలుపునిచ్చారు. బుధవారం మహిళా బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా భద్రాచలం పట్టణ నాయకులు ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా హక్కులు సాధన కోసం మహిళా చట్టాల రక్షణ కోసం మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వేదిక కానున్నదని తెలిపారు. ఈ సందర్భంగా అక్టోబర్ 21వ తేదీన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఈ సభకు వేలాదిగా మహిళా సోదరీ సోదరీమణులు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఐద్వా మహాసభలు జయప్రదం కోసం పట్టణంలోని అన్ని వార్డులలో ఐద్వాజెండా ఆవిష్కరణలు నిర్వహించాలని, విస్తృతంగా ప్రచార క్యాంపెయిన్ సాగించాలని, వాల్ పోస్టర్లు అంటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు జీవనజ్యోతి, మచ్చా రమాదేవి, ఏజే. గౌతమి, వై.పూర్ణ, పట్టణ ఆఫీస్ బేరర్స్, ఎం.సుబ్బలక్ష్మి, జి.నాగలక్ష్మి, జి.రాధా తదితరులు పాల్గొన్నారు.

సహాయ ఉపకరణాలకు 82 మంది ఎంపిక

నవతెలంగాణ-అశ్వారావుపేట

జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో జిల్లాలో నాలుగు రోజుల పాటు నిర్వహించే వికలాంగుల సహాయ ఉపకరణాలు ఎంపిక శిభిరం బుధవారం నియోజక వర్గం కేంద్రమయిన అశ్వారావుపేటలోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ శిబిరంలో 82 మంది వికలాంగులను బ్యాటరీ ట్రైసైకిల్స్, ట్రైసైకిల్స్, వీల్‌చైర్స్, వినికిడి పరికరాలు, అంధుల చేతి కర్రలు, కృత్రిమ అవయవాలు, చంక కర్రలు కొరకు ఎంపిక చేశారు. ఈ సహాయ ఉపకరణాలు అలింకో నుండి అందిన వెంటనే పంపిణీ చేయనున్నారు. నేటి ఎంపిక శిబిరానికి హాజరు కాలేని వారు ఈ నెల 11 వ తేదీన పాల్వంచలోని ఐడిఓసీ కార్యాలయంలో జరిగే వికలాంగుల ఎంపిక శిభిరానికి హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, అలింకో సిబ్బంది రష్మి, రంజాన్, శెట్టి, అభిషేక్ ద్వివేది, ఐసీడీఎస్ సూపర్వైజర్స్ విజయలక్ష్మి, సౌజన్య, వరలక్ష్మి, స్వరాజ్యం, వరప్రసాద్, నరేష్, అంగన్వాడి టీచర్లు, వికలాంగులు పాల్గొన్నారు.

దమ్మక్క కాలనీ గిరిజనులపై దాడుల్ని ఆపాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దమ్మక్క కాలనీ గిరిజనులపై రాముల వారి టెంపుల్ భూములు ఆక్రమించారని, వారిని ఖాళీ చేయాలని ఈవో రమాదేవి గిరిజనులపై దాడులు నిర్వహించి మహిళా గిరిజనులపై కొట్టించి అనేక ఇబ్బందులు పెడుతున్న పోలీస్‌శాఖ వారు ఎందుకు పట్టించుకోవడంలేదని సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు మునిగలా శివ ప్రశాంత్, దాసరి సాయి ప్రశ్నించారు. బుధవారం పురుషోత్తపట్టణం పరిధిలోని దమ్మక్క కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టిన అప్పటికి ఇప్పటివరకు ఎటువంటి ఎంక్వయిరీ లేకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ గిరిజనులు ఆదివాసీలు 2000 వ సంవత్సరం నుండి ఇక్కడ నివసిస్తున్నారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నుండి ఇంటి పన్ను కరెంటు మీటర్లు అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ భూములలో నివసిస్తున్న వారికి ప్రజాప్రతినిధులుగా అవకాశాలిచ్చి వార్డు నెంబర్లుగా కూడా అధికారులు అవకాశం కల్పించాలన్న విషయాన్ని అధికారులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడివి మల్లయ్య, కురం అంజలి, నరసింహారావు, చిట్టెమ్మ, దుర్గ, చిన్న వెంకటమ్మ, పెద వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి'

నవతెలంగాణ-పినపాక

మండలంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల రామకృష్ణ దొర పినపాక తహసీల్దార్ అద్దంకి నరేష్‌ను కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం నాయకులతో కలిశారు. ఆదివాసీల సమస్యలను ఆయనకు వివరించారు. ఆదివాసీల చట్టాల అమలుకు కృషి చేయాలని కోరారు. అనంతరం తహసిల్దార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల ప్రధాన కార్యదర్శి కుర్సం సారయ్య సలహాదారులు ధనసరి నరసింహ మూర్తి దొర, ఆదివాసీ సీనియర్ నాయకులు కాయం సర్వేశ్వరరావు, పడిగ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగంపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని మర్కోడు గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినట్టుగా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు మర్కోడు గ్రామానికి చెందిన రేసు వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల సెప్టెంబర్ 10వ తేదీ నుండి సెప్టెంబర్ 20వ తేదీ వరకు అడవిరామవరం పంచాయతీ కార్యదర్శి, మర్కోడు గ్రామ పంచాయతీకి ఇన్చార్జి కార్యదర్శిగా బాధ్యతలు తీసుకోగా, పది రోజుల వ్యవధిలో మర్కోడు పంచాయతీ నుండి సుమారుగా రూ.3 లక్షలు డ్రా చేశారని, లెక్కలు లేకుండా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టరేట్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. పంచాయతీ లెక్కల పై జిల్లా కలెక్టర్ పూర్తి విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు పేర్కొన్నట్టు తెలిపారు.

క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

క్రీడా పోటీలు శారీరక మానసిక దృఢత్వానికి దోహదపడుతాయని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి అర్వపల్లి రేవంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆళ్ళపల్లి, గుండాల మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆయా జట్ల క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చూపాలని సూచించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఈ క్రికెట్ క్రీడా పోటీలు విజయవంతంగా కొనసాగాలని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు వాసం శ్రీకాంత్, సీనియర్ మండల నాయకులు మొహమ్మద్ అతహార్, తులం ముత్తిలింగం, బుర్ర వెంకన్న, బూరుగడ్డ నాగేష్, నులకతాటి శ్రీను, వ్యాపారస్తులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నాగేశ్వరరావు, బూరుగడ్డ రాములు, మొహమ్మద్ నయీమ్, సంక ప్రభాకర్, బూరుగడ్డ వెంకటేశ్వర్లు, సంక కిరణ్, గాదయ్య టోర్నీ నిర్వాహకులు ఎండీ.అఫ్రోజ్, సంతోష్(తోపు), పఠాన్ సల్మాన్, పఠాన్ సమీర్, సయ్యద్ యహియ, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవిగా కనకదుర్గమ్మ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో, సీతారాంపురం శివాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడుతున్నాయి. అందులో భాగంగా బుధవారం మూలా నక్షత్రంలో కనకదుర్గమ్మ సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే చదువుకునే విద్యార్థులందరూ సకల విద్యలు కలగచేయమని అమ్మవారిని భక్తులు పూజించారు. అర్చకులు ఆరుట్ల రాజగోపాలచార్యులు రాఘవ శర్మ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కార్మికులకు పండుగలోపు వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

గ్రామపంచాయతీ కార్మికులకు పండుగలోపు వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు, అంబాసిడర్ కార్మికులకు దసరా పండుగ సందర్భంగా వేతనాలు చెల్లించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెద్ద తొలి పండగ అయిన దసరా సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించి పండుగ పూట వారి కుటుంబాలలో పండుగ సందడిని నెలకొల్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోశం రాజు, ఈశ్వర్, కౌసల్య, రాధా, ఎర్రయ్య, తార్య, లింగ, కమల తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే టీ షర్టు

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సూరిబాబు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



క్రీడాకారుల్లో ఉత్సాహం వారిని ప్రోత్సహించేందుకే టీ షర్ట్ అందజేస్తున్నట్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూదోట సూరిబాబు అన్నారు. దుమ్ముగూడెం యూత్ ఆధ్వర్యంలో యూత్ టాలెంట్ లీగ్ క్రికెట్ క్రీడలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు హైదరాబాద్ పట్టణానికి చెందిన జయ క్రాంతి ప్లాస్టిక్ అధినేత శేఖర్ సుమారు 24 మంది క్రీడాకారులకు టీషర్ట్ అందజేశారు. వీటిని జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సూరిబాబు, మున్నూరు కాపు సంఘం మండల ఉపాధ్యక్షులు, ఎఫ్ టు దాబా అధినేత పత్తివాడ జగదీష్ చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. అనంతరం టాస్ వేసి వారు క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లంక శివకుమార్, కొమ్ము రంజిత్, ఆయా జట్లకు చెందిన కెప్టెన్లు, నిర్వాకులు సుమన్, రేసు శ్రీను, గంగాధర్, కుంజ రఘు, హేమంత్, మధు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు ప్రజా పోరాటాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీలు, సంక్షేమ పథకాల అమలుకు ప్రజా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మరొక పాడు గ్రామంలో గల సిపిఐ(ఎం) కార్యాలయంలో లక్ష్మీనగరం 12వ శాఖ మహాసభ, అచ్యుతపురం 4వ శాఖ మహాసభ గుడ్ల తాతారావు, తెల్లం ధర్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తుందని సంక్షేమ పథకాలు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు జరగటం లేదని, అందులో రెండు గ్యారంటీలు మాత్రమే అమలవుతున్నాయన్నారు. ఒకటి ఫ్రీ బస్, రెండు కరెంటు, మిగతా నాలుగు గ్యారంటీ ఇలా సంగతి ఏమిటి అని ప్రశ్నించారు. లక్ష్మీ నగరం, అచ్యుతపురం గ్రామపంచాయతీల పరిధిలో అంతర్గత రహదారులు డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని గుర్తు చేశారు. అదేవిధంగా అన్ని వర్గాల్లోని అరులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు తెల్ల రేషన్



కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువుకున్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ మహాసభకు ముందు లక్ష్మీనగరం మాజీ సర్పంచ్ సరియం రాజమ్మ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, సరియం కోటేశ్వరరావు, లక్ష్మీనగరం నూతన శాఖ కార్యదర్శిగా ఎన్నికైన గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, అచ్యుతపురం నూతన కార్యదర్శి గట్టుపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు మహమ్మద్ బేగ్, గుడ్ల సాయిరెడ్డి, పూనెం శోభారాణి, పంపన శివరావు, సిద్ది నరసింహారావు, తెల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోగాల భారినపడుతున్నాం...డంపుంగ్ యార్డును తరలించండి

- తల్లిదండ్రులు అనారోగ్యం పాలవడంతో ఆగ్రహం
- చెత్త తరలింపు వాహనాలను అడ్డుకొని ధర్నా

నవతెలంగాణ-కొత్తగూడెం



డంపింగ్ యార్డు వలన ఈ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, నివాస ప్రాంతాలకు సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త డంపు యార్డును ఇతర ప్రాంతాలకు తరలించాలని బాధితుడు కోట రమేష్ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాడు. మున్సిపల్ పరిధిలోని పాత కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే వాహనాలకు అడ్డుకున్నాడు. రోడ్డుకు అడ్డంగా బైఠాయించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రాంతలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించన బాదుతుడికి సంఘీభావంగా ఆ ప్రాంత ప్రజలు ధర్నాలో పాల్గొని గంటపాటు చెత్తను తరలిస్తున్న వాహనాలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు కోట రమేష్ మాట్లాడుతూ పాత కొత్తగూడెంలో నివాస ప్రాంతాలకు అతి సమీపంలో చెత్త డంపు యార్డును మున్సిపల్‌శాఖ ఏర్పాటు చేసిందని, నిత్యం వందలాది వాహనాలు పట్టణంలోని వివిధ ప్రాతాల నుంచి చెత్తను సేకరించి నివాస ప్రాతాల మీదుగా తీసు వెళ్లి డంపు చేస్తున్నారన్నారు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా రాకపోకలు జరుపుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తన తల్లి, తండ్రి అనారోగ్యంపాలు కావడంతో వైద్యులను సంప్రదిస్తే చేడు గాలి పీల్చడం వాళ్ళ ఊపిరితిత్తులు పూర్తిగా చెడిపోతున్నాయని, మాస్కు ధరించాలని వైద్యులు సూచించారని తెలిపారు. తాము నివాసం ఉండే ఇండ్ల సమీపంలో యార్డు ఉండటం, ఇండ్ల మధ్య నుంచి వాహనాల రాకపోకలు సాగుతుండటంవల్లే తన తల్లి, దండ్రులు అనారోగ్యం పాలయ్యారని ఆరోపించారు. వెంటనే ఈ ప్రాంతం నుండి డంప్ యార్డును తొలగించి పాత కొత్తగూడెం ప్రాంత ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరారు. పోలీసుల రంగప్రవేశంతో ఆందోళనను విరమించారు. ప్రజలు ఆందోళకు దిగడంతో ఈ ప్రాంతంలో మున్సిపల్ అధికారులు బ్లీచింగ్ చల్లించి చేతులు దులుపు కోవండం కొస మెరుపు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ప్రభుత్వాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ. నర్సారెడ్డి

నవతెలంగాణ-బూర్గంపాడు

మత విద్వేషాలను ప్రభుత్వాలు రెచ్చగొడుతున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి. నర్సారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నకిరిపేట గ్రామంలో బుధవారం సీపీఐ(ఎం) శాఖ గ్రామ మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను దాసరి బాబు ఆవిష్కారించారు. ఈ సందర్భంగా ఎంబి.నర్సారెడ్డి మాట్లాడుతూ మనదేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ప్రభుత్వాల పట్ల ప్రజలు యువతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మనద దేశం లౌకిక దేశమని, దేశ పౌరుల్ని మతాలు వారిగా, కులాల వారిగా విడదీసి పాలించటానికి పాలక ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. యువతరం ముందుకు రావాలని, వారికి సరైన బుద్ధి ఆ ప్రభుత్వాలకు చెప్పాల్సిన అవసరం యువకుల పైనే ఉందని తెలిపారు. అదేవిధంగా నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆటో కార్మికులు బజారున పడ్డారని వారి పరిస్థితి చాలా దారుణంగా ఉందని తెలిపారు. వారికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందన్నారు. సీపీఐ(ఎం) బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సనతాన విధానాన్ని పూర్వం 50 సంవత్సరాల కితం అంటరానితనం ఏదైతే ఉందో దాని మళ్ళీ తీసుకురా వడానికి ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు.



ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా నర్సింగ్ లింగస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గుంటక కృష్ణ, పాండవుల రామనాదం, శ్యామల అజయ్ కుమార్, బుర్ర వెంకన్న, నాయిని సంజీవయ్య, మంగమ్మ, బుచ్చమ్మ, దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద నివారణకే కాటమయ్య రక్షా కవచ్

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నవతెలంగాణ-దమ్మపేట

తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాద నివారణకై కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రణాళికతో కాటమయ్య రక్ష కవచ్ సేఫ్టీ మోకుని నిపుణల సమక్షంలో తయారు చేపించి, శిక్షణ ఇచ్చి, తదనంతరం కిట్లు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. దమ్మపేట కల్లు గీత సొసైటీకి చెందిన సభ్యులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిసి వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్ష కవచ్ కిట్‌లను పంపిణీ చేశారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలోని గోగులబంధంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా గీత కార్మికులకు కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తాటి చెట్టు నుండి లభించే ప్రకృతి సిద్ధమైన కల్లులో పోషకాలు కలిగి



ఉంటాయని, తాగినవారికి ఆరోగ్యం కలుగజేస్తుందని తెలిపారు. కల్లు గీత వృత్తి చేసే వారు చెట్టు ఎక్కి, దిగే క్రమంలో ప్రమాద నివారణకై వారి ప్రాణాన్ని కాపాడే ఉద్దేశ్యం తో ఈ పథకం తమ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. అలాగే చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి హాస్పటల్లో వైద్యం పొందే వారికి తన పరిధిలో ఆర్థికసాయం హాస్పిటల్‌కి చెల్లిస్తామని చెప్పారు. కల్లు గీత సొసైటీ సభ్యులు మాట్లాడుతూ తమ గీత వృత్తిని కాపాడుకోవాలంటే తాటి చెట్లను నరకకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం గౌడకులస్తులకు కేటాయించిన మద్యం టెండర్లలో రిజర్వేషన్‌ని కల్లు గీత సొసైటీలకు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారిణి ఇందిర, సీనియర్ అసిస్టెంట్ అట్టం లక్ష్మణరావు, ఎక్సైజ్ ఎస్ఐ రాజేశ్వరరావు, దమ్మపేట కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు బంధం చెన్నారావు, పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, పానుగంటి ఆదినారాయణ, రాజులపాటి చెన్నారావు, నాగుల సుబ్బారావు, మట్టా సత్యనారాయణ, పానుగంటి ప్రసాద్, కందిమళ్ళ సాంబశివరావు, కట్టా ప్రసాద్, యార్లగడ్డ ఏసుబాబు, కొనకళ్ళ చెన్నారావు, కొనకళ్ళ సత్యనారాయణ, లింగాల సూర్యరావు, గొల్లపల్లి వెంకటేశ్వరావు, కొనకళ్ళ సురేష్, కొనకళ్ళ సత్తిలింగం, మారగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి అవతారంలో కరుణించిన అమ్మవారు

- నేడు ఐశ్వర్య లక్ష్మి రూపంలో దర్శనం
- శరన్నవరాత్రులతో ఆధ్యాత్మిక శోభన సంతరించుకున్న భద్రగిరి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధిలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరో రోజు బుధవారం విజయలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రోజొక్క అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీ తాయారు అమ్మవారు విజయలక్ష్మి రూపంలో దర్శనమీయగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. వేకువజామునే లక్ష్మీ అమ్మవారికి పంచామృతలతో అభిషేకించిన ఆలయ అర్చకులు విజయలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లక్ష్మీ కోవెల ముందు మహిళా భక్తులతో కుంకుమ పూజ నిర్వహించిన అనంతరం విజయలక్ష్మి అవతార ప్రత్యేకతను భక్తులకు అర్చకులు తెలియజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భద్రాద్రి రామయ్య దర్శనానికి వస్తున్న యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి భక్తులందరికీ అన్న ప్రసాద అవకాశాన్ని సైతం కల్పిస్తున్నారు. అవతారంలో భాగంగా మహిళా భక్తులచే ప్రత్యేక కుంకుమ పూజతో పాటు పారాయణాలతో ఆలయ పరిసర ప్రాంతాలు మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి.

ఆధ్యాత్మిక శోభన సంతరించుకున్న భద్రగిరి



ఓ పక్క బతుకమ్మ ఆటపాటలతో మరోపక్క పట్టణ వ్యాప్తంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలతో భద్రగిరి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో కొలువై ఉన్న లలితా పరమేశ్వరి అమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులైన కొడాలి శ్రీనివాస్ సన్ అభినేని శ్రీనివాస్ నేతృత్వంలో దివంగత మాగంటి సూర్యం స్మారక బతుకమ్మ పోటీలు జరగడంతోపాటు లలిత పరమేశ్వరి అమ్మవారు రోజుకొక్క అవతారంలో భక్తులకు దర్శనమియ్యగా శాంతినగర్ మెడికల్ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పాత కూరగాయలు మార్కెట్ ఆవరణలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల సైతం అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు కనిగిరి వినోద్ మధు నేతృత్వంలో రోజుకొక్క ప్రత్యేక కార్యక్రమాలతో ఆధ్యాత్మికంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో మోటర్ మెకానిక్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శరన్నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద భక్తుల కోలాహలంతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉదయం 5 గంటల నుండి అమ్మవారి శ్లోకాలతో పట్టణంలోని పురవీధులలో ఆధ్యాత్మికంగా ఉత్సవాలు కొనసాగుతుండగా సాయంత్రం పట్టణములన్ని వివిధ కోడలే వద్ద బతకమ్మ సంబరాలు సైతం అబ్బురపరిచే విధంగా కొనసాగుతున్నాయి. ఇటు బతుకమ్మ సంబరాలతో పాటు చరనవరాత్రి ఉత్సవాలతో భద్రగిరి మొత్తం ఆధ్యాత్మిక శోభతో విరధిల్లుతుంది.

సింగరేణి ఇచ్చే విందులను వ్యతిరేకిస్తున్నాం

- సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకటరత్నం

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి వ్యాప్తంగా సింగరేణి నిధులతో సింగరేణి కార్మికులకు యాజమాన్యం ఇవ్వాలి అనుకుంటున్న విందులను వ్యతిరేకిస్తున్నామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకటరత్నం అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో టీవీ ఎంవి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు, కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులు ద్వారా సింగరేణి యాజమాన్యం విందులను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నదని దీనిని సిఐటియు పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. సింగరేణి సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని చూస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి అప్పుడు సింగరేణి కార్మికులకు విందు ఏర్పాటు చేయాలని, ఆ విందులో స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా సహపంక్తి భోజనాలకు రావచ్చని, అప్పుడు కార్మిక వర్గం మనస్ఫూర్తిగా వారిని ఆహ్వానిస్తుందనన్నారు. ఇప్పటికే లాభాలు బోనస్ చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం చాలా ఇబ్బందులు పడిందని, ఇప్పటికైనా యాజమాన్యం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి బకాయలు వసూలు చేయాలని, అప్పుడే సింగరేణి మనుగడ కొన సాగిస్తుందన్నారు. ఈ సమావేశంలో మాచారపు లక్ష్మారావు, వై.రామ్మూర్తి, నందం ఈశ్వరరావు, లక్ష్మణరావు, బొల్లం రాజు, ప్రభాకర్‌రావు, వై.బుచ్చిరెడ్డి, బిక్షపతి, సుమన్, శ్రీకాంత్, రాజకుమార్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదో తరగతిలో సీటు సాధించిన శ్రీ సాయి ఎక్సలెంట్ విద్యార్థి

నవతెలంగాణ-జూలూరుపాడు



మండల కేంద్రం పాపకొల్లు రోడ్డులో గల శ్రీ సాయి ఎక్సలెంట్ కోచింగ్ సెంటర్‌లో ఎనిమిదో తరగతి కోచింగ్ తీసుకున్న సూరారం గ్రామానికి చెందిన బానోత్ మురళీధర్ ఎనిమిదవ తరగతి నందు నవోదయ కోచింగ్ సెంటర్ ఎక్సలెంట్‌లో తీసుకుని, తొమ్మిదవ తరగతిలో సీటు సాధించి ఎక్సలెంట్ పేరును జిల్లా స్థాయిలో సాధించాడు. ఈ సందర్భంగా శ్రీ సాయి ఎక్సలెంట్ డైరెక్టర్ హుస్సేన్ విద్యార్థిని అభినందించి మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు గురుకుల నవోదయ కోచింగ్ ఇస్తూ వారి ఉన్నత స్థానానికి గురుకుల నవోదయ సీట్లు సాధించి స్కూల్ పేరుని జిల్లా స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు ఘటన స్థలంలో మృతి చెందారు. ఈ ఘటనలో ఆటో పూర్తిగా డామేజ్ కాగా, మృతి చెందిన ఇద్దరు వ్యక్తులు పాల్వంచ మండలం జగన్నాథం పురానికి చెందిన మనోహర్, సంతోష్‌లుగా గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఘటనపై ఆరా తీస్తున్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-టేకులపల్లి

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను టేకులపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ.పోగుల సురేష్ కథనం ప్రకారం మండలంలోని ముర్రేడు వాగు నుంచి ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా రాత్రివేళల్లో తరలిస్తురని, బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వరుసగా ఇసుక లోడుతో వస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకొని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. ఆరు ట్రాక్టర్ల పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం...

నవతెలంగాణ-కొత్తగూడెం

టియుసిఐలో ఐఎఫ్‌టియు విలీనం జరుగుతుందని, ఈ సందర్భంగా హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న సభను ఏర్పాటు చేసినట్లు ఈ సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, యాకూబ్‌షావళి కోరారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఇఫ్యూ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలి మాట్లాడుతూ 14 రాష్ట్రాల్లో సంఘటిత అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న టియుసిఐలో ఐఎఫ్‌టియూని విలీనం చేసి కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలని దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి కార్మిక వర్గంపై దాడి తీవ్రమవుతున్న తరుణంలో ఈదాడిని ఎదుర్కొనేందుకు దేశంలో ఒక బలమైనటువంటి కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని, కార్మిక హక్కుల కోసం బలమైనటువంటి ఉద్యమాలను నిర్వహించి కార్మికులకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, కోశాధికారి పెద్ద బోయిన సతీష్, పాయం వెంకన్న, నిమ్మల రాంబాబు, ఎం. రాజశేఖర్, చంద్రశేఖర్, సుందర్, వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెగువేరా ఉద్యమ స్ఫూర్తి నేటితరానికి ఆదర్శం

నవతెలంగాణ-కొత్తగూడెం

చెగువేరా ఉద్యమ స్ఫూర్తి నేటితరం నాయకులకు, కార్యకర్తలకు స్ఫూర్తి అని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. విప్లవవీరుడు చేగువేరా 57వ వర్ధంతిని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ నందు బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పఠానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.నాగుల్ మీరా, నాయకులు, ఖయూమ్, యాకూబ్ పాషా, రసూల్, కొచ్చెర్ల జోసెఫ్, పుట్టి భాగ్యలక్ష్మి అంకుస్, కిశోర్, సోమయ్య, బాజాజు రవి తదితరులు పాల్గొన్నారు.

8
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | అక్టోబర్10, 2024 | www.navatelangana.com

ఎన్నో ఏండ్ల నిరీక్షణ...

- డీఎస్సీ ఫలితాల్లో దుమ్ముగూడెం వాసికి

స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఎన్నో ఎండ్ల నిరీక్షణ అనంతరం నిరుద్యోగుల కల సాకారమైంది.... కండ్లు లొట్టపడేలా ఎప్పుడు ఎప్పుడా అని ఎదురుచూసిన డీఎస్సీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.. దీంతో దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కర్రెల తిరుమలరావు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి అర్హత సాధించాడు. మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కర్రెల తిరుమలరావు చిన్ననాటి నుండి చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు దుమ్ముగూడెం సీఎస్ఐ పాఠశాలలో విద్యలు అభ్యసించిన తిరుమలరావు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు దుమ్ముగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించాడు. పిజీ నవభారతి కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ సికింద్రాబాద్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసాడు. ప్రస్తుతం ఖమ్మం పట్టణంలోని సంహితరావు ఐఏఎస్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ ఇస్తున్నాడు. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి అర్హత సాధించడంతోపాటు, బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నియామకపు పత్రం అందుకున్నారు. సుమారు 24 ఏళ్ల నిరీక్షణ అనంతరం ఎస్ఏ సోషల్ సబ్జెక్టులో అర్హత సాధించిన తిరుమలరావును తోటి మిత్రులతో పాటు కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆయువు పోసి.. అడవిలో వదిలి...

నవతెలంగాణ-చంద్రుగొండ



అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్న నెమలిని మంగళవారం గుర్రం గూడెం గ్రామ రైతులు అటవీ సమీప పొలాల్లో గుర్తించారు. గ్రామంలోకి తీసుకొచ్చి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన అధికారులు నెమలిని స్వాధీనం చేసుకొని పూర్తిస్థాయి పర్యవేక్షణ తర్వాత కోలుకున్న నెమలిని బుధవారం సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టామని రేంజ్ అధికారి ఎల్లయ్య చెప్పారు.

జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆయుధపూజ

- పాల్గొన్న ఎస్పీ రోహిత్ రాజు



నవతెలంగాణ-కొత్తగూడెం

నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ఆయుధ పూజను జిల్లా పోలీసులు నిర్వహించారు. బుధవారం హేమ చంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో దసరా నవరాత్రుల సందర్భంగా ఆయుధ పూజను ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. ఎస్పీ ఆయుధ పూజ అనంతరం వాహన పూజ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడంలో భాగంగా ఆయుధ పూజా కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయి మనోహర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

1.5 లక్షల ఎకరాలలో మునగ సాగు చేసేలా చర్యలు

- కలెక్టర్ జితేష్ వీ. పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లాలో 1.5 లక్షల ఎకరాల్లో మునగసాగు చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ అన్నారు. జిల్లాలోని నర్సరీలు, మొరింగా ప్లాంటేషన్, అజోల్ల పెంపకం, కెనాల్ బండ్ ప్లాంటేషన్, మహిళా శక్తి యూనిట్లు, చేపల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, పీఎం విశ్వకర్మ పథకం అమలుపై కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీ వోలు, ఏపీవోలు, ఏపిఎంలు, ఈసీఎస్‌లతో ఐడిఓసి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీలలో ఏదో ఒక మొక్కలు కాకుండా వాతావరణానికి మరియు ఆయుర్వేదంగా అనుకూలమైన మొక్కలు దొరంతో , డెకోమో, యూజీనియా, పండానాజ్, సుబాబులు, వేప, రావి, గానుగ మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని కెనాల్‌ల రెండు వైపులా జామాయిల్, బాంబు, సుబాబుల్, యూకలిప్టస్ మొక్కలు నాటాలని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో ప్రభుత్వ ఆఫీసుల్లో, కాళీ ప్రదేశాల్లో మునగ, ఉసిరి, పనస, మారేడు, మేడి అల్లనేరేడు మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ పరిధిలోని గృహాలు ప్రభుత్వ ఆఫీసులు పంచాయతీ ప్రదేశాలు బట్టి ఎన్ని మొక్కలు పడతాయో అంచనా వేసుకోవాలని దాని ప్రకారం మొక్కల పెంపకం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 1,63 వేల ఎకరాల్లో వరి సాగు, 85 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు, రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, రైతులకు వీటి సాగుతో పాటు అంతర్ పంటలు మరియు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు ప్రత్యామ్నాయంగా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఆయిల్ ఫామ్ మరియు అంతర్ పంటలుగా మోరింగా సాగు, మునగ సాగు,చేపల పెంపకం, బోర్ ఉన్న పంట పొలాల్లో పందిరి సాగు ద్వారా కూరగాయల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని ఆ విధంగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పంటల సాగుకు అవసరమైన ఫామ్ పొండ్, సాగుకు అవసరమైన గుంతలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవచ్చని ఆయన తెలిపారు. ఐదు సంవత్సరాలు దాటిన ప్రతి ఆయిల్ ఫామ్ తోటల్లో కోకో సాగును చేపట్టడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అన్నారు. జిల్లాలో 1,50,000 ఎకరాల్లో మునగ సాగు లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో చేపల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, అజోల్ల పెంపకం, నాటు కోళ్ల పెంపకం, బాతుల పెంపకం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని, దానికి తగిన అవగాహన కల్పించాలన్నారు.

మహిళా శక్తి యూనిట్లు

జిల్లాలో మహిళా శక్తి సమాఖ్య ద్వారా ఏర్పాటు చేస్తున్న మహిళా శక్తి యూనిట్లలో ఆహార సంబంధిత క్యాంటీన్లు, తినుబండారాలు, సాంప్రదాయ వంటలు తయారీ మీద దృష్టి సారించాలన్నారు. మహిళా శక్తి యూనిట్లలో తమ వస్తువుల అమ్మకంలో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలన్నారు. జిల్లాలో మంజూరైన 15 చేపల పెంపకం యూనిట్లను ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అన్ని పంచాయతీలలో పంచాయతీలకు సొంత భవనాలు ఉన్నాయా, లేదా అంగన్వాడి కేంద్రాలు ప్రభుత్వ భవనాలు ఉన్నాయా, అద్దె భవనాలు ఉన్నాయా, పంచాయతీల్లో అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్లు, పంట పొలాలకు వెళ్ళు రోడ్ల వివరాలు, అంగన్వాడీలు, వివరాలు, గ్రామపంచాయతీలో నిర్వహించు సంత వివరాలు, ఉన్న కెనాల్ వాగుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ఈ నెల 20వ తారీకులోగా నిర్దేశించిన పట్టిక ద్వారా అందజేయాలని ఆదేశించారు. ఈ నివేదికల ద్వారా గ్రామపంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి, పంచాయతీలను అభివృద్ధి పరచడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

పీఎం విశ్వకర్మ పథకం

జిల్లాలో ఇప్పటివరకు పీఎం విశ్వకర్మ పథకం కు 11500 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని, ప్రతి గ్రామపంచాయతీలో 18 కులవృత్తులు చేసే వారందరూ ఈ పథకానికి అర్హులని ఆయన అన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ పంచాయతీ పరిధిలోని 18 కులవృత్తులు చేసే వారి అందరి కి ఈ పీఎం విశ్వకర్మ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, అదనపు డీఆర్డీఓ ఎస్.రవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఇండస్ట్రీస్ మేనేజర్ పృథ్వీ, శ్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ వైద్యంపై ప్రభుత్వ పెద్దలు దృష్టి పెట్టాలి..

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ.నర్సారెడ్డి
- కార్యకర్తలలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్న మహాసభలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



70 ఏళ్ల స్వతంత్ర భారతంలో నేటికీ వైద్యం అందక ఆదివాసిల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి అంటే ప్రభుత్వ వైద్యంపై పాలకులకు ఉన్న శ్రద్ధ ఏమిటో స్పష్టమవుతుందని, ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరిచి భద్రాచలం ఏజెన్సీ వైద్యంపై దృష్టి సారించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ.నర్సారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం భగవాన్దాస్ కాలనీశాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ..నాలుగు రాష్ట్రాలకి కేంద్రంగా ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఈ ప్రాంత ఆదివాసి ప్రజలతోపాటు బడుగు బలహీన వర్గా ప్రజలు ప్రభుత్వ వైద్యానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్న నేపథ్యంలో భద్రాచలం వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి వైద్యులు వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి ఏజెన్సీ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

భగవాన్ దాస్ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి

పట్టణంలోని ఎంతో చరిత్ర గల భగవందస్ కాలనీలో నేటికీ స్థానిక సమస్యలు తాండమాడుతున్నాయని భగవాన్ దాస్ కాలనీ సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన సున్నం రాజయ్య మీడియం బాబురావు ఎంపీటీసీగా సేవలందించిన గజ్జల కృపావతి జడ్పిటిసి ప్రభావతి నిధులతో భగవాన్ దాస్ కాలనీలో రోడ్లు డ్రైన్లు విద్యుత్ సౌకర్యాలు కల్పించామని స్వామి గుర్తు చేశారు. గత ఆరేళ్ల నుండి భగవంతసు కాలనీ అభివృద్ధికి దూరమవుతుందని ప్రజాప్రతినిధులు వెంటనే భవన స్కానింగ్ లో పర్యటించి సమస్య పరిష్కారం కృషి చేయాలని కోరారు. పట్టణంలోని 20 వార్డు పరిధిలో ఉత్సాహ వాతావరణంలో కొనసాగుతున్న శాఖ మహాసభలు పార్టీ కార్యకర్తలలో నూతన జోషిని నింపుతున్నాయని రానున్న కాలంలో ప్రజా పోరాటాలకు ఈ మహాసభలు కార్యక్రమాలను రూపొందిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, నాదెండ్ల లీలావతి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గజ్జల రాజు, మాజీ ఎంపీటీసీ గజ్జల కృపావతి, పట్టణ కమిటీ సభ్యులు నకిరేకట్టి నాగరాజు, కోరాడ శ్రీనివాస్, స్థానిక సభ్యులు పాల్గొని అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వామపక్ష చైతన్యానికి ప్రతీక సింగభూపాలెం

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య

నవతెలంగాణ-సుజాతనగర్



వామపక్ష చైతన్యానికి సింగభూపాలెం గ్రామం ప్రతీక అని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. బుధవారం సింగభూపాలెం గ్రామశాఖ సమావేశాలు సీతారాం ఏచూరి ప్రాగాణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలకు సీపీఐ(ఎం) నాయకత్వం వహించి పరిష్కరించిందన్నారు. మొదటి నుంచి సింగభూపాలెం గ్రామం వామపక్ష పోరాటాలకు ముందు వరుసలో నిలుచుందని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ మార్క్సిజం - లెనినిజం సిద్ధాంతం అజేయమనీ, శాఖా మహాసభలలో గ్రామాల్లోని అనేక సమస్యలు చర్చకు వచ్చాయనీ, ఆయా సమస్యల పరిష్కారానికై భవిష్యత్తులో పనిచేసేందుకు వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సింగభూపాలెం గ్రామంలో తాగునీరు, సాగునీరు, డ్రైనేజీలు, పండినపంటకు తగు మద్దతుధర, బోరింగుల ఏర్పాటు, లింక్ రోడ్లు, ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు, బైపాస్ రోడ్డు ప్రతిపాదన, రోజూ గ్రామపంచాయతీ పరిధిలో శానిటేషన్ పనులు, నీరుపలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి తగు నిధులు కేటాయించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన 9 శాఖలకు నూతన బాధ్యులను ఎన్నుకొన్నట్లు తెలిపారు. లిక్కి నాగరాజు, వెంకటేష్, రమేష్, లక్ష్మీ, పలువురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు, పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, మండల నాయకులు చప్పిడి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, పిఎస్ఎం శ్రీధర్ పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

- ఈనెల 21, 22, 23 తేదీలో ఏర్పాటు
- పలు సెంటర్స్‌లో వాల్ రైటింగ్

నవతెలంగాణ-కొత్తగూడెం




ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. మహాసభల ప్రచారంలో భాగంగా పలు సెంటర్స్‌లో (వాల్‌రైటింగ్) గోడ రాతలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుగ్గ వీటి సరళ మాట్లాడుతూ.. ఈనెల 21, 22, 23 తేదీలలో జిల్లాలోని కొత్తగూడెం క్లబ్‌లో ఐద్వా రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలను జయప్రదానికి, ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలో, రాష్ట్రంలో మహిళాపై రోజు రోజుకు హింసలు, దాడులు పెరిగి పోతున్నాయని, వాటిని అరి కట్టడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు.3 సంవత్సరాల పసి కందు నుండి 60 ఏండ్ల వృద్దుల వరకు హత్యాచారాలకు గురవుతున్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో మహిళ ఓట్ల ద్వారా అందనాలు ఎక్కిన తరువాత వారినే చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. మహిళలు కన్నెర చేస్తే ప్రభుత్వాలు కూలి పోతాయని హెచ్చరించారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫం అవుతున్నాయని చెప్పారు. ఈనెల 21, 22, 23 తేదీలలో జరిగే మహా సభల్లో అనేక విషయాలు చర్చింనున్నట్లు తెలిపారు.భవిష్యత్తు కార్యచరణతో ముందుకు సాగే ఐద్వా రాష్ట్ర 4వ మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, సందకూరి లక్ష్మీ అన్నవరపు ఇందిర, నందిపాటి రజిత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఇచ్చే విందులను వ్యతిరేకిస్తున్నాం

- సీఐటీయూ కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి వ్యాప్తంగా సింగరేణి నిధులతో సింగరేణి కార్మికులకు యాజమాన్యం ఇవ్వాలి అనుకుంటున్న విందులను వ్యతిరేకిస్తున్నామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులు ద్వారా సింగరేణి యాజమాన్యం విందులను ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించి అన్ని ఏరియా జనరల్ మేనేజర్లుకు ఆదేశాలు జారీ చేశారు. అందుకు సంబంధించిన సుమారు రూ.1కోటి వెచ్చిస్తున్నట్లు సర్క్యులర్ విడుదల అయిందని పేర్కొన్నారు. దీనికి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు వ్యతిరేకించాల్సింది పోయి, విందులలో పెద్ద పీట వేయడంతో నోరు మెదపకుండా ఉన్నారని విమర్శించారు. దీన్ని సిఐటియు పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. సింగరేణి సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని చూస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి అప్పుడు సింగరేణి కార్మికులకు విందు ఏర్పాటు చేయాలని, అప్పుడే ఆ విందులో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా సహపంక్తి భోజనాలకు హాజరు కావచ్చునని రావచ్చని, అప్పుడు కార్మిక వర్గం మనస్ఫూర్తిగా వారిని ఆహ్వానిస్తుందన్నారు. ఇప్పటికే లాభాలు బోనస్ చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం చాలా ఇబ్బందులు పడిందని చెప్పారు. ఇప్పటికైనా యాజమాన్యం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి బకాయలు వసూలు చేయాలని సూచించారు. అప్పుడే సింగరేణి మనుగడ కొన సాగిస్తుందని, లేనట్లయితే ఇలాంటి విందులతో తప్పుడు నిర్ణయాలతో తెలంగాణకే వెన్నెముక, దక్షిణాది పరిశ్రమల ఆయువుపట్టు అయిన సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, యాజమాన్యం గ్రహించాలని కోరారు.

సెర్ప్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి


మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయ ప్రాంగణంలో స్థానిక ఏపీఎం కె.రాంకుమార్ ఆధ్వర్యంలో 8వ రోజు బతుకమ్మ వేడుకలను పొదుపు మహిళా సంఘాల సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ ప్రత్యేకతలు వీవోలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జె.బాయమ్మ, పి.మంగ, వి.జయశ్రీ, టి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థల పరిశీలన

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో నిర్మించనున్న ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆర్ అండ్ బి ఈఈ జి.తానేశ్వర్ బుధవారం పరిశీలించారు. ఈనెల 11వ తేదీన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనుండటంతో అక్కడ ఏర్పాట్లను వారు పరిశీలించారు. శరవేగంగా శంకుస్థాపన శిలాఫలకాన్ని అధికారులు నిర్మిస్తున్నారు. ఆమె వెంట డీఎల్పీఓ బి. రాంబాబు, తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో మిట్టపల్లి రవికుమార్, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గిర్దావర్ గూగులోతు లక్ష్మణ్, సర్వేయర్ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.





ఏజెన్సీలో మెరిసిన ఆణిముత్యాలు

- డీఎస్సీలో మండలానికి రెండు కొలువులు
- డీఎస్సీ ఫలితాలలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ధనలక్ష్మి, విజయ్

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

2024 డీఎస్సీ ఫలితాలలో ఆళ్ళపల్లి మండలానికి రెండు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. మండల పరిధిలోని పాతురు (మర్కోడు) గ్రామానికి చెందిన కొమరం తిరుపతమ్మ కుమార్తె కొమరం ధనలక్ష్మి నిరుపేద కుటుంబంలో జన్మించి పట్టుదలతో చదివి, 2024 డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉద్యోగం సాధించారు. అదేవిధంగా మండల పరిధిలోని బోడాయికుంట గ్రామనికి చెందిన సుతారి బుచ్చి రాములు రెండవ కుమారుడు సుతాయి విజయ్ 2024 డీఎస్సీ ఫలితాలలో ఎస్‌జిటి (ప్రైమరీ స్కూల్) ఉద్యోగం సాధించారు. మారుమూల ఏజెన్సీ గ్రామాలలో జన్మించి, నిరుపేద కుటుంబ నేపథ్యం ఉన్న యువతీయువకులు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే దృఢ సంకల్పంతో పట్టుదలతో చదివి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కొమరం ధనలక్ష్మీ, సుతాయి విజయ్‌లను మండల వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజలు సోషల్ మీడియా మాధ్యమంగా అభినందించారు.

చెగువేరా, కొమరం భీమ్‌లను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

- ప్రిన్సిపాల్ కన్నెకంటి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-దమ్మపేట

పోరాట యోధులు కొమరం భీమ్, చెగువేరాలను యువత స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కన్నెకంటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం దమ్మపేట మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, మందలపల్లి సెంటర్, దమ్మపేట సెంటర్‌లలో కొమరం భీమ్, చేగువేరా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ఇరువురికి చిత్రపటాలకు పూమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ కొల్లి చందు, రవీందర్, శేషగిరిరావు, వీరమ్మ, ప్రభాకర్, రమణయ్య, అన్నపూర్ణ, నాగేశ్వరరావు, ముక్తేశ్వరి, సుజాత, మన్మథరావు,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

- ఐటీడీపీఓ బీ.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఐటీడీఏ పరిధిలోని ఆదివాసి గిరిజన గ్రామాలలో గిరిజన కుటుంబాలకు, గిరిజన మహిళలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలో వివిధ శాఖలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యా గుమ్మంగా ఖమ్మం జిల్లా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యా గుమ్మం ఖమ్మం జిల్లా అని, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని చదువుల కేంద్రంగా ఖమ్మం జిల్లాను తీర్చిదిద్దామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలోని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ శంకుస్థాపనకు సర్వసిద్ధం చేయాలని ఆదేశించారు. 22ఎకరాలలో లక్షల వ్యయంతో స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. తక్షణమే భూమిని గుర్తించి తగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈనెల 11వ తేదీన స్కూల్ శంకుస్థాపనకు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు అవసరమైన 22 భూమిని రఘునాథపాలెం మండలం జింకలతండా వద్ద గుర్తించినట్లు కలెక్టర్ మంత్రి వివరించారు. నియోజకవర్గంలోని 50 మసీద్‌లకు రూ.50లక్షల నిధులు తక్షణమే కేటాయించాలన్నారు. అక్షయపాత్రకు సంబంధించి త్వరితగతిన భూమిని గుర్తించాలన్నారు. అక్షయపాత్ర బాధ్యులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. డంపింగ్ యార్డ్ సమస్యను అధిగమించేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. కెఎంసీలో శానిటేషన్ సమస్య లేకుండా చూడాలని తగు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అధికారులంతా హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి అధికారం యంత్రాంగం కృషి చేయాలన్నారు. జిల్లాలో మైనింగ్, గంజాయి అక్రమార్కులపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ సునీల్ దత్తుకు సూచించారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల రక్షణ మన కర్తవ్యం అన్నారు. ప్రజలను ఇబ్బందులు గురి చేసే వారిని వదిలిపెట్టి ప్రసక్తే లేదన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా వాజీద్

నవతెలంగాణ-చంద్రుగొండ

పీఆర్‌టీయూ(ఉపాధ్యాయసంఘం) రాష్ట్ర కార్యదర్శిగా చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే.వాజీద్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఎన్నికయ్యారని, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జివిఆర్.మూర్తి, వారణాసి వెంకటేశ్వర్లు, బండి చంద్రశేఖర్‌లు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు మండల బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నిర్మల

నవతెలంగాణ-టేకులపల్లి

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా మండలంలోని దాసు తండా ఎంపీపీ ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న విజయ నిర్మలను నియమించినట్లు ఆ శాఖ మండల అధ్యక్షులు గుగులోత్ మోతిలాల్ బుధవారం తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమించడంతో పిఆర్‌టియు శాఖ తరపున ఉపాధ్యాయురాలు విజయనిర్మలకు అభినందనలు తెలిపారు.

కాన్సీరామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

కాన్సీరామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. బహుజన ఉద్యమ సిద్ధాంత కర్త, రాజకీయ వ్యూహకర్త, బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యులు కాన్షీరామ్ వర్ధంతిని స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లి కార్జునరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కాంపాటి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరు నాయక్, జిల్లా కోశాధికారి పీక మల్లికార్జునరావు, కొత్తగూడెం, ఇల్లందు, పినపాక నియోజకవర్గ అధ్యక్షులు నాగుల రవికుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | అక్టోబర్ 10, 2024 | www.navatelangana.com



నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం సత్తుపల్లి మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో సీపీఐ(ఎం) సత్తుపల్లి రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) గ్రామ నూతన శాఖ కార్యదర్శులు, సోషల్ మీడియా బాధ్యులతో మండల స్థాయి సమావేశం వేపులపాటి కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బండారు రమేష్ మాట్లాడుతూ దేశంలో ప్రజలు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలన గాలికి వదిలేసి విదేశీ పర్యటనలు, విద్వేష ప్రసంగాలతో ప్రజలను రెచ్చగొట్టి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ, మన దేశంలో మాత్రం పెట్రోల్ డీజిల్ ధరలు ఏమాత్రం తగ్గించకుండా ఆయిల్ కంపెనీలకు కోట్లాది రూపాయలు లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగి ఆకాశాన్ని అంటుతున్న వాటి ఊసే ఎత్తకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, దీనివలన పేద మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, పార్టీ మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్, కొలిక పోగు సర్వేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు యలగం కృష్ణ, కాకాని శ్రీనివాసరావు, జాజిరి జ్యోతి, అయినంపూడి సనందన్ రావు, కొత్తపల్లి రఘు, బండి వేలాద్రి, ముత్తిని శ్రీను, ఎలగం రాములు, బెజవాడ లక్ష్మీ నారాయణ, ఆంగోతు పద్మ, గుదే మారేశ్వరి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-వేంసూరు

ఐసీడీఎస్ వేంసూర్ క్లస్టర్ పరిధిలోని మర్లపాడులో బుధవారం సూపర్వైజర్ కమలం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వులతో బతుకమ్మను పేర్చి పిల్లలు తల్లులు సిబ్బంది ఆటపాటలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ కనకదుర్గ మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయ పండుగ బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజులు నిర్వహించడం అనవాయితీగా వస్తుందని సంప్రదాయాల గౌరవిస్తూ కుల మతాలకతీతంగా నిర్వహించుకోవడం ఆనందాన్ని ఇస్తుందని అన్నారు.

జేపీ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

దసరా పండుగను పురస్కరించుకొని వేముల నరేష్ బాబు సమక్షంలో మండల పరిధిలోని జానికీపురం గ్రామంలో క్రికెట్ పోటీలను నరేష్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి మండలంలో వున్న అన్ని గ్రామ పంచాయతీల్లో యువకులు క్రికెట్ పోటీలకు అర్హులని, 500 రూపాయలు ఎంట్రీ ఫీజ్ నిర్ణయించడం జరిగిందని అన్నారు. మొదటి బహుమతి రూ.12వేల నగదు, ద్వితీయ బహుమతి 8వేలు నగదు అని చెప్పారు. కమిటీ నియమ, నిబంధనలు మేరకు నిర్ణయాలు వుంటాయని అన్నారు. కాంగ్రెస్ మండల యువజన నాయకులు వేముల నరేష్ మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ మరో అడుగు ముందుకు వేసి జానికీపురం గ్రామంలో ఇటీవల చనిపోయిన యువకుడు గోపాలకృష్ణ జ్ఞాపకార్థంగా జెపి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ కు ఆర్థికంగా సహకరించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన తెలంగాణ ఉద్యమకారుడు వేల్పుల

నవతెలంగాణ-జూలూరుపాడు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వారి స్వగ్రామం నారాయణపురం గ్రామంలో బుధవారం తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా మండలంలో ప్రత్యేక వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సుదీర్ఘకాలం ఎన్నో త్యాగాలకు ఓర్చి తెలంగాణ రాష్ట్రం సిద్ధించే వరకు పనిచేసిన తెలంగాణ ఉద్యమకారులకు తమరి ప్రభుత్వంలో, కాంగ్రెస్ పార్టీలో సముచితమైన అవకాశాలు కల్పించాలని మంత్రిని సవినయంగా కోరారు.

ఉద్యోగం సాధించిన బానోతు అనూషకు అభినందనలు

నవతెలంగాణ- జూలూరుపాడు



ఏన్కూరు గ్రామానికి చెందిన బానోతు అనూష బాయ్ డీఎస్‌సి-2024లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌సీటి పోస్టులో డిస్ట్రిక్ట్ 94 ర్యాంకు సాధించింది. మంగళవారం ప్రకటించిన 1:1 లో ఉద్యోగం సాధించి బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అపాయింట్మెంట్ ఆర్డర్ తీసుకునుటకు ఎల్బీ స్టేడియం హైదరాబాద్ నుండి హాజరై ఆర్డర్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సాయి ఎక్స్ లెంట్ కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, జూలూరుపాడు ప్రముఖులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాను, మంగీలాల్ నాయక్, గ్రామ పెద్దలు అభినందించారు.



చేగువేరా స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

- దోపిడీకి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుదాం..
- డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ పిలుపు
- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా చేగువేరా వర్ధంతి

నవతెలంగాణ-రఘునాథపాలెం రూరల్

నేడు సమాజంలో జరుగుతున్న దోపిడీకి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడటమే చేగువేరాకి ఇచ్చే నిజమైన నివాళి అని, చే ఆశయాల సాధనకు విద్యార్థులు, యువత కృషి చేసి పోరాడాలని, ఆయన స్ఫూర్తితో సామాజిక,సేవ కార్యక్రమాలు నిర్వహించాలనీ డి.వై.యఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ విప్లవకారుడు యూత్ ఐకాన్ చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా స్థానిక చిమ్మపుడి గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా చిత్ర పటానికి పూలమాల, పూలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడైనా అన్యాయం జరిగితే స్పందించడానికి సిద్ధంగా ఉండు అన్ని చేగువేరా ఇచ్చిన పిలుపుని అందుకొని చే స్ఫూర్తితో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పనిచేస్తుందని, చేగువేరా క్యూబాలో విప్లవం తీసుకొచ్చి లాటిన్ అమెరికా దేశాల్లో మోటర్ సైకిల్ ర్యాలీ చేసి పేద ప్రజల కోసం దోపిడీకి అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేమల్లె జైపాల్, షేక్.నఫీర్, జోనెబోయిన.నవీన్, లోహిత్ రెడ్డి, పురం. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గెలలు మద్దతు ధరపై కార్యాచరణ

- ఆంధ్రా, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రులతో కేంద్రంతో సంప్రదింపులు
- 12న పరిశ్రమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం
- ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల హాజరు
- ఆయిల్ ఫాం సాగుపై అవగాహన సదస్సు
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-అశ్వారావుపేట

పామాయిల్ గెలలు మద్దతు ధరకు కార్యాచరణ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందుకోసం తెలంగాణ - ఆంధ్ర వ్యవసాయ శాఖ మంత్రులు సహాయంతో కేంద్రంపై సంప్రదింపు జేసే విధంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఈ నెల 12న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ,హ్యాండ్లూ, కో - ఆపరేటివ్, టెక్స్టైల్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఆయిల్ఫెడ్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, ఎండీ యాస్మిన్ బాషా లు హాజరవుతారని చెప్పారు. అనంతరం ఆయిల్ ఫాం సాగు విస్తరణ, తోటలు నిర్వహణపై ఐఐఓపీఆర్ నిపుణులతో అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు.

ఈ మేరకు ఫ్యాక్టరీలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంతో పాటు ఆయిల్ ఫాం రైతు సదస్సు ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫెడ్‌పై విద్యుత్ భారం తగ్గించుకునేందుకు స్వంతంగా రూ.30 కోట్లకు పైగా నిధులతో 2.5 మెగా వాట్స్ సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించినట్లు వివరించారు. ఆయిల్ ఫాం రైతు సదస్సుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం నేతలతో పాటు పలు



ప్రయివేట్ కంపెనీ బాధ్యులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయిల్ ఫాం రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆయిల్ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, మేనేజర్‌లు నాగబాబు, కళ్యాణ్ గౌడ్, పవన్, గోపాల క్రిష్ణ, రాధాక్రిష్ణ, ఆయిల్ఫెడ్ అడ్వైజరీ బోర్డు సభ్యులు, రాష్ట్ర ఆయిల్ ఫాం రైతు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, సుంకవల్లి వీరభద్రరావు, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, మొగళ్ళపు చెన్నకేశవ రావు, తుమ్మ రాంబాబు, బండి భాస్కర్ ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం



బతుకమ్మ పండుగని ప్రతి సంవత్సరం మిర్చి ఖరీదు శ్రామిక మహిళా సంఘం (సిఐటియు), ఖమ్మం 3 టౌన్ ఆధ్వర్యంలో నిర్వహించడం అనేది చాలా సంతోషించదగ్గ విషయమని సిఐటియు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ తెలిపారు. సమాజంలో మహిళలని ఎదగనీయాలి, చదవనీయాలి అనే నినాదంతో బతుకమ్మ నిర్వహించడం అనేది జరుగుతున్నది. సమాజంలో మనువాద సిద్ధాంతం పేరుతో బిజెపి మహిళల పట్ల వివక్షతని చూపిస్తున్నదని అన్నారు. మహిళలు సమాజంలో చదువుకోవద్దు, ఉద్యోగం చేయొద్దు అని చెప్తున్నారని, ఈ దుర్మార్గ చర్యలకు వ్యతిరేకంగా మహిళలు పెద్ద ఎత్తున పోరాటం చేయాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని యర్రా శ్రీకాంత్ కోరారు. తెలంగాణ ఆడబిడ్డ బతుకమ్మకు విద్యనిద్దాం, వైద్యం అందిద్దాం, ఉపాధి కల్పిద్దాం, గౌరవంగా బతకనిద్దాం. మూఢ నమ్మకాలు విడనాడి విజ్ఞానాన్ని రూపొందించుకుందాం అని అన్నారు. కార్యక్రమంలో హమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శ్రీనివాసరావు, మిర్చి కోల్డ్ హమాలి యూనియన్ అధ్యక్షులు హెచ్.వీరయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు బండారు సునీత, పాశం సైదమ్మ భూక్యా సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారి విధానాలపై విద్యావంతులు పోరాడాలి

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

కేంద్రంలో పాలన కొనసాగిస్తున్న ప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకు, మతోన్మాదులకు, బూర్జువా పెట్టుబడిదారీశక్తులకు కొమ్ముగాస్తుందని, ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపదను ఆదానీ, అంబానీలకు కట్టబెడుతుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశ సమైక్యత సమగ్రతలు సార్వభౌమాధికారాన్ని కాపాడటంలో మేధావులు, విద్యావంతులు, రచయితలు కీలక పాత్ర పోషించాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మం సుందరయ్య భవనంలో విద్యావంతుల శాఖ మహాసభ భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ మతసామరస్యం కోసం అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా మేధావులు, విద్యావంతులు, రచయితలు, కవులు, కళాకారులు కృషి చేయాలని అన్నారు. ఈ మహాసభలో రాజేశ్వరరావు, రాజా, లెక్చరర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శాఖ నూతన కార్యదర్శిగా ఎల్‌వి ఎన్నికయ్యారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ-ఖమ్మం

ఉపాధ్యాయ ఉద్యమ నేత ఉపాధ్యాయ, అధ్యాపక సామాజిక సేవా తత్పరుడు, నిజాయితీ, నికార్సాయన వ్యక్తి తన పదవిని విద్యారంగ పరిరక్షణకు, సామాజిక ఉద్యమాలకు అంకితం చేస్తున్న ఎం.నర్సిరెడ్డి మరోసారి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నందుకు, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ -475 రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వి. శ్రీనివాస్ డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు . బుధవారం ఖమ్మంలోని టిఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ 475 తరపున శుభాకాంక్షలు అభినందలు తెలిపారు. అనేక ఉపాధ్యాయ ఉద్యమాలలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కొరకు ప్రభుత్వ వైద్య రంగ అభివృద్ధికి తన శాయిశక్తుల కృషి చేస్తూ ఏ సమస్యలైనా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళటం అవసరమైతే ఉద్యమాలకు సహకరిస్తూ, నిజాయితీగా నికారుసుగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపారు. త్వరలో ఖమ్మం, నల్గొండ, వరంగల్ టీచర్ నియోజక వర్గానికి త్వరలో జరగబోవు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో నర్సిరెడ్డి విజయానికి సంపూర్ణంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రేమిడి మల్లారెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి మల్లయ్య, కొండ వినోద్ బాబు, మహబూబాద్ జిల్లా అధ్యక్షులు డి.రవికిరణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచర్ల శ్రీకాంత్, తోట నాగేశ్వరరావు, రాంబాబు, నాయకులు అడపాల ప్రసాద్‌రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



బిల్డింగ్ వర్కర్ కుటుంబానికి సీఐటీయు పరామర్శ

నవతెలంగాణ-కారేపల్లి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దంపతులు బిల్డింగ్ వర్కర్, మధ్యాహ్న భోజన వర్కర్లు అయిన ఉండం సూర్యనారాయణ-సుగుణ దంపతుల కుటుంబాన్ని సీఐటీయు నాయకులు పరామర్శించారు. కారేపల్లి మండలం గుట్టకిందగుంపు చెందిన ఉండం సూర్యనారాయణ- సుగుణ దంపతులు భాగ్యనగర్‌తండా వద్ద జరిగిన మోటర్ సైకిల్ యాక్సిడెంట్‌లో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కేలోత్ రవి, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర పరామర్శించా కుటుంబ సభ్యులను ఓదార్చారు. యూనియన్ తరపున అర క్వింటా బియ్యాన్ని అందజేసారు. కుటుంబ పెద్దలు ఇద్దరు మృతితో చిన్న పిల్లలైన కుమారుడు, కుమార్తెలు జ్ఞానేశ్వర్, నవ్య దిక్కుతోచని స్థితిలో ఉన్నారని సీఐటీయు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతులు ఇద్దరు కార్మికుల అయినందున ప్రభుత్వం ఆ కుటుంబానికి సాయం అందించాలని వెల్ఫేర్ బోర్డు, ఇన్సూరెన్స్ కార్మిక శాఖ ద్వారా పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు ముక్కా సీతారాములు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు కట్ట రమేష్, గ్రామపంచాయతీ వర్కర్ నాయకులు పూనేం భద్రం, ఎట్టి రామారావు, గ్రామ పెద్దలు ఉండం రాఘవులు ఉన్నారు.

మండల మహాసభను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



ఈనెల 20న పిండిప్రోలు గ్రామంలో జరిగే సిపిఎం మండల 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక తిరుమలాయపాలెం గజ్జల వెంకటయ్య భవనంలో పార్టీ సీనియర్ నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ మండలంలో 24 గ్రామ శాఖలు ఉండగా 24 మహాసభలు పూర్తి చేసుకొని ఈనెల 20వ తారీకున మండల మహాసభలకు వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ పార్టీకి గ్రామ శాఖలు పట్టుకొమ్మలని, గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి శాఖా కార్యదర్శులు ముందుండి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ మండల మహాసభ సందర్భంగా పిండిప్రోలు గ్రామంలో యువకులతో కవాతు ఉంటుందని, అలాగే భారీ ర్యాలీ ఉంటుందని, ప్రారంభ సభ కూడా ఉంటుందన్నారు. సమావేశంలో మండల నాయకులు వేగినాటి వెంకట్రావు, బింగి రమేష్, అంగిరేకుల నరసయ్య, పద్మనాభల సుధాకర్, వర్షాంగ వీరన్న, రేపకుల వెంకన్న దాసరి మహేందర్, దిండు మంగపతి, కొలిచలం స్వామి, నెరసుల వెంకటేష్, దొడ్డ లింగస్వామి, కొత్తపల్లి వెంకన్న,గుగులో అలీయా,గూగులోతు బాలు, పో ట్ల వాసయ్య, సోమనబోయిన అంజయ్య, రావుల విజయపాల్ రెడ్డి, వేగినాటి మంగతాయారు, కోట ఉపేందర్ రెడ్డి, ప్రభాకర్, నాగయ్య, పల్లి రమేష్,ఉపేందర్, బాలస్వామి, తంగల రమేష్, గుణమాల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ సంబురాల్లో పొంగులేటి సతీమణి మాధురి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణ పరిధిలోని కృషి బైపాస్, కొత్తూరు సాయి మందిరం, గుడిపాడు ప్రాంతాల్లో జరుగుతున్న దసరా ఉత్సవాల సంబురాల్లో మంగళవారం రాత్రి రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయా ఉత్సవ కమిటీలు అతిథులను సాదరంగా ఆహ్వానించి ఉత్సవ మందిరాల వద్ద ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఉత్సవ మందిరాల వద్ద జరిగిన బతుకమ్మ ఆటల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, మందపాటి పద్మజ్యోతి, కంటె నాగలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-వైరాటౌన్



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సందర్భంగా బ్రాహ్మణపల్లిలో బతుకమ్మలతో ఆడి పాడడం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ మాట్లాడుతూ మహిళలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, సమాజ పరిణామ క్రమంలో అభివృద్ధికి దోహదపడుతున్న ఆడపిల్లలను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం నినాదంతో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు పాలకులు ఎవరు ఉన్నా మహిళలను కాపాడడంలో హింసను, అత్యాచారాలను, అరికట్టడంలో చిత్తశుద్ధి లేదన్నారు. సమాజంలో అనేక అలజడులకు అకృత్యాలకు కారణమైన డ్రగ్స్, మద్యం, పబ్బులను, పాలకులు ఆదాయ వనరులుగా చూస్తున్నారని, వాటిని నిషేధించినప్పుడే మహిళలకు సంపూర్ణ రక్షణ ఉంటుందని అన్నారు. బతుకమ్మ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు ఐద్వా పట్టణ సభ్యురాలు కంసాని మల్లిక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి తోటా కృష్ణవేణి, నాయకురాల్లు దేవబత్తుని లక్ష్మీ తులసి, యాదగిరి కళావతి, తాటి కృష్ణవేణి, చావ కళావతి, కొంగర ఉష, తదితరులు పాల్గొన్నారు.

బతకమ్మ పూలకు చెరువులోకి దిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-అశ్వాపురం

బతకమ్మ పూలకు చెరువులోకి దిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన నున్న ఐలయ్య (38) బతుకమ్మ పండగ జరుపుకునేందుకు చెరువులో ఉన్న కమలం పూలను కోసుకొచ్చేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



మణుగూరు: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు బుధవారం వేడుకలు నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మహిళలు బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. సహజమైన పూలతో భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. మహిళలు బతుకమ్మ పాటలతో ఆడి పాడారు.

కిష్టారం ఓసీ భవానిమాత ఆలయం వద్ద అన్నదానం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ఆవరణలోని శ్రీభవానిమాత ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు దయానంద్‌కు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని జరిపించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమాన్ని దయానంద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మునగంటి వేదాద్రి నరసింహారావు, మేనేజర్ రామకృష్ణ, సేఫ్టీ ఆఫీసర్ గోపీకిశోర్, సర్వే ఆఫీసర్ డి.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శులు బాలాజీ, కిశోర్, కాంగ్రెస్ నాయకులు ఉడతనేని అప్పారావు, దొడ్డా శ్రీనివాసరావు, నారాయణవరపు శ్రీనివాస్, పానెం ఈశ్వర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్బాల్‌కు యువ వర్షిని, అనుష ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

మూడు రోజులుగా మెదక్ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 గర్ల్స్ ఫుట్బాల్ ఛాంపియన్ షిప్‌లో అత్యంత క్రీడా ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో జరిగే ఫుట్బాల్ ఛాంపియన్షిప్ తెలంగాణ రాష్ట్ర టీమ్ నుండి ఎం.యువ వర్షిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేడేపల్లి, అనూష జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వివి పాలెంలు ఎంపికయ్యారని జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆదర్శ్ కోచ్ బియ్యాని కష్ణయ్య తెలిపారు. యువ వర్షిని గతంలో రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ సబ్ జూనియర్స్, జూనియర్స్ ఛాంపియన్షిప్, అండర్ 17 ఇయర్స్ గర్ల్స్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్‌లో కాంస్య పతకం సాధించిందని వారు తెలిపారు. యువ వర్షిని అనూష జాతీయ ఫుట్బాల్ ఛాంపియన్షిప్‌కు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నాగేశ్వరరావు, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ మూర్తి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ సర్పంచులు కొత్తపల్లి నాగలక్ష్మి సామినేని రమేష్, పిడి శ్రీనివాస్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మహా అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సారధి నగర్ వద్ద నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ వార్షికోత్సవ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్యాల లక్ష్మణ్, మన్నె నరేష్, చల్లా సైదులు, దగ్గు రమణమ్మ, బైరి జయమ్మ, దగ్గు జయమ్మ, మన్నె సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరెల పంపిణీ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతి ప్రసిద్ధి గాంచిన జమలాపురం గ్రామంలో దాతల సహకారంతో నిర్వహించబడుతున్న శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి మహిళా సభ్యులకు దసరా కానుకగా ఖమ్మం కేఎస్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్ళూరి కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు బుధవారం చీరెలను అందజేశారు. అన్నదాన సేవా సమితి ద్వారా భక్తులకు అన్నదానం చేసేందుకు సహకరిస్తున్న తుళ్ళూరి దంపతుల సేవలు మరువలేనివని ప్రతి పండుగకు సేవా సమితి సభ్యులను సత్కరిస్తున్నందుకు మహిళలు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు లక్కిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, వీరమాచినేని నాని, లీలా కృష్ణ, చొప్పవరపు శ్రీనివాసరావు, సభ్యులు వెలిశెట్టి వెంకట కృష్ణారావు, ఎర్రగుంట రాజేశ్వరరావు, ఇరుకులపాటి వెంకట్రావు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అంకం అరుణాదేవి ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగు పూలతో బతుకమ్మను పేర్చి నెత్తిన పెట్టుకొని బతుకమ్మ ఆటపాటతో ఆడి అలరించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మధుసూదన్ రావు, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు, పీహెచ్ఎన్ రాణి, హెల్త్ సూపర్వైజర్స్ లత, పద్మావతి, ఫార్మసిస్ట్ సత్యవతి, స్టాఫ్ నర్స్ కుమారి పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు వెసులుబాటు

- స్లాట్ తేదీలతో సంబంధం లేకుండా కౌన్సిల్లో రిజిస్ట్రేషన్లు
- తాత్కాలిక సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకునే అవకాశం
- తెలంగాణ ఫార్మసీ మండలి వెల్లడి



నవతెలంగాణ -మిర్యాలగూడ

బీ ఫార్మసీ విద్యార్థులకు తెలంగాణ ఫార్మసీ బోర్డు ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 దరఖాస్తులు చేసుకునేందుకు తెలంగాణ ఫార్మసీ మండలి పలు వెసులుబాట్లు కల్పించింది. అత్యవసర దృష్ట్యా స్లాట్ తేదీలతో సంబంధం లేకుండా తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ కార్యాలయాన్ని సందర్శించే అవకాశం కల్పించడంతో పాటు ఒరిజినల్ డిగ్రీ (ఓడి) సర్టిఫికెట్‌లకు బదులుగా తాత్కాలిక సర్టిఫికెట్ల ఆమోదంతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ నిబంధనల్లో సడలింపు ఇచ్చింది. 'మెడికల్ బోర్డు నోటిఫికేషన్‌లో తిరకాసు' అనే శీర్షికతో బుధవారం 'నవతెలంగాణ'లో ప్రధాన సంచికలో ప్రచురణ కావడంతో తెలంగాణ ఫార్మసీ బోర్డు అధికారులు స్పందించి అత్యవసర సమావేశం నిర్వహించారు. బోర్డు రిజెండర్ విడుదల చేశారు. దాని ప్రకారం రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్లు ఒకటి రెండు రోజుల్లో మాత్రమే పూర్తి చేస్తామని, అత్యవసర దృష్ట్యా వెంటనే వాస్తవికత నిర్ధారణ నివేదికలను జారీ చేయాల్సిందిగా ఫార్మసీ కౌన్సిల్ జేఎన్టీయూహెచ్‌ని అభ్యర్థించింది. తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ద్వారా డిగ్రీలు త్వరగా నమోదు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 165 బి ఫార్మసీ కళాశాలల్లో 2020-2024లో ఫార్మసీ ఉత్తీర్ణులైన సుమారు 8 వేల మందికి పైగా విద్యార్థులకు ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది.

చిరుతపులి సంచారంపై భయాందోళన

- వడ్డేపల్లి గ్రామాన్ని సందర్శించిన దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



నవతెలంగాణ-రాయపోల్

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారంపై గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు చిరుతపులి ఆచూకీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ వడ్డేపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డేపల్లి అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్టు రైతులు చెప్పడంతో అడవిలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. చిరుత పులి ఎప్పుడు ఒకే చోట నివాసం ఉండదని తరచూ తిరుగుతుంటుందని తెలిపారు. అడవికి దగ్గరగా వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు గొర్రెలు, మేకలు, పశువులను పొలాల వద్ద ఉంచకుండా ఇంటికి తోలుకొచ్చుకోవాలని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిరుత పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. పొలాల వద్దకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులెవరూ పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్లు హైమద్ హుస్సేన్, మల్లయ్య బీట్ ఆఫీసర్లు జహంగీర్, వేణు ఉన్నారు.

అనుమతిలేని నిర్మాణం కూల్చివేత




మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతి లేని కట్టడాన్ని కూల్చివేస్తున్న అధికారులు

నవతెలంగాణ - కోల్‌సిటీ

పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గౌతమినగర్‌లో అనుమతి లేని కట్టడాన్ని రామగుండం నగర సంస్థ కూల్చివేసింది. గౌతమి నగర్‌లోని ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో పర్లపెల్లి సందీప్ నిర్మిస్తున్న అనధికార కట్టడాన్ని జిల్లా అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణశ్రీ ఆదేశాలతో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది బుధవారం ఉదయం కూల్చేసింది. నోటీస్ జారీ చేసినప్పటికీ సదరు యజమాని స్పందించలేదని పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపీ శ్రీధర్ ప్రసాద్, టీపీఎస్ నవీన్ తెలిపారు. నగర పాలక సంస్థ అనుమతి పొందిన తరువాతనే భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

కష్టపడ్డ కార్యకర్తలకు కష్టం కలగనివ్వం

- ముఖాముఖిలో మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు క్షేత్ర స్థాయిలో కష్టపడ్డ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి కష్టం కలగనివ్వకుండా చూసుకుం టామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పుడు పార్టీ పరంగా కష్టపడ్డ కార్యకర్తల సమస్యలను పరిష్కరిం చేందుకు ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 179 అంశాలపై వినతిపత్రాలు వచ్చాయన్నారు. అందులో రవాణా శాఖకు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టుగా రేషన్‌కార్డుల డిజిటల్ కార్యక్రమం కొనసాగుతున్నదన్నారు. ప్రభుత్వం ఇప్పటికే గల్ఫ్ బాధితుల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గల్ఫ్ కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించా మన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి రంగాల్లో తమ ప్రభుత్వం ముందుకు పోతున్నదని చెప్పారు. అయినా పది నెలల పాలనను కూడా పూర్తి చేసుకోని సర్కారుపై బీఆర్ఎస్ నేతలు ఎన్నో విమర్శలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వరద సాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటుందన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లోనే కాకుండా ఆయా జిల్లా పార్టీ కార్యాలయాల్లో మంత్రులు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున వారి సమస్యలు చెప్పుకునేం దుకు వచ్చారని తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరగా ప్రారంభించాలంటూ ప్రజల నుంచి విజ్ఞాపనలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మెన్లు శివసేనారెడ్డి, నూతి శ్రీకాంత్ గౌడ్, జేరిపటి జైపాల్ వివిధ అనుబంధ సంఘాల నేతలు ఉన్నారు.

నేడు సద్దుల బతుకమ్మ

- అన్ని ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు

ట్యాంక్‌బండ్‌పై ఘనంగా వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మకు రాష్ట్రం ముస్తాబైంది. వాడవాడలా నేడు బతుకమ్మ ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత వైభవోపేతంగా జరుగనున్నాయి. పెత్తర అమావాస్య రోజు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబురాలు నేడు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా పువ్వులను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రాంతానికే సొంతం. జీవితమంతా సంతోషంగా సాగిపోవాలనేది పండుగ ఆంతర్యం. గునుగు, తంగేడు, పట్టుకుచ్చు, బంతి, చామంతి వంటి రకరకాల పూలతో బతుకమ్మను పేర్చుతారు. సాయంత్రం సమీపంలో ఉన్న దేవాలయాలు, చెరువుల వద్ద మహిళలంతా గుమిగూడి పాటలు పాడుతూ బతుకమ్మ వేడుకలు జరుపుకుంటారు.



ట్యాంక్‌బండ్‌పై ఘనంగా ఉత్సవాలు

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై 10 వేల మంది మహిళలతో సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం 4గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారు. వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వచ్చి వేడుకల్లో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆడపడుచులకు సీఎం బతుకమ్మ శుభాకాంక్షలు

పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరికీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాముహిక జీవన విధానానికీ, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ట్యాంక్‌బండ్‌తో పాటు రాష్ట్రంలోని చెరువులన్నింటి వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



కుల మతాలకు అతీతమైందే బతుకమ్మ పండుగ

మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల, మతాలకు అతీతమైందే బతుకమ్మ పండుగని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కులో బతుకమ్మ సంబురాలు జరిపారు. మహిళలకు ఇష్టమైన పండుగని, ప్రకృతిలో లభించే పూలతో పేద్ద, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఆడుకునేదే ఈ పండుగన్నారు. ఇది మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేదని చెప్పారు. బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆర్ అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు ఎం వినోద, పి శశికళ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

- 27 వరకు రాతపరీక్షల నిర్వహణ
- 14 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం
- మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదు : టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. 27 వరకు హెచ్ఎండీఏ పరిధిలో రాతపరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 14 నుంచి గ్రూప్-1 అభ్యర్థులు హాల్‌టికెట్లు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేం దుకు అవకాశముందని తెలిపారు. ఈనెల 21 వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థుల కు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. సకాలంలో చేరుకోవాలని సూచించారు. డూప్లికేట్ హాల్‌టికెట్‌ను ఇవ్వబోమనీ, సరైన దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. అన్ని పరీక్షలకూ దాన్నే అనుమతిస్తామని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో గోడ గడియారాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఏమైనా సాంకేతిక సమస్యలు, ఇతర ఇబ్బందులుంటే టీజీపీఎస్సీ హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. 040- 23542185 లేదా 040-23542187 నెంబర్లతోపాటు helpdesk@tspsc.gov.in ఈ మెయిల్‌ను సంప్రదించాలని కోరారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌తో పాటు ఇతర వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు.



శాసనమండలిలో చీఫ్ విప్‌గా పట్నం బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర శాసనమండలిలో చీఫ్ విప్‌గా డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండలి చైర్మెన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, ప్రకాష్‌గౌడ్, ఈర్లపల్లి శంకర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, బల్మూరి వెంకట్, ఎగ్గే మల్లేష్, భాను ప్రకాష్, ఎంఎస్ ప్రభాకర్, మాజీ ఎంపీలు మధుయాష్కి గౌడ్, గడ్డం రంజిత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శులు డాక్టర్ నరసింహాచార్యులు తదితరులు హాజరయ్యారు.

రాజ్‌భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

పాల్గొన్న గవర్నర్ దంపతులు, మంత్రులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నెలవైన బతుకమ్మ వేడుకలను హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆయన జీవిత భాగస్వామి సుధావర్మతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలలో కలిసి గవర్నర్ సతిమణి సాంప్రదాయ పద్ధతిలో ఆడి పాడారు. అనంతరం రాజ్‌భవన్‌లోని చెరువులో బతుకమ్మను తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ పండుగను పురస్కరించుకుని గవర్నర్ దంపతులు రాష్ట్ర ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయత్‌రాజ్ శాఖ మంత్రి అనసూయ సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్‌గా కోదండరెడ్డి బాధ్యతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో ఆయన లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధి కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వ్యవసాయ నిపుణులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, ఎన్జీవోల సలహాలు స్వీకరిస్తానని తెలిపారు.

కట్టుకున్న వాడే కడతేర్చాడు

అంగన్‌వాడీ టీచర్ హత్య కేసులో భర్త అరెస్ట్



సాగర్ కాలువలోకి నెట్టి ప్రమాదంగా చిత్రీకరణ: వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నవతెలంగాణ-మిర్యాలగూడ

అనుమానం ప్రాణం తీసేంతలా మారింది. భార్యను కాలువలోకి తోసేసి హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించిన భర్తను అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వేములపల్లి మండలంలోని ఆమనగల్ గ్రామ పంచాయతీ రావువారిగూడెం గ్రామానికి చెందిన పేరబోయిన సైదులు 15 ఏండ్ల కిందట మిర్యాలగూడకు చెందిన కుమ్మరి అనూష(35)ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి కూతురు, కుమారుడు సంతానం. అనూష గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తూనే కామేపల్లిగూడెం అంగన్వాడీ ఇన్‌చార్జి టీచర్‌గా విధులు నిర్వహించేవారు. భార్యపై సైదులు అనుమానం వ్యక్తం చేస్తుండటంతో కొన్నేండ్లుగా ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ప్లాన్ ప్రకారం ఈ నెల 5వ తేదీన కామేపల్లిగూడెంలో అంగన్వాడీలో విధులు నిర్వర్తిస్తున్న భార్య వద్దకు వెళ్లిన సైదులు ఇంటికి వెళ్దామని బైక్‌పై ఎక్కించుకున్నాడు. మార్గ మధ్యంలో రావులపెంట సమీపంలోకి రాగానే సాగర్ ఎడమ కాలువగట్టుపై భార్యతో గొడవ పడ్డాడు. ఆమెపై చేయి చేసుకొని కాలువలోకి నెట్టేశాడు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో అనూష కాలువలో గల్లంతైంది. ఆ తర్వాత సైదులు తన బైక్‌ని కాలువలో పడేశాడు. తాను కూడా కాలువలో దూకాడు. ప్రమాదవ శాత్తు బైక్‌తో పాటు ఇద్దరం కాలువలో పడినట్టు నమ్మించే ప్రయత్నం చేశాడు. అనూష మృత దేహం కోసం గాలించగా బుధవారం పానుగోడు సమీపంలోని చెరువులో లభ్యమైంది. అనూష తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. పోలీసులు సైదులును అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో భార్యను తానే హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వీరబాబు పర్యవేక్షణలో ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేశారని డీఎస్పీ తెలిపారు.

మహమ్మద్ సాజిద్‌కు రూ. మూడు లక్షల ఎల్‌ఓసీ

మంత్రి సీతక్క అందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ములుగు జిల్లా జాకారం గ్రామానికి చెందిన మహమ్మద్ సాజిద్ ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సాజిద్‌కు మంత్రి సీతక్క ప్రభుత్వం తరపున రూ. మూడు లక్షల ఎల్‌ఓసీని బుధవారం బాధితుని తండ్రి ఎమ్.డి. అంకుష్‌కు హైదరాబాదులోని సచివాలయంలో అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి

- సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డా. పీసీ వావా
- జీహెచ్ఎంసీ కార్యాలయంలో సమీక్ష


నవతెలంగాణ-సిటీబ్యూరో

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ.వావా అన్నారు. బుధవారం హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, ఆయా విభాగాల అధికారులు, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై పారిశుధ్య కార్మికుల సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల గురించి వావా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డా.పీపీ.వావా మాట్లాడుతూ.. అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. క్రమం తప్పకుండా వారికి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కనీస వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సఫాయి కర్మచారీల సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టం గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వారి పునరావాసానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.



ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులన్నింటిపై చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు ప్రతి బుధవారం సాయంత్రం 4 గంటలకు సమస్యలపై లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. మాన్యువల్ స్కావెంజర్స్ ఎక్కడా లేరని, మాన్యువల్ స్కావెంజర్స్ నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతోందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. మహిళా కార్మికుల సంక్షేమానికి పలు చర్యలు తీసుకుంటున్నామని, జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగంలో అధికంగా మహిళలు పని చేస్తున్నందున వారి భద్రత కోసం కమిటీ(ఐసీసీ)లను ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ చెప్పారు. శానిటేషన్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌తోపాటు హెల్త్ క్యాంప్స్‌ను సభ్యులు సూచించిన విధంగా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తున్నామని వివరించారు. హాజరును పారదర్శకంగా నిర్వహిస్తూ వేతనాలను ప్రతినెలా 1న బ్యాంకు ఖాతాలో వేస్తున్నట్టు తెలిపారు. పాలసీ ఇష్యూ కావడంతో ప్రభుత్వానికి నివేదిక పంపుతామని కమిషన్ సభ్యులు వావాకు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమిషన్ సలహాదారులు వీరేంద్రనాథ్, అడిషనల్ కమిషనర్‌లు రఘు ప్రసాద్, పంకజ, నళిని, పద్మావతి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్ రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.



మనం చిన్నప్పటి నుంచి వినే మాట గుడ్డు ఆరోగ్యానికి చాలా మంచిది. ముఖ్యంగా రోజూ ఓ గుడ్డు తింటే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. గుడ్డును ఏ రూపంలో తీసుకున్నా మంచిదే. అయితే ఉడికించిన గుడ్డు తినడం వల్ల మేలైన ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. ఉడికించిన గుడ్లు రుచికరంగా ఉండడంతో పాటు సూపర్ ఫుడ్స్‌లో ఒకటిగా పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉడికించిన గుడ్లు ప్రొటీన్ యొక్క అద్భుతమైన మూలం. కండరాల కణజాలాన్ని నిర్మించడంతో పాటు మరమ్మతు చేయడానికి సాయం చేస్తుంది. కండరాలకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు కూడా వీటిలో అధికంగా ఉంటాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్న గుడ్డుతో మనం చేసుకునే కొన్ని వెరైటీ రెసిపీలను చూద్దాం....

గుడ్డు వెరీ గుడ్డు..

రెస్టారెంట్ స్టైల్‌లో ఎగ్ 65..

కావలసిన పదార్థాలు : ఉడకబెట్టిన గుడ్లు- 5, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక టీ స్పూన్, మిరియాల పొడి - అర టీ స్పున్, కారం - ఒక టీ స్పూన్, పచ్చి మిర్చి - 2, కరివేపాకు - మూడు రెమ్మలు, జీడిపప్పు - 4, వెల్లుల్లి తరుగు - ఒక టీ స్పూన్, కార్న్ ఫ్లోర్ - 2 టేబుల్ స్పూన్లు, మైదాపిండి - 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తరుగు - కొంచెం, ధనియాల పొడి - ఒక టీ స్పూన్, నిమ్మరసం - కొంచెం, గరం మసాలా - ఒక టీ స్పూన్, ఉప్పు - రుచికి సరిపడా, రెడ్ చిల్లీ సాస్ - ఒక టేబుల్ స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: ముందుగా కోడి గుడ్లను ఉడకబెట్టి పెంకు తీసుకోవాలి. తర్వాత వాటిని కట్ చేసి.. పచ్చ సొన తీసి.. తెల్లని ముక్కలను ఒక గిన్నెలో వేసుకోవాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, ధనియాల పొడి, మైదా పిండి, కార్న్ ఫ్లోర్, ఉప్పు, కారం, గరం మసాలా, నిమ్మరసం, ఫుడ్



కలర్ వేసుకుని తెల్ల గుడ్డు ముక్కలకు పట్టేలా కలుపుకోవాలి. తర్వాత ఒక పచ్చి గుడ్డు నుంచి తీసుకున్న ఎగ్ వైట్ ను వేసుకుని మిక్స్ చేయాలి. తర్వాత స్టవ్ వెలిగించి బాండీ పెట్టుకోవాలి. అందులో వేయించడానికి సరిపడా నూనె పోసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత ముందుగా రెడీ చేసి పెట్టుకున్న గుడ్డు ముక్కల మిశ్రమాన్ని నూనెలో వేసుకుని వేయించాలి. మీడియం మంట మీద గోల్డెన్ కలర్ లో వచ్చిన తర్వాత వాటిని ప్లేట్ లోకి తీసుకోవాలి. తర్వాత ఇంకో బాండీ పెట్టుకొని ఒక టేబుల్ స్పూన్ నూనె వేసుకోవాలి. కాగిన తర్వాత అందులో వెల్లుల్లి తరుగు, కట్ చేసిన పచ్చి మిర్చి , కట్ చేసిన కరివేపాకు వేయించుకోవాలి. తర్వాత రెడ్ సాస్, కట్ చేసి పెట్టుకున్న కొత్తిమీర తరుగు వేసి కలిపి స్టవ్ ఆఫ్ చేసి.. ఇందులో ముందుగా వేయించుకున్న ఎగ్ ముక్కలను వేసి జాగ్రత్తగా మిక్స్ చేయాలి. అంతే ఎగ్ 65 రెడీ.. ప్లేట్ లో తీసుకుని నిమ్మకాయ ముక్క, ఉల్లిపాయ తరుగు, వేయించుకున్న జీడిపప్పులతో కలిపి తింటే అద్భుతంగా ఉంటుంది.

కోడిగుడ్డు కారం,,,

కావలసిన పదార్థాలు : ఉల్లిపాయలు - నాలుగు, గుడ్లు - ఆరు, కరివేపాకులు - ఒక రెమ్మ, నూనె - తగినంత, కారం - అర స్పూను, పసుపు - పావు స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, ఎండుమిర్చి - 15, నువ్వులు - ఒక స్పూను, ధనియాలు - ఒక స్పూను, జీలకర్ర - ఒక స్పూను, ఎండు కొబ్బరి పొడి - మూడు స్పూన్లు, ధనియాలు - ఒక స్పూను, వెల్లుల్లి రెబ్బలు - 10, పుట్నాల పప్పు - మూడు స్పూన్లు.

తయారీ విధానం : కోడిగుడ్డు కారాన్ని తయారు చేసుకోవడానికి ముందుగా కారంపొడిని తయారు చేసుకోవాలి. మిక్సీలో ఎండుమిర్చి, నువ్వులు, జీలకర్ర, ధనియాలు, వెల్లుల్లిపాయలు, ఎండు కొబ్బరి, పుట్నాల పప్పు, ఉప్పు వేసి మిక్సీ పట్టుకోవాలి. మరీ పొడిలా కాకుండా కాస్త బరకగా చేసుకుంటే బాగుంటుంది. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కిన తర్వాత పసుపు, కారం, ఉప్పు వేసి కలపాలి. వాటిలో కోడిగుడ్లను వేసి, బంగారు రంగులోకి మారేవరకు వేయించాలి. తర్వాత వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే నూనెలో ఉల్లిపాయలను సన్నగా తరిగి వేసి బ్రౌన్ కలర్ వచ్చేవరకు



వేయించుకోవాలి. వాటిలోనే కరివేపాకులు, వేయించిన కోడిగుడ్లు కూడా వేసి కలపాలి. రుచికి సరిపడా ఉప్పును కూడా వేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మంటను తగ్గించి ముందుగా చేసి పెట్టుకున్న కారం పొడిని వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు అలా వేయించాలి. అంతే కోడిగుడ్డు కారం రెడీ అయినట్టే. వేడి వేడి అన్నంలో ఈ కోడిగుడ్డు కారాన్ని వేసుకుని తింటే రుచి అదిరిపోతుంది.

ఎగ్ బుర్జీ

కావలసిన పదార్థాలు : ఉడికించిన కోడి గుడ్లు - నాలుగు, ఉల్లిపాయలు - ఒకటి, పచ్చిమిర్చి - రెండు, అల్లం - చిన్న ముక్క, టొమాటొ - ఒకటి, ధనియాల పొడి - ఒక స్పూను, పసుపు - పావు స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - రెండు స్పూన్లు, వెల్లుల్లి - అయిదు రెబ్బలు, కారం ఒక స్పూను, గరం మసాలా - అర స్పూను, కొత్తిమీర తరుగు - ఒక స్పూను.

తయారీ విధానం : కోడిగుడ్లను ఉడకబెట్టి సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. అందులో కాస్త వెన్న కూడా వేసుకుంటే కూర రుచి అదిరిపోతుంది. ఆ నూనెలో సన్నగా తరిగిన



ఉల్లిపాయలు, పచ్చిమిర్చి తరుగు వేసి కలుపుకోవాలి. అల్లం వెల్లుల్లి పేస్టును కూడా బాగా కలుపుకోవాలి. ఆ మిశ్రమంలో టమాటోలు సన్నగా తరిగి వేయాలి, అందులో ఉప్పు, పసుపు కూడా వేసి బాగా కలుపుకోవాలి. ధనియాల పొడి, కారం, గరం మసాలా వేసి కాసేపు చిన్న మంట మీద ఉడికించుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమంలో ముందుగా తరిగి పెట్టుకున్న కోడిగుడ్లను వేసి బాగా కలుపుకోవాలి. చిన్న మంట మీద పది నిమిషాలు వేయించాలి. తరువాత కొత్తిమీర చల్లుకోవాలి. దీన్ని చపాతీ, రోటీలతోనే కాదు ఒక కప్పులో వేసి స్నాక్స్‌లా కూడా తినవచ్చు.

చెట్టినాడ్ ఎగ్ కర్రీ..

కావలసిన పదార్థాలు : ఉడికించిన గుడ్లు - నాలుగు, ఉల్లిపాయ పెద్దది - ఒకటి, అర కప్పు టమాటో ప్యూరీ, కరివేపాకు - ఒక రెమ్మ, అల్లం వెల్లుల్లి పేస్ట్ - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - 2 నుంచి 3 టేబుల్ స్పూన్లు, ఆవాలు - ఒక స్పూను, కొత్తిమీర - గార్నిష్ కోసం. ఎండుమిరపకాలు - నాలుగు, గసగసాలు - రెండు స్పూన్లు, జీడిపప్పులు - ఎనిమిది, కొబ్బరి తురుము - అరకప్పు, దనియాలు - రెండు స్పూన్లు, జీలకర్ర - అరస్పూను, మిరియాలు - పావు స్పూను, యాలుకలు - రెండు, లవంగాలు - 3, దాల్చిన చెక్క కొద్దిగా.

తయారీ విధానం : ముందుగా పాన్ వేడి చేసి, చిన్న మంటపై ఎండు మిరపకాయలు, ధనియాలు, జీలకర్ర, మిరియాలు, లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు వేసి కొద్దిగా వేయించుకోవాలి. ఆ తర్వాత కొబ్బరి వేసి మంచి వాసన వచ్చేవరకు వేయించాలి. ఆపై గసగసాలు లేదా కాజులు వేసి దోరగా వేపుకోవాలి. అనంతరం రోస్ట్ చేసుకున్న ఈ మసాలా దినుసులన్నింటినీ మెత్తగా, చిక్కగా పేస్ట్‌లా చేసుకోవాలి. చెట్టినాడ్ మసాలా సిద్ధం అయినట్లే. ఒక బాండీలో ఒక స్పూన్ నూనె వేడి చేసి అందులో ఈ గుడ్లను బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వీటికి కొంచెం కారం, ఉప్పు కలుపుకోవాలి. ఆపై పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే బాండీలో మరింత నూనె వేసి వేడయ్యాక ఆవాలు, కరివేపాకు వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు లేదా పేస్ట్ వేసి రంగు మారే వరకు వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి టొమాటో ప్యూరీ వేసి మిశ్రమం చిక్కబడే వరకు ఉడికించాలి. గ్రేవీ కోసం కొన్ని నీళ్ల కలిపి ఉడికించుకోవాలి. . ఇప్పుడు చెట్టినాడ్ మసాలా పేస్ట్, అవసరం మేరకు మరికొన్ని నీళ్ల పోసి గ్రేవీ చిక్కబడే వరకు మీడియం వేడి మీద ఉడికించాలి. ఉప్పువేసుకొని గుడ్లు, కొత్తిమీర వేసి కలపండి. కాసేపు గుడ్లను గ్రేవీలో ఉడికించి, స్టవ్ ఆఫ్ చేయండి. అంతే, చెట్టినాడ్ గుడ్డు కూర రెడీ. చపాతీ లేదా అన్నంతో సర్వ్ చేయండి.



గోంగూరంతో

కావలసిన పదార్థాలు : గోంగూర - మూడు కట్టలు, గుడ్లు - నాలుగు, ఉల్లిపాయలు - రెండు, పచ్చిమిర్చి - ఆరు, ఉప్పు - రుచికి సరిపడా, కారం - రెండు స్పూన్లు, పసుపు - అర స్పూన్, ధనియాల పొడి - ఒక స్పూను, లవంగాలు - నాలుగు, దాల్చిన చెక్క - చిన్న ముక్క, ఎండుమిర్చి - మూడు, నీళ్లు - సరిపడినన్ని, యాలకులు - రెండు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం : స్టవ్ మీద కళాయి పెట్టి గోంగూరను వేసి వేయించాలి. అందులోనే పచ్చిమిర్చిని కూడా వేయాలి. గోంగూర ముద్దలా అయ్యే వరకు ఉడికించాలి. తర్వాత తీసి పక్కన పెట్టుకోవాలి. మరోపక్క గుడ్లను కూడా ఉడికించి పొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి.



ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, ఎండుమిర్చి వేసి ఒక నిమిషం పాటు వేయించాలి. సన్నగా తరిగిన ఉల్లిపాయలను వేసి వేయించాలి. ఉప్పు వేసి వేయిస్తే ఉల్లిపాయలు త్వరగా వేగుతాయి. అందులోనే అల్లం వెల్లుల్లి పేస్టును వేసి పచ్చివాసన పోయే వరకు వేగనివ్వాలి. అందులో ధనియాల పొడి, పసుపు, కారం వేసి బాగా కలపాలి. ముందుగా ఉడికించి పొట్టు తీసి పెట్టుకున్న కోడిగుడ్లను వేసి కలపాలి. మూత పెట్టి చిన్న మంట మీద మూడు నిమిషాల పాటు ఉంచాలి. తర్వాత ఉడికించుకున్న గోంగూరను అందులో వేసి బాగా కలపాలి. కొద్దిగా నీళ్లు పోసి కూర దగ్గరగా అయ్యేవరకు ఉడికించాలి. నూనె పైకి తేలితే కూర రెడీ అయినట్టే. వేడి వేడి గోంగూర కోడి గుడ్డు కూరను అన్నంలో వేసుకొని తిని చూడండి. చాలా టేస్టీగా ఉంటుంది. ■

వెక్కిళ్ళు వేధిస్తున్నాయా...

వెక్కిళ్ళు మన శరీరంలో జరిగే ప్రక్రియ. శాస్త్రవేత్తల ప్రకారం, ఎక్కిళ్ళు నేరుగా శ్వాసకు సంబంధించినవి. మన జీర్ణక్రియ లేదా శ్వాసకోశ వ్యవస్థలో భంగం, అధిక కదలిక ఉంటే, వెక్కిళ్ళు మొదలవుతాయి. కడుపు, ఊపిరితిత్తుల మధ్య ఉన్న డయాఫ్రాగమ్, పక్కటెముకల కండరాల సంకోచం కారణంగా వెక్కిళ్ళు సంభవిస్తాయి.

ఈ వెక్కిళ్ల చిన్న హెూం రెమిడీస్ తోనే తగ్గిపోతాయి. అయితే ఎంతసేపైనా తగ్గవు, ఎన్ని నీళ్ల తాగినా ఆగవు. అలాంటప్పుడు కొన్ని హెూం రెమిడీస్‌తో ఎలా తగ్గించుకోవాలో తెలుసుకుందాం.

తేనె.. వేగస్ నాడి పారాసింపథిటిక్ నాడి వ్యవస్థను నియంత్రిస్తుంది. వీటి విధుల్లో భాగం ఈ చర్యను నియంత్రించడం. తేనె వేగస్ నాడిని ఉపశమనం చేస్తుంది.

వెనిగర్.. సాధారణంగా మనం వెనిగర్‌ను వంటతోపాటు వెయిట్ తగ్గడానికి కూడా ఉపయోగిస్తాం. అయితే, దీంతో వెక్కిళ్లు కూడా ఆపవచ్చు ఇది డయాఫ్రాగమ్ అసంకల్పిత కదలికను రీసెట్ చేసి వెక్కిళ్లను నియంత్రిస్తుంది. దీని పుల్లని రుచి మనస్సును మళ్లించి తక్షణ ఉపశమనాన్ని అందిస్తుంది.

చక్కెర.. ఇది వేగస్ నాడిని మరింత ప్రేరేపిస్తుంది. నరాలను రీసెట్ చేసి, వెక్కిళ్ల నుంచి తక్షణమే ఉపశమనాన్ని అందిస్తుంది. స్వీట్లను టేస్టీగా మార్చే చక్కెరతో ఇకపై ఆగకుండా వస్తున్న వెక్కిళ్లను కూడా తగ్గించడానికి ఉపయోగించండి.

పదో 'సారీ' తగ్గేదేలే..

(మొదటిపేజీ తరువాయి)

చివరిసారి రెపో రేటును మార్చింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరింగ్ పాలసీ కమిటీ (ఎంపీసీ) భేటీ బుధవారంతో ముగిసింది. అనంతరం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడుతూ.. రెపో రేటును 6.5 శాతంగానే కొనసాగిస్తున్నట్టు తెలిపారు. వడ్డీ రేట్లను యధాతథంగా ఉంచేందుకు ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో ఐదుగురు అనుకూలంగా ఓటు వేశారన్నారు. కాగా.. ఆర్‌బిఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య ఆరు సార్లలో 2.50 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో వడ్డీ, వాయిదా చెల్లింపులు ఎక్కువై రుణాలు భారం అయ్యాయి. ఈ క్రమంలోనే అనేక మంది గృహ, వాహన, వ్యక్తిగత రుణ గ్రహీతలు ఇకనైనా వడ్డీ రేట్లలో తగ్గుదల ఉండొచ్చని ప్రతీ సారి ఆశించిన వారికి భంగపాటే మిగులుతోంది. అంతర్జాతీయంగా అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్ల తగ్గింపునకు చర్యలు తీసుకుంటుండగా.. దేశీయంగా మాత్రం అలాంటి ఉపశమనం లభించకపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, పొంచి ఉన్న ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచి ఉండకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2024-25లో భారత జీడీపీ 7.2 శాతం పెరిగే అవకాశం ఉందిన శక్తికాంత దాస్ అంచనా వేశారు. వచ్చే 2025-26 తొలి త్రైమాసికంలో 7.3 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చన్నారు. మెరుగైన వర్షపాతం, సరిపడ నిల్వలతో అహార ద్రవ్యోల్బణం తగ్గొచ్చన్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.8 శాతానికి పెరగొచ్చన్నారు. 2024-25లో స్థూలంగా 4.5 శాతంగా ఉండొచ్చన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్‌బీఎఫ్‌సీలు రిస్క్ మేనేజ్‌మెంట్ లేకుండా వృద్ధిని కొనసాగిస్తున్నాయన్నారు. ఆర్థిక రంగం స్థిరతంగా ఉందన్నారు.

యూపీఐ లైట్ పరిమితి పెంపు

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి ఆర్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎలాంటి పిన్ లేకుండానే చెల్లింపులు చేయడానికి ఉపయోగించే యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2వేల నుంచి రూ.5వేలకు పెంచింది. ఇది డిజిటల్ చెల్లింపులను మరింత సులభతరం చేయడానికి దోహదపడుతుందని శక్తికాంత పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి లావాదేవీకి యూపీఐ లైట్ పరిమితిని ప్రస్తుతమున్న రూ.500 నుంచి రూ.1000కి పెంచుతున్నామన్నారు. యూపీఐ సేవల ద్వారా భారత ఆర్థిక రంగం పూర్తిగా మారిపోయిందన్నారు. ఈ సేవలను మరింత విస్తృత పర్చడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

నెఫ్ట్‌లోనూ ఇక గ్రహీత పేరు

నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్ (ఆర్‌టీజీఎస్) చెల్లింపుల్లోనూ ఇకపై గ్రహీత పేరు కనిపించేలా నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తున్నామని దాస్ తెలిపారు. చెల్లింపులు చేసేటప్పుడు అకౌంట్ నంబర్, బ్రాంచ్ ఐఎఫ్ఎస్ కోడ్ ఎంటర్ చేసేటప్పుడు అవతలి వ్యక్తి పేరు కనిపిస్తుందని.. దీంతో చెల్లింపుల్లో పొరపాట్లకు ఆస్కారం తగ్గుతుందని దాస్ తెలిపారు. యూపీఐ తరహాలోనే గ్రహీత పేరును గుర్తించడానికి వీలుంటుందన్నారు.

హర్యానా ఫలితాలను విశ్లేషిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

శ్రమించిన కార్యకర్తలు, నేతలు.. ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థిక న్యాయం కోసం కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుంది' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు.హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు గానూ 48 చోట్ల కమలం పార్టీ విజయం సాధించింది. కాంగ్రెస్ కేవలం 37 సీట్లకే పరిమితమైంది. ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈసీ పనితీరుతోపాటు ఈవీఎంలపైనా ఆరోపణలు చేస్తున్నారు.జమ్మూ ఎన్నికల ఫలితాలపై కూడా రాహుల్ స్పందించారు. ఆ ప్రాంత ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపు రాజ్యాంగం సాధించిన విజయంగా అభివర్ణించారు.

జనవరి నుంచి సన్న బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

సన్న బియ్యం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించిందని చెప్పారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ.2320 మద్దతు ధర, సాధారణ రకానికి రూ.2320 ప్రకటించినట్టు తెలిపారు. రాష్ట్రంలో 53శాతం సన్నాలు పండుతున్నాయని, మిల్లర్లు సన్న బియ్యంతో పాటు దొడ్డు రకం ధాన్యాన్ని కూడా ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు.

వారంలో రెండు లక్షలపై రుణాలమాఫీ

తమ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని, ఒకేసారి రాష్ట్రంలోని 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని మంత్రి చెప్పారు. రెండు లక్షల కన్నా ఎక్కువ ఉన్న వారి రుణాలను వారం పది రోజుల్లో మాఫీ చేయనున్నట్టు



వెల్లడించారు. పేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఎస్ఎల్‌బిసి ఇంజిన్ మరమ్మతుకు గురైతే.. అమెరికా నుంచి దానికి సంబంధించిన పరికరాలు తెప్పించామని, డిసెంబర్‌లో పనులు మొదలు పెట్టి రెండేండ్లలో సొరంగాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని సామాజిక తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను కట్టిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో 20 నియోజక వర్గాల్లో ఈనెల 11న శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా జిల్లాలోని అన్ని చెరువులను నింపడంలో భాగంగా 12 మిషన్లను ఏర్పాటు చేసి తన సొంత నిధులు రూ.80 లక్షలతో డిస్ట్రిబ్యూటరీలలో పూడికతీత, చెట్ల తొలగింపు చేపట్టినట్టు తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల ద్వారా డిసెంబర్‌లో చెరువులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు రూ.25 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమానికి సింగిల్ విండో అధ్యక్షులు నాగరత్నం రాజు అధ్యక్షత వహించగా.. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ హరీష్, వ్యవసాయ శాఖ జెడి శ్రవణ్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూములు, ఉద్యోగాలు మాకే దక్కేలా చూడాలి

సీఎం రేవంత్‌కు ఆదివాసీ సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తి

దీపావళిలోపు సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం : సీఎం హామీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏజెన్సీ ప్రాంతాల్లోని తమ భూములు, ఉద్యోగాలు తమకే దక్కేలా చూడాలని పలు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం అధికారిక నివాసంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసీ సంఘాల నేతలు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. తమ ప్రాంత సమస్యలను వారు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. జైనూరు ఘటన దరిమిలా ఆదివాసీలు, మైనారిటీ వర్గాల మధ్య సఖ్యత కుదుర్చేందుకు ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇరు వర్గాలతో ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చొరవ తీసుకొని ఆదివాసీ సంఘాలతో సీఎం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతి పత్రాలు అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు కాపాడేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమ భూములు, ఉద్యోగాలు తమకే దక్కేలా చూడాలని కోరారు. అనంతరం సీఎం స్పందిస్తూ..దీపావళి పండుగలోపు సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావే శాన్ని నిర్వహిస్తామనీ, దానికి ఆదివాసీ సంఘాలను, ముఖ్యలను ఆహ్వానిస్తామనీ, ఆ సమావేశంలోనే డిమాండ్ల సాధ్యసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ కలెక్టర్‌గా పనిచేసి, అక్కడి సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న దివ్య దేవరాజన్‌ను అక్కడికి పంపించి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఆదివాసీ సంఘాల ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎంకు, సమస్యను పరిష్కరించే దిశలో చొరవ చూపి సమావేశం ఏర్పాటు చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణకు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హెూం : రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ఈ ఏడాది ముగ్గురిని వరించింది. ప్రోటీన్‌పై అధ్యయనం నిర్వహించిన డేవిడ్ బాకర్, డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం. జంపర్‌లకు అవార్డును ప్రకటించినట్టు బుధవారం నోబెల్ బృందం తెలిపింది. "పూర్తిగా కొత్త రకాల ప్రోటీన్లను నిర్మించడంలో దాదాపు అసాధ్యమైన చర్య" ను పూర్తి చేసిన డేవిడ్ బాకర్‌కి, ప్రోటీన్ల సంక్లిష్ట నిర్మాణాలను అంచనా వేయడానికి ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేసిన డెమిస్ హస్సాబిస్ , జాన్ ఎం. జంపర్‌లు అవార్డును పంచుకోనున్నట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. యాభై ఏండ్లుగా క్లిష్టంగా ఉన్న ఈ సమస్యను వీరు పరిష్కరించారని ప్రశంసించింది. గతేడాది కూడా రసాయన శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం ప్రకటించిన సంగతి తెలిసిందే. క్వాంటం డాట్‌ల ఆవిష్కరణ , విశ్లేషణకు సంబంధించి మౌంగి జి. బవాండి, లూయిస్ ఇ. బ్రస్, అలెక్సీ ఎల్. ఎకిమోవ్‌లకు అవార్డులను అందజేశారు.

కాంగ్రెస్‌నేతల్ని నిలదీద్దాం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అల్లావుద్దీన్ పటేల్, తన అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికలప్పుడు తప్పుడు హామీలిచ్చి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులను కాకుండా కలెక్టర్లను అడగాలని చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ తెలంగాణలో బుల్డోజర్ సంస్కృతిని తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది నెలల పాలనతో అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ. 2,500, వద్దులకు రూ.4 వేలు పింఛన్, ఇంట్లో ఇద్దరికి పింఛన్ అంటూ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వీటికి డబ్బుల్లేవంటూనే మూసీ కోసం రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తారంటా అంటూ విమర్శించారు. కేవలం కమిషన్ల కోసమే మూసీకి ఖర్చు చేసేందుకు సిద్ధపడ్డారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ తమను బెదిరించేందుకు ప్రయత్నించారనీ, కవితను జైల్లో పెట్టారనీ, అయినా సెక్యులరిజాన్ని కొనసాగిస్తూనే ఉన్నామనీ, భవిష్యత్తులోనూ ఇదే తరహా రాజకీయం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్‌లో రైతులను అక్రమంగా అరెస్టు చేసి లాఠీచార్జీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ ప్రజలను ఒప్పించలేని సీఎం రాష్ట్రాన్ని ఎలా ఒప్పిస్తారని ప్రశ్నించారు. ఏ పరిశ్రమ అయినా ప్రజలను ఒప్పించి, మెప్పించి పెట్టాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేత నరేందర్ రెడ్డి, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యం సేకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ నియామకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధాన్యం సేకరణకు సంబంధించిన పలు అంశాలపై అధ్యయనం చేసి సిఫారసులు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. గోదాముల లీజు, రైస్ మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు, మిల్లింగ్ చార్జీలు, తదితర అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నది.

కాంగ్రెస్‌వి విషబీజాలు

(మొదటిపేజీ తరువాయి)

కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.హర్యానా ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీలు), దళితులు బీజేపీకి అండగా నిలిచారని పేర్కొన్నారు. "కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హర్యానా రైతులకు తెలుసు కాబట్టే వారు బీజేపీని గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారు" అని అన్నారు.

ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత మండిపాటు

ప్రధాని వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఖండించారు. మోడీ రాజకీయ ప్రసంగాల కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ఎందుకు ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రసంగాల కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయొద్దని, సొంత సొమ్ముతో బీజేపీ వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.


హలో..హలో..ఆగండీ..

(మొదటిపేజీ తరువాయి)

డస్ట్‌బిన్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిచోట్ల చెత్తను తొలగించినప్పటికీ తర్వాత చెత్త వేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డస్ట్‌బిన్ ఫ్రీ సిటీ కావాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. నగరంలో ఇంటింటికీ చెత్త సేకరణ కోసం స్వచ్ఛ ఆటోలను ప్రవేశపెట్టినప్పటికీ వాటిపై మానిటరింగ్ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వినూత్న టెక్నాలజీని జీహెచ్‌ఎంసీ అమలు చేస్తోంది. ప్రజలు జీవీపీ వద్ద పదేపదే చెత్త వేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, దీన్ని నివారించేందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ చెత్త వేయడం మొదలైనప్పుడు సైరన్ లాంటి సౌండ్ వస్తుంది. ఈ విధానం వల్ల చెత్త వేయడాన్ని గుర్తించి అధికారులు జరిమానా విధించనున్నారు. ఈ విషయాలను బుధవారం ఎక్స్ వేదికగా జీహెచ్‌ఎంసీ పంచుకుంది.

ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఉప్పల్ సర్కిల్లోని 20 ప్రాంతాల్లో చెత్త వేస్తే సైరెన్ వచ్చేలా ఒక కంపెనీ తీసుకొచ్చిన ప్రాజెక్టును జీహెచ్‌ఎంసీ ప్రవేశపెట్టింది. చెత్త వేసే ప్రాంతంలో సీసీ కెమెరా, మైక్ సెట్ అమర్చారు. ఎవరైనా అక్కడ చెత్త వేయడానికి వస్తే.. మీరు మాకు కనబడుతున్నారు.. ఇక్కడ చెత్త వేస్తే రూ.1000 జరిమానా విధిస్తామంటూ మైక్‌లో అనౌన్స్ వస్తుంది. నగరంలోని జీవీపీ పాయింట్లలో చెత్త వేయకుండా శానిటేషన్‌కు సంబంధించిన వర్కర్లను అక్కడే ఉంచినప్పటికీ చాలాచోట్ల చెత్త సమస్యలు తలెత్తుతున్నాయి. అలాంటిది కెమెరా, మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ ఇస్తే చెత్త సమస్యలు తీరుతాయా అని కొందరు నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా మైక్‌లో హలో హలో అనడంతో దారినపోయే వాహనదారులు పరేషాన్ అవుతున్నారు. ఏదేమైనా ఈ టెక్నాలజీ ఎంత వరకు సమస్యను పరిష్కరిస్తోందో చూడాల్సిందే.

నవచిత్రం



దసరా పండక్కి సరైన సినిమా

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. దోనేపూడి చక్రపాణి సమర్పించారు. దసరా కానుకగా ఈనెల 11న సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

● శ్రీనువైట్లతో సినిమా చేయాలని చాలా కాలం కిందట అనుకున్నాం. గతంలో ఓ రెండు లైన్స్ చెప్పారు. అవి బావున్నాయి కానీ నాకు సరిపోవనిపిస్తుందని చెప్పాను. తర్వాత 'విశ్వం' కథ లైన్‌గా చెప్పారు. పాయింట్, గ్రాఫ్‌గా చాలా బావుంది. ఇందులో అన్నీ చక్కగా కుదురు తాయనిపించింది. ఇందులో కంప్లీట్‌గా శ్రీనువైట్ల మార్క్‌తో పాటు యాక్షన్ ఫన్, కామెడీ అన్నీ పెర్ఫెక్ట్‌గా ఉన్నాయి.

● లౌక్యం తర్వాత అంత మంచి ఎంటర్టైన్మెంట్ ఇందులో కుదిరింది. షూటింగ్ చేసేటప్పుడు నేనే కొన్ని సీన్స్‌కి నవ్వు ఆపుకోలేకపోయేవాడిని. చాలామంది ఆర్టిస్టులకి సారీ కూడా చెప్పాను. సీన్స్ అంత హిలేరియస్‌గా వచ్చాయి. అలాగే శ్రీను వైట్ల 'వెంకీ' సినిమాలో పాపులర్ ట్రైన్ ఎపిసోడ్ ఉంది. కాబట్టి డెఫినెట్‌గా ఆయన నుంచి మరో ట్రైన్ ఎపిసోడ్ వస్తుందంటే కంపారిజన్ ఉంటుంది. అయితే అది వేరే జోనర్, ఇది వేరే జోనర్. అయితే ఈ కంపేరిజన్‌కి విశ్వం ట్రైన్ సీక్వెన్స్ రీచ్ అవుతుంది.

> ప్రభాస్, నా కాంబినేషన్‌లో సినిమా చేయాలని మాకూ ఉంది. అయితే సరైన కథ కుదరాలి. అలాంటి కథ కుదిరితే తప్పకుండా మా కాంబినేషన్‌లో సినిమా ఉంటుంది. యూవీ క్రియేషన్స్‌లోనే నా నెక్ట్స్ మూవీ ఉంటుంది.
>
> **- హీరో గోపీచంద్**

● ఈ సినిమాలో యాక్షన్ డిజైన్‌ని రవివర్మ చేశారు. ఒక స్లీక్ యాక్షన్‌గా చేద్దామని అనుకున్నారు. ఇందులో యాక్షన్ చాలా ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంటుంది. బేసిగ్గా ఇది హీరో స్టోరీ. పాపది కూడా వన్ ఆఫ్ ది మెయిన్ క్యారెక్టర్. పాపకి ఏడేళ్లు ఉంటాయి. కానీ పెర్ఫార్మెన్స్ చాలా అద్భుతంగా చేసింది. ఆ పెర్ఫామెన్స్ చూసి షాక్ అయ్యాను. ఆ పాప కూడా ఈ సినిమాకి చాలా ప్లస్. ఇందులో ఫాదర్ ఎమోషన్, మదర్ ఎమోషన్ అన్ని బాగా వర్కౌట్ అయ్యాయి. శ్రీనువైట్ల ఎమోషన్‌ని చాలా అద్భుతంగా తీశారు.

● ఇది శ్రీను వైట్ల కమ్ బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. సినిమా చాలా బాగా వచ్చింది. అందుకే అంత కాన్ఫిడెంట్‌గా చెప్పాను. కావ్య థాపర్ ఇందులో చాలా మంచి క్యారెక్టర్ చేసింది. హీరోతో ట్రావెల్ అయ్యే క్యారెక్టర్. ఇండియాలో జరుగుతున్న ఒక ఇష్యూని అండర్ కరెంట్‌గా చెబుతూ లాస్ట్‌లో ఏమిటనేది చెప్తాం. అది ఎంటర్‌టైన్మెంట్ వేలోనే ఉంటుంది. చేతన్ భారద్వాజ్ సౌండింగ్ చాలా బావుంది. పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. బీజీఎం కూడా అదరగొట్టాడు. ఈ సినిమా ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టదు. చూసినంతసేపు నవ్వుతూనే ఉంటారు. థియేటర్‌లో రెండున్నర గంటల పాటు ఆడియన్స్ హిలేరియస్‌గా ఎంటర్‌టైన్ చేసే సినిమా ఇది. పర్ఫెక్ట్ పండగ సినిమా. ఫ్యామిలీ అంతా కలసి హాయిగా నవ్వుకోవచ్చు.



రానా, సురేష్‌బాబు, దిల్‌రాజు


అన్ని భాషల్లోనూ అదే టైటిల్..

రజనీకాంత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'వేట్టయన్- ది హంటర్'. దసరా సందర్భంగా నేడు (గురువారం) రిలీజ్ అవుతుంది. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. సురేష్ ప్రొడక్షన్స్‌తో కలిసి ఏసియన్ సునీల్, దిల్ రాజు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాను సీడెడ్ ఏరియాలో శ్రీ లక్ష్మీ మూవీస్ రిలీజ్ చేస్తోంది.

నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ, 'ఈ మూవీ మెయిన్ టైటిల్ ది హంటర్. అన్ని భాషల్లోనూ వేట్టయన్ ది హంటర్ అని రిలీజ్ చేస్తున్నారు. హంటర్ అనేదే ఈ చిత్రంలోని మెయిన్ పాయింట్. ఈ చిత్రంలో రజనీకాంత్, అమితాబ్, ఫాహద్, రానా, మంజు వారియర్ ఇలా భారీ తారాగణం కనిపిస్తుంది. టి.జె.జ్ఞానవేల్ సెన్సిబుల్ డైరెక్టర్. ఈ మూవీని థియేటర్లో చూడండి. అందరికీ ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్ వస్తుంది' అని అన్నారు.

'తెలుగులో 'వేటగాడు' అనే టైటిల్‌ను పెట్టాలని అనుకున్నారు. కానీ ఆ టైటిల్ వేరే వాళ్లకి ఆల్రెడీ ఉంది. తమిళంలోనూ ఒకప్పుడు కేవలం తమిళ టైటిల్స్ మాత్రమే పెట్టాలని అనుకున్నారు. కానీ ఇప్పుడు అంతా మారిపోతోంది. సినిమా గ్లోబల్‌గా ఎదిగింది. వేరే భాషల్లో అనువాద టైటిల్స్ దొరికితే పెడుతున్నారు. లేదంటే ఒకే టైటిల్‌ను అన్ని భాషల్లోనూ రిలీజ్ చేస్తున్నారు. జై భీమ్' వంటి అద్భుతమైన సినిమాను తీసిన టి.జె.జ్ఞానవేల్ ఈ చిత్రాన్ని కూడా అద్భుతంగా తీశారు' అని దిల్ రాజు చెప్పారు.

రానా మాట్లాడుతూ, 'సినిమా అనే దానికి భాష లేదు.. హద్దుల్లేవు. కథను బట్టి ఆ చిత్రం ఎక్కడికైనా వెళ్లొచ్చు. ఇప్పటి వరకు రజనీకాంత్ చేసిన అన్ని సినిమాల్లోకెల్లా వేట్టయన్ చాలా భిన్నంగా ఉంటుంది. రియలిస్టిక్ మూవీలో ఇన్ని మంచి పాత్రలు ఉండటం చాలా అరుదు. రజనీకాంత్ ముందు నిలబడి డైలాగ్ చెప్పడం, నటించే ఛాన్స్ రావడం చాలా లక్కీ. ఈ చిత్రాన్ని అందరూ చూసి ఎంజాయ్ చేయండి' అని చెప్పారు.



కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్

కథానాయిక సంయుక్త తొలిసారిగా ఫీమేల్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి హిట్ చిత్రాలను అందించిన ప్రొడ్యూసర్ రాజేష్ దండా నిర్మించనున్న ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకత్వం వహించనున్నారు.

మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ ప్రొడక్షన్ నెం.6గా దీన్ని నిర్మించనున్నారు. సంయుక్త ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

బుధవారం రామానాయుడు స్టూడియోస్‌లో పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది.

వెంకీ కుడుముల, కోన వెంకట్ ప్రొసీడింగ్స్ ప్రారంభించడానికి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందజేశారు. రానా దగ్గుబాటి క్లాప్‌కొట్టగా, దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. దర్శకులు వశిష్ట, రామ్ అబ్బరాజు తొలి షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు.



సంయుక్త, రానా

ఈ కార్యక్రమంలో సురేష్ బాబు, జెమినీ కిరణ్, సాహు గారపాటి, చుక్కపల్లి అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో ఈ సినిమా ఒక మిరాకిల్‌గా జరిగింది. సంయుక్త ఒకే సిట్టింగ్‌లో స్క్రిప్ట్‌కి ఓకే చెప్పి, నెక్ట్స్ డేకి పూజ పెట్టుకోవడం అనేది నా కెరీర్‌లో ఇదే ఫస్ట్. అంత స్క్రిప్ట్ ఎగ్జైట్‌మెంట్ ఉన్న సినిమా ఇది. కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్‌గా సినిమాని చేయబోతున్నాం' అని తెలిపారు.

'ఈ కథ సంయుక్తకి ఎంతలా నచ్చిందని చెప్పడానికి ఉదాహరణ ఆమె ఈ సినిమాని ప్రెజెంట్స్ చేయడమే' అని దర్శకుడు యోగేష్ కెఎంసి చెప్పారు. హీరోయిన్ సంయుక్త మాట్లాడుతూ, 'ఈ కథ వినాలని కొన్ని నెలలుగా అనుకుంటున్నాను. షూటింగ్ బిజీ వలన కుదరలేదు. ఫైనల్‌గా రెండ్రోజుల క్రితం కథ విన్నాను. కథ అద్భుతంగా ఉంది. ఇలాంటి స్క్రిప్ట్ రావడం నా అదృష్టం. ఈ సినిమాని ఫిమేల్ సెంట్రిక్ మూవీ అని లేబుల్ చేయడం ఇష్టం లేదు. ఇది బలమైన మహిళా ప్రధాన పాత్రతో ఆకట్టుకునే కథ' అని అన్నారు.

ఆటలు

హర్మన్‌ప్రీత్, మంధాన విధ్వంసం

● ఇండియా మహిళలు 172/3 ● శ్రీలంకతో ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్

దుబాయ్: ఐసిసి మహిళల టి20 ప్రపంచ కప్‌లో హర్మన్‌ప్రీత్ సేన తొలిసారి జూలు విదిలించింది. భారీ రన్‌రేట్ లక్ష్యంగా శ్రీలంకతో పోరుకు సిద్ధమైన భారత బ్యాటర్లు పంజా విసిరారు. ఆసియా కప్ ఫైనల్లో షాకిచ్చిన శ్రీలంకపై నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 172పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేశారు. ఓపెనర్లు స్మృతి మంధాన(50), షఫాలీ వర్మ(43) తొలిసారి అదిరే ఆరంభమివ్వగా.. చివర్లో హర్మన్‌ప్రీత్ కౌర్(52 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. ఆఖరి ఓవర్లో వరుసగా రెండు బంతుల్ని బౌండరీకి పంపి అర్ధ శతకంతో జట్టు స్కోర్ 170 దాటించింది. ఈ టి20 ప్రపంచ కప్‌లో ఇదే అత్యధిక స్కోర్. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూడగా.. ఆ తర్వాత పాకిస్థాన్‌పై గెలిచాము చాలు అన్న ఫీలింగ్. ఈ దశలో మూడో మ్యాచ్‌లో లంకను దాటితేగానీ సెమీస్ చేరడం కష్టమనే దశలో భారత అమ్మాయిలు బ్యాట్ ఝుళిపించారు. లంక



స్పిన్నర్లు దీటుగా ఎదుర్కొంటూ లెగ్ సైడ్‌లో బౌండరీలు బాదేసింది. దాంతో.. టీమిండియా స్కోర్ వడివడిగా.. 150 దాటేసింది. ఆఖరి మూడు ఓవర్లలో మరింత రెచ్చిపోయిన కౌర్ బౌండరీలతో విరుచుకుపడింది. రీచా ఘోష్(6) అండగా ధనాధన్ ఆడింది. చివరి ఓవర్లో రెండు ఫోర్లతో అర్ధ సెంచరీ సాధించిన ఆమె లంకకు 173 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. శ్రీలంక కెప్టెన్ ఆటపట్టు, కాంచనకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (సి)గుణరత్నే (బి)ఆటపట్టు 43, మంధాన (రనౌట్) కాంచన/ఆటపట్టు 50, హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 52, రోడ్రిగ్స్ (సి)ప్రభోధన (బి)కాంచన 16, రీచా (నాటౌట్) 6, అదనం 5. (20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 172పరుగులు.

వికెట్ల పతనం: 1/98, 2/98, 3/128

బౌలింగ్: ప్రియదర్శిని 2-0-11-0, సుగంధిక 3-0-29-0, ప్రభోధని 3-0-32-0, కవిషా 2-0-11-0, రణవీరా 3-0-26-0, ఆటపట్టు 4-0-34-1, కాంచన 3-0-29-1.

బ్యాటింగ్‌లో మెరిసిన నితీశ్, రింకు

● అర్ధసెంచరీతో కదం తొక్కిన తెలుగు తేజం ● ఇండియా 221/9

న్యూఢిల్లీ: తెలుగు తేజం, రెండో అంతర్జాతీయ టి20 ఆడుతున్న నితీశ్ కుమార్ రెడ్డి బ్యాటింగ్‌లో మెరిసాడు. అరుణ్‌జైట్లీ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన రెండో టి20లో నితీశ్ కుమార్ రెడ్డికి తోడు, రింకు సింగ్ అర్ధసెంచరీలతో రాణించారు. నితీశ్ కుమార్(74; 34బంతుల్లో 4ఫోర్లు, 7సిక్సర్లు), రింకు సింగ్(53; 29బంతుల్లో 5ఫోర్లు, 3 సిక్సర్లు) ధనా ధన్ బ్యాటింగ్‌తో చెలరేగారు.



నితీశ్, రింకూలు టీ20ల్లో తొలి అర్ధ సెంచరీతో వారెవ్వా అనిపించారు. వీళ్ల దూకుడుకు నీరుగారిపోయిన బంగ్లా బౌలర్లు ఎక్కడ బంతులు వేయాలో తెలియక తలలు పట్టుకున్నారు. ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ జోడీ నాలుగో వికెట్‌కు 107 పరుగుల కలిపింది. ఈ జోడీని ముస్తాఫిజుర్ విడదీసినా.. హార్దిక్ పాండ్యా(32), రియాన్ పరాగ్(15)లు దుమ్మురేపారు. దాంతో, 19వ ఓవర్‌లో టీమిండియా స్కోర్ 200 దాటింది. నితీశ్, రింకూలు దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపి స్కోర్ బోర్డును పరుగెత్తించారు. ఆ తర్వాత వచ్చిన హార్దిక్ పాండ్యా(32; 19బంతుల్లో 2ఫోర్లు, 2సిక్సర్లు) ఆ విధ్వంసాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాడు. దీంతో టి20 క్రికెట్‌లో బంగ్లాదేశ్‌పై టీమిండియా అత్యధిక స్కోర్‌ను నమోదు చేసింది. తొలుత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(8), సంజూ శాంసన్(10), అభిషేక్ శర్మ(15) బ్యాటింగ్‌లో రాణించలేకపోయారు. దీంతో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 221పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బౌలర్లు రిషాద్ హొస్సైన్‌కు మూడు, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్, ముస్తాఫిజుంకు రెండేసి వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి)శాంటో (బి)తస్కిన్ 10, అభిషేక్ శర్మ (బి)తంజిమ్ హసన్ 15, సూర్యకుమార్ యాదవ్ (సి)శాంటో (బి)ముస్తాఫిజుర్ 8, నితీశ్ రెడ్డి (సి)మెహిదీ హసన్ (బి)ముస్తాఫిజుర్ 74, రింకు సింగ్ (సి)జాకెర్ అలీ (బి)తస్కిన్ అహ్మద్ 53, హార్దిక్ పాండ్యా (సి)మెహిదీ హసన్ (బి)రిషాద్ 32, రియాన్ పరాగ్ (సి)మహ్మదుల్లా (బి)తంజిమ్ హసన్ 15, సుందర్ (నాటౌట్) 0, చక్రవర్తి (సి)పర్వేజ్ హొస్సైన్ (బి)రిషాద్ 0, అర్ష్‌దీప్ సింగ్ (సి)లింటన్ దాస్ (బి)రిషాద్ హొస్సైన్ 6, మయాంక్ యాదవ్ (నాటౌట్) 1, అదనం 7. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 221పరుగులు.

వికెట్ల పతనం: 1/17, 2/25, 3/41, 4/149, 5/185, 6/213, 7/214, 8/214, 9/220.

బౌలింగ్: మెహిదీ హసన్ 3-0-46-0, తస్కిన్ అహ్మద్ 4-0-16-2, తంజిమ్ హసన్ 4-0-50-2, ముస్తాఫిజుర్ 4-0-36-2, రిషాద్ హొస్సైన్ 4-0-55-3, మహ్మదుల్లా 1-0-15-0

చరిత్ర సృష్టించిన మహిళల టిటి జట్టు

ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్



అస్తానా(కజకిస్తాన్): ఆసియా మహిళల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో మనిక బత్రా, ఐహికా, సుతీర్థ ముఖర్జీలతో కూడిన భారత టిటి జట్టు చరిత్ర సృష్టించింది. భారత్‌కు కాంస్య పతకాన్ని ఖాయం చేసి భారత మహిళల టిటి జట్టు ఈ ఫీట్‌ను సాధించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 1-3తేడాతో జపాన్ చేతిలో ఓటమిపాలైంది. మరో మ్యాచ్‌లో చైనా 3-0తో హాంకాంగ్‌ను చిత్తుచేసింది. సెమీస్‌లో ఓడిన ఇరుజట్లకు కాంస్య పతకాలు దక్కనున్నాయి. ఈ టోర్నీ చరిత్రలో భారత్‌కు ఓ పతకంకు దక్కడం ఇదే తొలిసారి. సెమీస్ తొలి సింగిల్స్‌లో ఐహిక 2-3 (8-11, 11-9, 8-11, 13-11, 7-11)తో మివా హరిమ్ చేతిలో ఓడింది. రెండో సింగ్స్‌లో సుతీర్థ 3-0 (11-9, 11-4, 15-13) ఓడింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో మనిక బత్రా 3-1 (11-3, 6-11, 11-2, 11-3)తో ఓటమిపాలైంది. ఇక భారత పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్లో కజకిస్తాన్‌తో తలపడనుంది.

ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్యను పెంచాలి

సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. శ్రీనివాస్



● రైల్ నిలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఓయూ

ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్యను పెంచుతూ సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో సామాన్యులు చౌకగా ప్రయాణించగలిగే ఎంఎంటీఎస్ రైళ్లు ప్రస్తుతం వారికి దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైళ్ల సంఖ్య తగ్గిపోవడం, సమయపాలన లేకపోవడం, మరమ్మతుల పేరుతో రైళ్లు నిరంతరం రద్దవుతుండటం వల్ల ఎంఎంటీఎస్ ప్రయాణం పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారని చెప్పారు. ఎంఎంటీఎస్ ఫేస్ 2కు సంబంధించి 4 రూట్లలో రోజుకు ఒక్కటి లేదా రెండు రైళ్లు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. ఫలక్‌నుమా-లింగంపల్లి మధ్యలో కూడా రోజుకు రెండు రైళ్లను మాత్రమే నడుపుతున్నారన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌కు త్వరగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో ఎంఎంటీఎస్ రైళ్లు స్టేషన్ బయట చాలా సేపు ఆగాల్సి వస్తోందన్నారు.

ఎంఎంటీఎస్ రెండో దశ రూట్లతో కలుపుకొని రోజూ 5 లక్షల మందికిపైగా ప్రయాణించగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రస్తుతం రోజుకు 40 వేల మంది మాత్రమే ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణలో తీవ్ర వైఫల్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దాంతో రెండో దశ అభివృద్ధి కోసం రూ.900 కోట్లు ఖర్చు పెట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను త్వరలో ప్రారంభించబోతున్నారని..కానీ, ఎంఎంటీఎస్‌లను సరిపడా వేసి రెగ్యులర్‌గా నడిపించకపోతే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్యను పెంచాలని, రెండో దశలో నిర్మించిన రూట్లన్నింటిలో తగినన్ని రైళ్లు నడపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు కేఎస్ రాజన్న, ఎం.మహేందర్, దశరథ్, వెంకటేష్, నాగలక్ష్మి, ఎం.అజయ్ బాబు, అశోక్, మారన్న, వరలక్ష్మి, ఫాతిమా, ఆరు మల్లేష్, టి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక

ఖరీఫ్ నుంచే రూ.500 బోనస్

మిల్లర్ల సమస్యలపై ఉన్నతస్థాయి సమావేశం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాది (2024-25) ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో సిద్ధమైందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, కొనుగోళ్లపై మంత్రివర్గ సంఘం సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. పారదర్శకంగా, అక్రమాలకు తావివ్వకుండా కొనుగోళ్లు చేపడతామని చెప్పారు. ప్రజలు, రైతులు, మిల్లర్లను సమానంగా చూస్తామన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయంలో మిల్లర్లతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్న రకం ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం వద్ద పక్కా ప్రణాళిక ఉందని తెలిపారు. ఈ ఖరీఫ్ నుంచే రూ.500 బోనస్ చెల్లిస్తామని స్పష్టం చేశారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సాగు చేసిన వరి ధాన్యం రకాలు, విస్తీర్ణంపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఆన్‌లైన్ పాడీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో పొందుపరిచిందని వివరించారు. సన్నధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సన్నధాన్యం ఎత్తిన బస్తాలను ఎరుపురంగు దారంతో కుట్టాలని ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. దొడ్డురకం ధాన్యాన్ని పచ్చదారంతో



కుట్టాలని సూచించారు. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఆర్డీవో నేతృత్వంలో కమిటీలు వేసినట్టు చెప్పారు. ఈ కుబేర్ విధానంలో రైతులకు చెల్లింపులుంటాయని స్పష్టం చేశారు. మిల్లర్లు సహకరించాలనీ, వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బ్యాంక్ గ్యారంటీ ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉందనీ, ఒక రాష్ట్రంలో 100 శాతం ఉంటే, మరో రాష్ట్రంలో 50 శాతం ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సన్నాలకు డిమాండ్ ఉన్నందునే రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించి నట్టు స్పష్టం చేశారు. రూ.20 వేల కోట్లతో ఖరీఫ్ కొనుగోళ్లు చేపట్టినట్టు తెలిపారు. ఖరీఫ్ ధాన్యం ఎగుమతుల కోసం విదేశాలు, ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు చెప్పారు. రైస్ మిల్లింగ్ పరిశ్రమను ఆదుకునేందుకు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని ఈ సందర్భంగా మిల్లర్లు మంత్రివర్గ ఉప సంఘానికి నివేదించారు. రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886